


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50




సిటీ స్కై డ్రోన్స్ హై

సాక్షి, హైదరాబాద్: ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఫంక్షన్ల షూటింగ్ దాకా.. మందుల అత్యవసర సరఫరా నుంచి రోడ్డుపై ట్రాఫిక్‌ను పర్యవేక్షించేదాకా.. డ్రోన్ల వాడకం బాగా పెరిగిపోయింది. మరెన్నో రంగాలు, అవసరాలకూ డ్రోన్లు విస్తరిస్తున్నాయి. పదులు, వందల్లో కాదు.. రోజూ వేల సంఖ్యలో డ్రోన్లు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి. సరదాగా వాడే చిన్న చిన్న కెమెరా డ్రోన్ల నుంచి ఓ స్థాయిలో బరువులు, వస్తువులు మోసుకెళ్లే భారీ డ్రోన్ల దాకా దూసుకుపోతున్నాయి. దీంతో వాహనాలను నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్స్ ఎలాగైతే తప్పనిసరో అలా డ్రోన్లను ఎగరవేసేందుకు డ్రోన్ పైలట్ శిక్షణ తప్పనిసరి అయ్యే పరిస్థితి నెలకొంది. అధికారికంగా, అనధికారికంగా రాష్ట్రంలో సుమారు 3 వేల డ్రోన్లు వినియోగంలో ఉన్నట్టు అధికారుల అంచనా.

యాచారంలో డ్రోన్ అకాడమీ..

ఇప్పటివరకు డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇస్తున్న తెలంగాణ ఏవియేషన్ అకాడమీ (టీఎస్ఏఏ) త్వరలోనే డ్రోన్ల తయారీ, నిర్వహణ సేవలను సైతం అందించనుంది. నగర శివార్లలోని యాచారం మండలంలో డ్రోన్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం 20 ఎకరాల భూమి ని కేటాయించింది. భూమి సర్వే పనులు పూర్తయ్యాయి. మౌలిక వసతుల ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో ఏడాదిలో డ్రోన్ పోర్ట్ అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర ఏవియేషన్ అకాడమీ ఆపరేషనల్ మేనేజర్ సామల రాహుల్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంధనంతో నడుస్తూ, 150–200 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలిగే సామర్థ్యమున్న భారీ డ్రోన్లను నడిపే పైలట్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. వీటిని రక్షణ, నేవీ రంగాల్లో భద్రత కోసం వినియోగిస్తారని తెలిపారు. ఈ డ్రోన్లు 120 నుంచి 150 కిలోల వరకు బరువు ఉంటాయని వివరించారు.



- ట్రాఫిక్ నిర్వహణ, వీడియోగ్రఫీ, ఫంక్షన్లలో వినియోగం
- మందుల సరఫరా, సేద్యం, భూసర్వే, వాతావరణ పరిశీలన కూడా.. వ్యవసాయ రంగంలో కీలకంగా డ్రోన్లు.. వినియోగం, నిర్వహణపై వ్యవసాయ వర్సిటీ శిక్షణ
- డ్రైవింగ్ లైసెన్స్ లాగే డ్రోన్లు నడిపేందుకు పైలట్ సర్టిఫికెట్
- యాచారంలో డ్రోన్ అకాడమీకి 20 ఎకరాల భూమి
- డ్రోన్ల తయారీ, నిర్వహణ, పైలట్ శిక్షణ అన్నీ ఒకేచోట అందుబాటులోకి.. రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకుపైగా డ్రోన్లు వినియోగంలో ఉన్నట్టు అంచనా

నగర పరిధిలో అంతా డ్రోన్లమయం

డ్రోన్లతో ట్రాఫిక్ నిర్వహణ..

జంక్షన్లు, రద్దీ సమయంలో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి 'మావిక్ 3 పీఆర్‌ఓ' డ్రోన్‌ను సైబరాబాద్ పోలీసులు వినియోగిస్తున్నారు. దీనికి ఉండే నాలుగు అత్యాధునిక కెమెరాల సాయంలో ఏరియల్ ఫొటోలు, వీడియోలను చిత్రీకరిస్తూ రియల్ టైమ్‌లో ప్రసారం చేసే సామర్థ్యం ఈ డ్రోన్ సొంతం. దీంతో ట్రాఫిక్ పోలీసు బృందాలు ఆయా సమస్యలను వేగంగా పరిష్కరించే వీలు కలుగుతుంది. వాహనదారులు సులభంగా, వేగంగా ప్రయాణం చేయడానికి వీలుంటుంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వినాయక నిమజ్జనం, హనుమాన్ జయంతి, బోనాలు, శ్రీరామనవమి, షాబ్–ఈ–బరాత్ వంటి ర్యాలీలు, జాతరల సమయంలో డ్రోన్లను వినియోగిస్తూ నిఘా పెడుతున్నారు.



ఔషధాల సరఫరా కోసం

నగర శివార్లలోని బీబీనగర్‌లో ఉన్న ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) రెండు డ్రోన్లను వినియోగిస్తోంది. మారుమూల గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు క్షయవ్యాధి మందులను, టీబీ పరీక్షల కోసం కఫం నమూనాలను సైతం డ్రోన్లతో తరలిస్తున్నారు. ఈ ప్రాంతాలకు రోడ్డు మార్గంలో రెండు గంటలకుపైగా సమయం పడితే.. డ్రోన్‌తో కేవలం పది, ఇరవై నిమిషాల్లోపే అత్యవసర ఔషధాలను చేరవేస్తున్నారు. ప్రతిరోజు ఎయిమ్స్ క్యాంపస్‌లోని హ్యాంగర్ నుంచి యాదాద్రి జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు 8 కిలోల బరువు మోసే సామర్థ్యమున్న డ్రోన్‌తో మందులను సరఫరా చేస్తున్నారు.


టీబీ పరీక్షల కోసం..


వ్యవసాయ పనుల్లోనూ ఎంతో లాభం

వ్యవసాయ కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో విద్యావంతులైన కొందరు రైతులు డ్రోన్ల వినియోగం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. డ్రోన్ల వినియోగం, నిర్వహణ సేవలపై పలు డ్రోన్ తయారీ సంస్థలు, రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ డ్రోన్ అకాడమీ సంస్థలు శిక్షణ అందిస్తున్నాయి. సాధారణంగా ఎకరం పొలంలో పురుగు మందు పిచికారీకి ఒక రోజు సమయం పడుతుంది. పైగా రూ.700–1,000 వరకు ఖర్చు అవుతుంది. డ్రోన్‌తో పిచికారీ రూ.500–600 ఖర్చుతోనే 10 నిమిషాల్లో పూర్తవుతుంది. పైగా పురుగు మందు వల్ల చర్మ, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉండదు. పైగా డ్రోన్‌కు అమర్చే కెమెరాలతో పంటలను ఫొటో తీయడం, చీడ పురుగుల స్థాయిని గుర్తించడం తేలికవుతుంది. ఇక్రిశాట్ సంస్థ పంట రకాలను, దశలను అధ్యయనం చేయడానికి డ్రోన్లను వినియోగిస్తోంది. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సాయంతో విశ్లేషిస్తోంది.

వాతావరణ మార్పుల పరిశీలనకూ..

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) వాతావరణ పరిశోధన, అంచనాల కోసం డ్రోన్లను వినియోగిస్తోంది. వివిధ సెన్సార్లతో కూడిన డ్రోన్‌తో ఆకాశంలో అంతెత్తు వరకు వెళ్లి.. భూమి ఉపరితలం, వాతావరణ పరిస్థితుల డేటాను సేకరిస్తుంది. ఆ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వాతావరణ అంచనాలు, హెచ్చరికలను జారీ చేస్తున్నారు.

అటవీశాఖ పరిధిలోనూ..


అటవీ ప్రాంతాలు, తోటలు, నీటి మట్టం పర్యవేక్షణకు అటవీ శాఖ డ్రోన్లను వినియోగిస్తోంది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో ఏనుగు ఇద్దరు రైతులను తొక్కి చంపిన ఘటనలో ఆ ఏనుగు కదలికలను పర్యవేక్షించేందుకు అధికారులు డ్రోన్లను ఉపయోగించారు. అలాగే పులుల సంచారాన్ని గుర్తించేందుకూ డ్రోన్లను వినియోగిస్తున్నారు.

డ్రోన్ ఎగురవేయాలంటే లైసెన్స్ తప్పనిసరి.. **శిక్షణకు ఫీజు ఎంత?** వివరాలు IIలో

యోగమస్తు..

సంప్రదాయ భారతీయ యోగా ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది.
మన దేశస్తులతో పోటీ పడుతూ విదేశీయులు కూడా ఆరోగ్య'యోగ'ం కోసం తపిస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాల్లో మమేకమైన ఆసనం...
ఇప్పుడు ఆరోగ్యార్థుల పాలిట శాసనంగా మారింది.
ఈ నేపథ్యంలో మన వాళ్లే కాకుండా పాశ్చాత్యులు కూడా యోగ సాధన కోసం నగరానికి క్యూ కడుతున్నారు.
మేము సైతం అంటూ యోగ మార్గానికి జై కొడుతున్నారు.

వివరాలు 11లో



డ్రోన్ పైలట్ లైసెన్స్ తీసుకోవాలి

లైసెన్స్ లేకుండా కమర్షియల్ డ్రోన్లను వినియోగించడం నేరం



వాహనాలు నడిపేందుకు ఎలాగైతే డ్రైవింగ్ లైసెన్స్ కావాలో అలాగే డ్రోన్‌ను ఎగరవేసేందుకు కూడా సర్టిఫికెట్ కావాల్సిందే. వాణిజ్య అవసరాల కోసం డ్రోన్ వినియోగించే ప్రతీ ఒక్కరికీ 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)' అనుమతి పొందిన సంస్థ నుంచి డ్రోన్ పైలట్ సర్టిఫికెట్ ఉండాల్సిందే. ఆ లైసెన్స్ లేకుండా కమర్షియల్ డ్రోన్లను వినియోగించడం చట్టరీత్యా నేరం. ఈ సర్టిఫికెట్‌కు పదేళ్ల కాల పరిమితి ఉంటుంది. తర్వాత రెన్యూవల్ చేసుకోవాలి.

ఫీజు రూ. 38వేలు...



దినకర్‌రెడ్డి,
టీఎస్ఏఏ డైరెక్టర్

నాలుగేళ్లలో తెలంగాణ డ్రోన్ అకాడమీ నుంచి 600 మందికిపైగా విద్యార్థులు డ్రోన్ పైలట్లుగా శిక్షణ పొందారు. ఐదు రోజుల కోర్సు ఉంటుంది. ఫీజు రూ.38 వేలు. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ శిక్షణ కోసం వస్తున్నారు. ఇప్పటివరకు శిక్షణ పొందినవారిలో 30 మందికిపైగా మహిళా డ్రోన్ పైలట్లు ఉండటం గమనార్హం.



సామల రాహుల్‌రెడ్డి,
ఆపరేషన్ మేనేజర్,
టీఎస్ఏఏ

డ్రోన్లతో స్టార్టప్‌లు పెడుతున్నారు

వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా చాలా మంది డ్రోన్ పైలట్ శిక్షణపై ఆసక్తి చూపిస్తున్నారు. డ్రోన్ ఎలా ఆపరేట్ చేయాలి, నిర్వహణ ఎలా అనే అంశాలపై నైపుణ్యం కోసం మా దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. తర్వాత సొంతంగా డ్రోన్లతో స్టార్టప్‌లను ప్రారంభిస్తున్నవారూ ఉన్నారు.

అందనంత అద్దెలు


విద్యా సంస్థల పునఃప్రారంభంతో పెరిగిన కిరాయిలు
ఏడాదిలో 20-25 శాతం పెరిగిన గృహాల రెంట్లు
ఆఫీసులకు చేరువలోని ఐటీ ప్రాంతాల్లో డిమాండ్

ఆధునిక వసతులుండే అపార్ట్‌మెంట్లలో అద్దెలకు గిరాకీ.. 3-4 నెలల అడ్వాన్స్, మెయింటెనెన్స్‌లతో అద్దెదారులపై భారం

సాక్షి, హైదరాబాద్

''ఇందుమతి మాదాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటోంది. 2 బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.15 వేలతో మొదలై.. ఏటా 10 శాతం పెరుగుదలతో గత ఐదేళ్లలో కిరాయి రూ.22,500కు చేరింది. మెయింటెనెన్స్ చార్జీలు అదనం. అయితే ఇటీవలే ఇంటి యజమాని ఆమెకు ఫోన్ చేసి ఈ నెల నుంచి రూ.5 వేలు రెంట్ అదనంగా పెంచుతున్నట్లు చెప్పాడు. ఇష్టముంటే ఉండండి.. లేకపోతే ఖాళీ చేయండంటూ హుకుం జారీ చేశాడు. ఇప్పటికప్పుడు వేరే ఇల్లు వెతుక్కోవడం, షిఫ్టింగ్ అంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. వీటికి తోడు స్థానికంగా ఓ ప్రముఖ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లల చదువుకు ఆటంకం కలుగుతుంది. దీంతో చేసేదేం లేక అదనపు అద్దెకు అయిష్టంగానే ఒప్పుకుంది.''

ఇది ఇందుమతి ఒక్కరికే కాదు నగరంలోని చాలా మంది పరిస్థితి ఇదే. విద్యా సంస్థలు, కార్యాలయాలు పునఃప్రారంభం కావడంతో నగరంలో అద్దెలకు డిమాండ్ బాగా పెరిగింది. ఒక ప్రాంతానికో లేదా కాలనీకో ఇది పరిమితం కాలేదు. కాస్త పేరున్న ప్రతి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి ఉంది.



స్కూళ్లు, ఆఫీసులున్న చోట హాట్‌కేక్‌లు..

పేరున్న విద్యాసంస్థలు, ఆసుపత్రులకు చేరువలో ఉన్న ప్రాంతాల్లో గృహాలకు డిమాండ్ విపరీతంగా ఉంది. కరోనా సమయంలో ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ ఉండటంతో చాలా మంది సొంతూర్లకు వెళ్లిపోయారు. దీంతో నగరంలో చాలా వరకు టులెట్ బోర్డులు కనిపించేవి కానీ, కరోనా ప్రభావం నుంచి పూర్తిగా కోలుకున్న కంపెనీలు ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పించాయి. దీంతో ఆఫీసులకు చేరువలో ఉన్న ప్రాంతాలలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇండిపెండెంట్ హౌస్‌లలో కిరాయిలు హాట్‌కేక్‌లా మారాయి. అమీర్‌పేట, ఎస్‌ఆర్ నగర్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, మణికొండ, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, కొంపల్లి వంటి ప్రాంతాల్లో అద్దెలు గణనీయంగా పెరిగాయి. కరోనా తర్వాత ఇంటి అద్దెలు కొన్ని చోట్ల రెట్టింపయ్యాయి. గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో అద్దెలు ఆరు నెలల కాలంలో 15 శాతానికి పైగానే పెరిగాయి. బేగంపేట, ప్రకాశ్ నగర్, సోమాజిగూడ, పంజగుట్ట, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, అల్వాల్ ప్రాంతాల్లో 20-25 శాతం అద్దెలు పెరిగాయి.

నడ్డివిరుస్తున్న అద్దెలు..

హైదరాబాద్‌లో ఇంటి అద్దెలు కిరాయిదారుల నడ్డి విరుస్తున్నాయి. తమ జీతాలు తప్ప అన్నీ పెరుగుతున్నాయంటూ నిట్టూర్చే సగటు జీవి.. పెరిగిన ఈ అద్దెలను భరించలేక నగర శివార్లకు తరలి వెళ్తుండటంతో అక్కడ కూడా అద్దెలు భారీగానే పెరుగుతున్నాయి. అనరాక్ సంస్థ ఇటీవల విడుదల చేసిన ఓ అధ్యయనం ప్రకారం హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో అద్దెలు గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం తొలి మూడు నెలల కాలంలోనే 10-15 శాతం పైగానే పెరిగాయి. గతంలో రూ.10-15 వేలకు నగరం నడి మధ్యలో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు అద్దెకు లభించేవి. కానీ, ఇప్పుడు రూ.20-25 వేలకు పైగా ఖర్చు చేస్తే కానీ దొరకని పరిస్థితి.

అడ్వాన్స్‌లు, మెయింటెనెన్స్‌ల భారం కూడా..


ఇంటిని అద్దెకు ఇవ్వాలంటే 3-4 నెలలు అడ్వాన్స్‌ను ఇంటి యజమానులు వసూలు చేస్తున్నారు. పైగా ఫ్లాట్ అద్దెతో పాటు ప్రతి నెలా మెయింటెనెన్స్ వ్యయం కూడా అద్దెదారుల పైనే పడుతుంది. 2 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ అద్దె రూ.25 వేలు ఉండగా.. నిర్వహణ ఖర్చు రూ.2 నుంచి రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

అద్దె చట్టం ఏం చెబుతోందంటే..

- అద్దెదారుడు, యజమాని మధ్య నిబంధనలు.. షరతులతో కూడిన రెంటల్ అగ్రిమెంట్ రాసుకోవాలి. దీన్ని సంబంధిత జిల్లా రెంట్ అథారిటీకి సమర్పించాలి.
- ఒకవేళ అద్దెదారుడు ఇంటిని ఖాళీ చేయాలని భావిస్తే యజమానికి మూడు నెలల ముందు తెలపాలి.



- కిరాయిదారుడు ఇంటి లోపల విద్యుత్ వైర్లు, బోరు, నల్లా, టైల్స్, బాత్‌రూమ్, శానిటేషన్ వంటి వాటికి నష్టం కలిగించకూడదు. రిపేర్లకు సంబంధించి అయ్యే ఖర్చును యజమానే భరించాలి.
- **ఓనర్ నాన్ కమర్షియల్ బిల్డింగ్ లేదా ఇళ్లకు సంవత్సరానికి 8 నుంచి 10 శాతానికి మించి అద్దె పెంచకూడదు. అది కూడా 3 నెలల ముందే కిరాయిదారునికి నోటీసు అందించాలి.**
- కిరాయిదారులు, యజమానుల వివాదాలను పరిష్కరించడానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక అద్దె అధికారులు, కోర్టు, ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేయాలి.
- **అద్దెదారుడు ప్రాపర్టీకి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించి బ్యాంకులో తనఖా పెట్టడం, రుణాలు తీసుకోవడం వంటి అక్రమాలకు పాల్పడకూడదు.**




కరోనా తర్వాత నుంచి..

కరోనా కాలంలో నివాస అద్దెలు దీర్ఘకాలం పాటు నిలిచిపోయాయి. ఆఫీసుల పునఃప్రారంభం తర్వాత నుంచి అద్దెలకు డిమాండ్ పెరిగింది. హైదరాబాద్, బెంగళూరు, పుణే, ముంబై వంటి ప్రధాన నగరాల్లో కిరాయిలు గణనీయంగా పెరుగుతున్నాయి. కేంద్రం, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వాలు తీసుకునే విధానపరమైన నిర్ణయాలతో రానున్న రోజుల్లో నగరాలు అభివృద్ధి చెందడం ఖాయం. దీంతో సమీప భవిష్యత్తులో నివాసాలకు మరింత డిమాండ్ ఏర్పడుతుంది.



- అనూజ్ పూరీ,
చైర్మన్, అనరాక్ గ్రూప్



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 90

శుక్రవారం 21-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అఫ్గాన్‌పై అలవోకగా..
'సూపర్‌–8' మ్యాచ్‌లో 47 పరుగులతో నెగ్గిన భారత్ -15లో



చల్ వాహన రంగా!
రూ.2 లక్షల కోట్ల పెట్టుబడికి ఆటోమొబైల్ కంపెనీల ప్రణాళికలు -15లో



మోదీ పేపర్ లీకేజీలు ఆపలేరా?
యుద్ధాలను ఆపే శక్తి ఉందనే ప్రధాని మోదీకి దేశంలో పేపర్ లీకేజీలను ఆపే శక్తి లేదా? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. వివరాలు 6లో ▸



రిజర్వేషన్ల పెంపు చెల్లదు
బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 50% నుంచి 65 శాతానికి పెంచుతూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టేసింది. వివరాలు 6లో ▸



నీట్ పేపర్ లీకేజీ నిజమే
బిహార్‌లో చోటుచేసుకున్న నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ నిజమేనని పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. వివరాలు 6లో ▸



రాజ్‌భవన్‌లో భద్రత లేదు
రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న పోలీసులతో తన భద్రతకు ముప్పు ఉందని బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ తీవ్ర ఆరోపణలు చేశారు. వివరాలు 6లో ▸

సింగరేణి 'సెగ'పట్లు

నేడు దేశంలోని 60 బొగ్గు గనుల వేలం

ప్రారంభించనున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ఇందులో సింగరేణి ఏరియాలోని శ్రావణపల్లి బ్లాకు సైతం ఉండటంతో రాజకీయ దుమారం

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఆరోపణ

- ప్రైవేటీకరణ ప్రశ్నే ఉత్పన్నం కాదన్న కేంద్ర మంత్రి
- గత సర్కారు సింగరేణిని వేలంలో పాల్గొనకుండా చేసి నష్టం కలిగించిందంటూ కిషన్‌రెడ్డి విమర్శలు
- బీఆర్‌ఎస్ పెద్దలు అనుయాయులకే సింగరేణి గనులు దక్కేలా చేసుకున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి ఫైర్
- రాజకీయ విమర్శల నేపథ్యంలో వేలానికి సింగరేణి దూరం?

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో సింగరేణి బొగ్గు గనుల అంశం మంటలు రేపుతోంది. సింగరేణి ప్రాంతం పరిధిలోని ఓ బొగ్గు గని వేలానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావడంతో దుమారం చెలరేగింది. కేంద్రం, రాష్ట్రంలోని అధికార, విపక్ష పార్టీల నేతలు పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఒకవైపు సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్తున్న కేంద్ర ప్రభుత్వం.. మరోవైపు దేశంలోని 60 బొగ్గు గనుల వేలం ప్రక్రియను శుక్రవారం తెలంగాణ గడ్డ నుంచే ప్రారంభిస్తుండటం, ఇందులో సింగరేణి ఏరియా పరిధిలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకు కూడా ఉండటం చర్చనీయాంశంగా మారింది. శ్రావణపల్లి బ్లాకులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు గతంలో సింగరేణి నిర్వహించిన భూగర్భ సర్వేలో తేలింది. సింగరేణి ఏరియాలో ఉన్న ఈ బొగ్గు బ్లాకును వేలం వేయకుండా, నేరుగా సింగరేణికే కేటాయించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డిమాండ్



చేసినా.. కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.

సింగరేణి ఏరియాలోని బొగ్గు బ్లాకులపై..

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో 10వ విడత బొగ్గు గనుల వేలం ప్రక్రియను ప్రారంభించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సైతం ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీనిపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ తీవ్రంగా మండిపడుతోంది. సింగరేణి సంస్థను కాపాడుతామని పైకి చెప్తున్న కేంద్రం.. సింగరేణి ఏరియా పరిధిలోని బొగ్గు బ్లాకులకు వేలం నిర్వహిస్తుండటం మిగతా 2వ పేజీలో ▸

సింగరేణిని బీఆర్‌ఎస్ బొంద పెట్టింది



బొగ్గు గనుల వేలంలో బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు

ఇప్పుడు దొంగే దొంగ అన్న చందంగా ఆరోపణలు

- గనులు సింగరేణికే కేటాయించాలి
- త్వరలో సీఎం ఆధ్వర్యంలో అఖిలపక్షంతో ప్రధాని వద్దకు..
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడి

2లో

సింగరేణిని ముంచే కుట్ర!



గనులపై కేంద్రం కత్తి పెడితే రాష్ట్ర ప్రభుత్వం సాన పడుతోంది: కేటీఆర్

- బొగ్గుగనులు సింగరేణి కాలరీస్‌కే కేటాయించాలి
- వేలం ద్వారా ప్రైవేటుకు కేటాయిస్తే ఉద్యమిస్తాం

2లో

బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోండి

అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు 2లో

అధికారంలో ఉన్నా.. ఆశ తీరలేదేం?

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ మార్క్ పోస్టుమార్టం

టీపీసీసీ నివేదికలను కాదని ముగ్గురు సీనియర్లతో ప్రత్యేక కమిటీ

- తెలంగాణ ఫలితాలు ఆశాజనకంగా లేవనే అభిప్రాయంతో హైకమాండ్.. త్వరలోనే తెలంగాణకు రానున్న కమిటీ.. ఓడిన అభ్యర్థులతో మాట్లాడే అవకాశం
- ఈ త్రిసభ్య కమిటీ నివేదిక తర్వాత టీపీసీసీ ప్రక్షాళన!
- ఎన్నికల్లో పనిచేయని నేతలకు ఝలక్ ఇస్తారంటూ గాంధీభవన్ వర్గాల్లో చర్చ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను కనీసం 11–12 చోట్ల గెలుస్తామని.. పరిస్థితి సానుకూలంగా ఉంటే 14 సీట్లు వస్తాయని కాంగ్రెస్ హైకమాండ్ లెక్కలు వేసుకుంది. తక్కువలో తక్కువగా 10 స్థానాలైనా గెలుస్తామని భావించింది. కానీ ఫలితాలు గతం కంటే మెరుగే అయినా.. 8 స్థానాల్లోనే కాంగ్రెస్ గెలిచింది. అదే సమయంలో బీజేపీ కూడా ఇదే సంఖ్యలో సీట్లు సాధించింది. దీంతో తెలంగాణలో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఎందుకు రాలేదని.. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశమున్నా ఎందుకిలా జరిగిందని అధిష్టానం పోస్టుమార్టం ప్రారంభించింది. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలను సమీక్షించేందుకు రాజ్యసభ మాజీ చైర్మన్ కురియన్, అసోం ఎంపీ రకీబుల్ హసన్, పంజాబ్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్‌లతో కమిటీని ఏర్పాటు చేసింది. నిజానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ నుంచి ఇప్పటికే అధిష్టానానికి నివేదిక వెళ్లింది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా తన నివేదికను అందించారు. కాంగ్రెస్ అధిష్టానం వాటిని కాదని కమిటీని ఏర్పాటు చేయడం గాంధీభవన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఏం చేస్తారు.. ఎక్కడికి వెళ్తారు?

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల పనితీరుపై సమీక్షతోపాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం రూపొందించే కార్యాచరణ కోసమే కొత్తగా త్రిసభ్య కమిటీని నియమించారనే చర్చ మిగతా 2వ పేజీలో ▸

న్యూస్‌రీల్

చొప్పదండి ఎమ్మెల్యే భార్య ఆత్మహత్య!



భర్తతో రూపాదేవి (ఫైల్)

అల్వాల్(హైదరాబాద్): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లోని పంచశీలకాలనీలో తన కూతురుతో కలిసి నివాసముంటున్న రూపాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. గురువారం తాను నివాసముంటున్న ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఆమెను కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. రూపాదేవి మృతదేహాన్ని అదే ఆస్పత్రిలో ఉంచారు. మేడిపల్లి సత్యం, రూపాదేవిది ప్రేమ వివాహం. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా ఎమ్మెల్యే సత్యంను ఆస్పత్రి వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.

ఈవీఎంలు వెరిఫికేషన్ చేయండి



లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలపై కొందరు అభ్యర్థులు అనుమానాలు వ్యక్తంచేస్తూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఈవీఎంలలోని మైక్రో–కంట్రోలర్ చిప్‌లు ట్యాంపరింగ్‌కు గురయ్యాయో లేదో తనిఖీ చేయాలని ఆయా ఎంపీ అభ్యర్థులు ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు.

- వివరాలు 6లో ▸

'ఉక్కు'పాతర

విశాఖ స్టీల్ ఆస్తుల అమ్మకాలు షురూ

- అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే బుద్ధి చూపించిన ఎన్‌డీఏ సర్కార్
- ప్లాంట్‌ను దివాలా సంస్థగా ముద్రవేసే ప్రయత్నం
- మూలధన సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి ఏర్పాట్లు

వివరాలు 12లో ▸

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు

- వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి



కమిటీల పనితనంపై కూడా మరో మూడు కమిటీలు వేద్దాం సార్!

జోసా కౌన్సెలింగ్‌లో జోష్

ఎక్కువ మందికి సీట్లు వచ్చే అవకాశం

సీట్లు పెరగడంతో భారీగా పెరిగిన కటాఫ్

తొలిదశ సీట్లు కేటాయింపు పూర్తి

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో ఈ ఏడాది భారీ మార్పు కన్పిస్తోంది. గత ఏడాది కన్నా ఈసారి కటాఫ్ బాగా పెరిగింది. దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం తొలిదశ సీట్లు కేటాయించింది. అయితే ఈసారి ఐఐటీల్లో 900 సీట్లు అదనంగా పెరిగాయి. దీంతో సీట్ల కేటాయింపు కటాఫ్ పెరిగింది. ముంబై ఐఐటీలో బాలికల విభాగంలో గత ఏడాది 305 ర్యాంకుకు సీటు వస్తే, ఈసారి 421వ ర్యాంకు కూడా సీటు వచ్చింది. హైదరాబాద్ మిగతా 3వ పేజీలో ▸



కేజ్రీవాల్‌కు బెయిల్



రూ. లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు

దర్యాప్తునకు ఆటంకం కలిగించరాదని.. సాక్షులను ప్రభావితం చేయరాదని ఆదేశం

అవసరమైనప్పుడల్లా కోర్టు విచారణకు హాజరు కావాలని స్పష్టీకరణ

48 గంటలపాటు ఉత్తర్వులు నిలుపుదల చేయాలన్న ఈడీ అభ్యర్థన తిరస్కృతి

నేడు తిహార్ జైలు నుంచి విడుదల కానున్న ఢిల్లీ ముఖ్యమంత్రి!

6లో

ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉందాం

వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

ఎవరూ ఆందోళన చెందొద్దని మనవాళ్లకు వివరించండి



- మన సంఖ్య తక్కువే కాబట్టి అసెంబ్లీలో చేయగలిగేదీ తక్కువే
- జగన్ ఓడిపోయాడు కానీ.. చనిపోలేదు.. చచ్చేదాకా కొట్టాలన్న వ్యక్తిని స్పీకర్‌గా చేస్తున్నారు
- ఇలాంటి వ్యక్తుల మధ్య అసెంబ్లీలో మనం ఏదో చేయగలుగుతామనే నమ్మకం లేదు.. ఇప్పుడిది ఇంటర్వెల్ మాత్రమే.. శకుని పాచికల ఘట్టం
- అంతిమంగా ధర్మం, విశ్వసనీయత, నిజాయితీ గెలుస్తాయి

12లో

> ప్రభుత్వ కార్యాలయాల్లో మేనిఫెస్టో కనిపించిన పాలన మనదైతే.. ఇప్పుడు రెడ్ బుక్ హోర్డింగ్‌లు పెడుతున్నారు. ఏ అధికారిపై కక్ష సాధించాలి? ఎవరిపై దాడులు చేయాలి? ఎవరిని నాశనం చేయాలి? ఎవరిపై కక్ష సాధించాలి? అని అందులో ఏకంగా పేర్లు రాసుకుంటున్నారు. వాళ్లను కొడతాం, చంపుతామంటూ నిస్సిగ్గుగా దౌర్జన్యం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. శిశుపాలుడి పాపాల మాదిరిగా ఈ ప్రభుత్వం పాపాలు వేగంగా పండుతున్నాయి. - వైఎస్ జగన్

రుణమాఫీకి పరిమితులు?

సూత్రప్రాయంగా నిర్ణయించిన రాష్ట్ర సర్కారు

పేద రైతులందరికీ న్యాయం.. ధనిక రైతులు ఔట్

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లకు నో

ఐటీ చెల్లించే కొందరికి పూర్తిగా కట్ చేసే యోచన

పీఎం కిసాన్ మార్గదర్శకాల్లో కొన్నిఅమలు చేసే చాన్స్

ప్రజల్లో వ్యతిరేకత వస్తుందా అనే సంశయంలో సర్కార్

నేడే కేబినెట్ ప్రత్యేక భేటీ.. రుణమాఫీ మార్గదర్శకాలపై ఉత్కంఠ.. కటాఫ్ తేదీపై స్పష్టత.. నిధుల సమీకరణపై వీడనున్న గందరగోళం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల రుణ మాఫీకి ఆంక్షలు విధించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. అనర్హులకు రుణమాఫీతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదని.. అర్హులందరికీ పూర్తి న్యాయం జరిగేలా రుణమాఫీ ప్రక్రియ ఉంటుందని అధికారులు చెప్తున్నారు. రుణమాఫీ అంశంపై శుక్రవారం తెలంగాణ కేబినెట్ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. ఈ సమావేశంలోనే పూర్తిస్థాయిలో చర్చించి రుణమాఫీపై ఒక నిర్ణయానికి వస్తారని.. మార్గదర్శకాలకు ఒక రూపం ఇస్తారని తెలిసింది. ఇందుకు సంబంధించి వ్యవసాయ, ఆర్థిక శాఖలు పెద్ద ఎత్తున మిగతా 5వ పేజీలో ▸

ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 సీట్లలో గెలుస్తాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా

- భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో అధికారంలోకి వస్తాం
- పార్టీ కార్యకర్తలకు శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నా
- 'సెల్యూట్ తెలంగాణ' పేరిట కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సన్మానం
- 'గోల్డెన్ టెంపుల్'గా భాగ్యలక్ష్మి ఆలయం: కేంద్ర మంత్రి బండి

12లో



సెల్యూట్ తెలంగాణ సన్మాన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్. చిత్రంలో ధర్మపురి అర్వింద్, కె. లక్ష్మణ్, రాంచందర్‌రావు, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పొగచూరుతున్న బాల్యం!

వాయు కాలుష్యంతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి

దేశంలో రోజుకు సగటున 464 మంది మృత్యువాత	పోషకాహార లోపం తర్వాత రెండో ప్రమాదకారి వాయు కాలుష్యమే	'హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్' తాజా అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వాయు కాలుష్యంతో పసి మొగ్గలు రాలిపోతున్నాయి. ఐదేళ్లలోపు పిల్లల ఊపిరితిత్తులు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఫలితంగా దేశంలో రోజూ సగటున 464 మంది మృత్యువాత పడుతున్నారు. అమెరికాకు చెందిన లాభాపేక్షలేని పరిశోధనా సంస్థ 'హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్' తొలిసారిగా 'స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ ఎయిర్-2024' నివేదికను విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలివీ..

పిల్లలకు న్యుమోనియా, పెద్దలకు ఆస్తమా

మానవ ఆరోగ్యంపై పీఎం (పర్టిక్యులేట్ మ్యాటర్)-2.5, నైట్రోజన్ డయాక్సైడ్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గాలి కాలుష్యంతో పిల్లలు న్యుమోనియా బారిన, పెద్దలు ఆస్తమా బారిన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది కాలంలో వాయు కాలుష్యం సంబంధమైన వ్యాధుల కారణంగా 81 లక్షల మంది మరణించగా.. ఇందులో 7 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులే. ఇందులో సుమారు 5 లక్షల మంది పిల్లలు గృహాల నుంచి విడుదలయ్యే కాలుష్యం కారణంగానే మృత్యువాతపడ్డారు. ఇక, మన దేశంలో 21 లక్షల మంది చనిపోగా.. అత్యధికంగా చైనాలో 23 లక్షల మంది కన్నుమూశారు.

శ్వాస, నాడీ వ్యవస్థలపై ప్రభావం

అడ్డూఅదుపు లేని మానవ చర్యల కారణంగా వాయు కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. స్వచ్ఛమైన గాలి కరువైపోతోంది. ఫలితంగా అనునిత్యం భారీగా కాలుష్యకారకాలు ఊపిరితిత్తుల్లోకి చేరిపోతున్నాయి. ప్రధానంగా ఇది చిన్నారులపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపిస్తోంది. ఎదుగుతున్న దశలో ఉన్న వారి శ్వాస, నాడీ వ్యవస్థలను దెబ్బతీసి, ప్రాణసంకటంగా మారుతోంది. ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలకు ప్రధాన కారణం పోషకాహార లోపం కాగా.. రెండో అత్యంత ప్రమాదకారి వాయు కాలుష్యమే. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు నెలలు నిండక ముందే పుట్టడం, తక్కువ బరువుతో జన్మించడం, ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ప్రమాద ఘంటికలిలా..

- బాల్యంలో అధిక మోతాదులో వాయు కాలుష్యం బారినపడితే పెద్దయ్యాక గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది.
- వాయు కాలుష్యం ఎక్కువైతే చిన్నారుల్లో మెదడు, నాడీ వ్యవస్థలో వృద్ధి మందగిస్తుంది. విషయ పరిజ్ఞాన సామర్థ్యం తగ్గుతుంది.
- ఉబ్బసం ముప్పు పెరుగుతుంది. చిన్నతనంలోనే కేన్సర్ వచ్చే ప్రమాదం లేకపోలేదు.
- నవజాత శిశువులకు ఇళ్లల్లోని వాయు కాలుష్యం ముప్పు ఎక్కువ.
- గర్భిణీలు కలుషితమైన గాలికి గురైతే.. వారికి నెలలు నిండకుండానే కాన్పు అయి తక్కువ బరువుతో శిశువులు జన్మించే ప్రమాదం ఉంది.

ఏం చేయాలంటే..

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్దేశించిన వాయు నాణ్యత ప్రమాణాలను చేరుకోవడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి.
- శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించాలి. ఇంధన సమర్థతను పెంచడంపై పెట్టుబడులు పెంచాలి.
- పునర్వినియోగ వనరులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.
- బహిరంగంగా వ్యర్థాలను కాల్చడం తగ్గించాలి. వ్యర్థాల నిర్వహణ మెరుగుపడాలి.
- రద్దీగా ఉండే రోడ్లు, కర్మాగారాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు వాయు కాలుష్యానికి ప్రధాన కారణం. కాబట్టి విద్యా సంస్థలు, క్రీడా మైదానాలు వీటికి దూరంగా ఏర్పాటు చేస్తే చిన్నారులను ఈ విషతుల్య వాయువుల నుంచి కాపాడొచ్చు.
- రహదారుల వెంబడి ఆక్సిజన్ జనరేటర్లు, బూస్టర్లను ఏర్పాటు చేయాలి.
- ఎలక్ట్రిక్ వాహనాలను లేదా సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థలను వినియోగించాలి.

క్లుప్తంగా...

తెలంగాణ 'జాతిపిత' జయశంకర్‌కు సీఎం రేవంత్ నివాళి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సిద్ధాంతకర్త, జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి (జూన్ 21న) సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు జయశంకర్ అని గురువారం ఓ ప్రకటనలో కొనియాడారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు జనాన్ని జాగృతం చేయటంలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు. ఆయన తుది శ్వాస వరకు తెలంగాణ కోసమే పరితపించారని అందుకే తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తన అనుభవాన్ని మొత్తం తెలంగాణకు ధారపోసి, రాష్ట్ర ఏర్పాటుకు ముందే అన్ని రంగాల్లో మన రాష్ట్రానికి ఉన్న ఉజ్వల భవిష్యత్తును వీక్షించిన స్వాప్నికుడు జయశంకర్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటని రెవెన్యూ విలేజ్‌గా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ సాధనకు జీవితాన్ని అర్పించిన వ్యక్తి జయశంకర్

నేడు ఆయన వర్ధంతి సందర్భంగా కేసీఆర్ నివాళి



సాక్షి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన, ఆ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొనియాడారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని కేసీఆర్ నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర కోసం సాగిన చివరి దశ పోరాటంలో, ఉద్యమ రథ సారథిగా తనను ముందు నడుపుతూ జయశంకర్ అందించిన ప్రోత్సాహం జీవితంలో మరిచిపోలేనిదని ఆయన సేవలను గురువారం ఓ ప్రకటనలో స్మరించుకున్నారు. తెలంగాణ సాధన కోసం అనుసరించాల్సిన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యూహాలకు, తన ఉద్యమ కార్యాచరణకు ఆయన ఇచ్చిన సైద్ధాంతిక నైతిక మద్దతు మహోన్నతమైనదని కొనియాడారు.

ఐటీ నోటీసులంటూ ఫేక్ ప్రచారం

చర్యలు తీసుకోవాలంటూ టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజినీకాంత్ ఫిర్యాదు



హిమాయత్‌నగర్: తనకు ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు వచ్చాయంటూ అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీవీ 9 మేనేజింగ్ ఎడిటర్ రజినీకాంత్ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాతోపాటు పలు యూట్యూబ్ చానళ్లు తనపై ప్రచారం చేస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐటీ నోటీసులు వచ్చాయని, ఆదాయ పన్ను అధికారులు కేసులు నమోదు చేశారంటూ, తన ఆస్తుల విషయంలో కుట్ర పూరితంగా అసత్య ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరగా, పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తి చేయండి

'అనంతగిరి'పై హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన అనంతగిరి జలాశయం కింద భూములు కోల్పోతున్న రైతులకు రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్(ఆర్‌అండ్‌ఆర్) ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులు వెలువడిన 6 వారాల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

సింగరేణిని బీఆర్ఎస్ బొంద పెట్టింది

బొగ్గు గనుల వేలంలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు
- గనులు సింగరేణికే కేటాయించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడి



ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తెలంగాణకు తలమానికంగా ఉన్న సింగరేణిని పదేళ్లలో బీఆర్ఎస్ సర్వనాశనం చేసి బొంద పెట్టిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. కేంద్రం గనులు, ఖనిజాల చట్టం-1957ను సవరించి దేశంలో బొగ్గుగనులకు వేలం నిర్వహించేలా చట్టం చేస్తే 2015లో ఈ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు పలికిందని, తెలంగాణ ప్రయోజనాల కోసమే ఆలోచించి ఉంటే బిల్లును వ్యతిరేకించి ఉండేవారన్నారు. అయితే, ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెబుతున్న మాటలు తెలంగాణ ప్రజలకు నష్టం కలిగించేలా ఉండగా.. దొంగే దొంగ అన్న చందంగా బీఆర్ఎస్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. భట్టి గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. సింగరేణిలో 42 వేల మంది ఉద్యోగులు, 26 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తుండగా, రాష్ట్రంలోని 40 గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందన్నారు. అయితే, త్వరలో 22 బొగ్గు గనులు మూసివేతకు గురికానుండగా, 2031 వరకు బొగ్గు ఉత్పత్తి జరగాలంటే కొత్తగా గనులు సాధించాల్సి ఉందని తెలిపారు.

అనుచరులకు దక్కేలా...

2021లో గనుల వేలంలో పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుంటే... వారం రోజుల్లోనే సంస్థ గనులు తీసుకోవద్దని నాటి సీఎం కేసీఆర్ నిర్ణయించారని భట్టి చెప్పారు. ఆయన అనుచర పారిశ్రామిక వేత్తలకు గనులు దక్కేలా కుట్ర చేశారని, అందులోభాగంగానే లిక్కర్ స్కామ్‌లో ఉన్న అరబిందో గ్రూపునకు చెందిన అరో మైనింగ్ కంపెనీకి కోయగూడెం బ్లాక్, ప్రతిమ గ్రూప్ కంపెనీకి చెందిన అవంతిక కాంట్రాక్టర్‌కు సత్తుపల్లి బ్లాక్ దక్కిందని చెప్పారు. తెలంగాణలో వదిలేసి ఒడిశాలో జరిగిన గనుల వేలంలో మాత్రం సింగరేణి పాల్గొనడం వెనుక బీఆర్ఎస్ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే కేంద్ర మంత్రిని కలిసి వేలం వేయకుండా బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వాలని కోరామని, అదీగాక ఇప్పుడు ఆ శాఖ కిషన్‌రెడ్డికి దక్కినందున రాష్ట్ర ప్రయోజనాల కోసం చొరవ తీసుకోవాలని కోరారు. వేలం లేకుండానే రాష్ట్రంలోని బొగ్గు గనులు సింగరేణికి కేటాయించాలని, దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలం ప్రక్రియ శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్నందున రాష్ట్ర ప్రభుత్వం నిరసిస్తోందని తెలిపారు. సింగరేణిపై కేటీఆర్, హరీశ్‌రావు చర్చకు వస్తే అన్ని ఆధారాలతో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని భట్టి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలతో కూడిన అఖిలపక్షంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో త్వరలో ప్రధానమంత్రి మోదీని కలుస్తామని పేర్కొన్నారు.

సింగరేణికే కేటాయించాలి: తుమ్మల

వేలం లేకుండా సింగరేణి సంస్థకే గనులు కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు వందేళ్లకు పైగా చరిత్ర ఉందని, బొగ్గు వెలికితీతలో ఈ సంస్థకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. 2016లో ఒడిశాలోని నైనీలో ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి గనులు కేటాయించినందున ఇక్కడ కూడా అలాగే చేయాలన్నారు. తద్వారా తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణిని కాపాడేలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నా.. ఆశ తీరలేదేం?

▶ మొదటి పేజీ తరువాయి

గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఆ కమిటీ త్వరలోనే తెలంగాణకు వచ్చి పని ప్రారంభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ముఖ్యంగా ఈ కమిటీ మూడు అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తుందని అంటున్నారు. 'అధికారం, అన్ని వనరులు ఉండి కూడా బీజేపీతో అంత గట్టిగా ఎందుకు పోటీపడాల్సి వచ్చింది? తూర్పు, దక్షిణ తెలంగాణల్లో పట్టు నిలుపుకొన్న పార్టీ.. పశ్చిమ, ఉత్తర తెలంగాణల్లో ఎందుకు నిలబడలేకపోయింది? పార్టీ నాయకులందరూ తమకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చారా లేదా?' అన్న కోణాల్లో పోస్టుమార్టం జరుగుతుందని నేతలు చెప్తున్నారు. ముఖ్యంగా తక్కువ తేడాతో ఓడిపోయిన మెదక్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్ ఎంపీ స్థానాల విషయంలో ఏం జరిగిందనేది తేల్చే చాన్స్ ఉందని అంటున్నారు. ఇంకొంచెం కష్టపడి ఉంటే ఈ మూడు చోట్ల గట్టెక్కేవాళ్లమని పేర్కొంటున్నారు. ఈ స్థానాలు దక్కించుకోలేక పోవడానికి ఎలాంటి పరిస్థితులు కారణమనే అంశంపై.. పార్టీ ముఖ్య నేతలతోపాటు ఆయా చోట్ల పోటీచేసి ఓడిన అభ్యర్థులతోనూ మాట్లాడనున్నట్టు తెలిసింది. ఇక చేవెళ్ల, మల్కాజ్‌గిరి, ఆదిలాబాద్ స్థానాల్లో అభ్యర్థుల మార్పు ఏ మేరకు ఉపయోగపడిందనే కోణంలోనూ త్రిసభ్య కమిటీ నిగ్గు తేలుస్తుందని సమాచారం. అన్ని విషయాల్లో ఓ అంచనాకు వచ్చిన తర్వాత ఈ కమిటీ హైకమాండ్‌కు నివేదిక ఇస్తుందని.. ఆ నివేదిక ఆధారంగా టీపీసీసీ ప్రక్షాళన జరుగుతుందని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో సరిగా పనిచేయని నేతలకు ఝలక్ ఇచ్చే అవకాశం ఉందని నేతలు అంటున్నారు.

22న 'నామినేటెడ్' ఉత్తర్వులు?

లోక్‌సభ ఎన్నికల కంటే ముందు రాష్ట్రంలో ప్రకటించిన 37 నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు ఈనెల 22వ తేదీన వచ్చే అవకాశముందని తెలిసింది. వాటితోపాటు మరో 17 పోస్టులను కలిపి ఒకేసారి ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం రేవంత్ భావించినా.. ఈ 17 పోస్టులకు సంబంధించిన కసరత్తు ఇంకా పూర్తికాలేదని సమాచారం. వీలునుబట్టి మొత్తం పోస్టులకు, లేదా ఇప్పటికే ప్రకటించిన 37 పోస్టులకు ఉత్తర్వులు వస్తాయని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో నేతల పనితీరు ఆధారంగా నామినేటెడ్ పోస్టుల్లో మార్పులు జరుగుతాయనే ప్రచారం జరిగినా.. ఉత్తర తెలంగాణకు చెందిన ఇద్దరు మంత్రుల మధ్య నామినేటెడ్ పందేరంలో తలెత్తిన విభేదాల కారణంగానే జాప్యం జరిగిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడా ఇద్దరు మంత్రుల మధ్య సయోధ్య నెలకొందని, నామినేటెడ్ ఉత్తర్వులకు లైన్ క్లియర్ అయిందని అంటున్నాయి.

సింగరేణిని ముంచే కుట్ర!

సింగరేణి గనులపై కేంద్రం కత్తి పెడితే రాష్ట్ర ప్రభుత్వం సాన పడుతోంది
- రాష్ట్రంలోని బొగ్గుగనులు సింగరేణి కాలరీస్‌కే కేటాయించాలి
- లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కంపెనీపై కేంద్ర ప్రభుత్వం కత్తిపెడితే రాష్ట్ర ప్రభుత్వం ఆ కత్తికి సాన పట్టినట్లు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం ఇన్నేళ్లపాటు చేసిన కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో కేంద్ర ప్రభుత్వం సింగరేణిపై చేస్తున్న కుట్రలు సాగుతున్నాయని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే సింగరేణిని ఖతం చేస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 16 ఎంపీ సీట్లు ఇచ్చి ఉంటే వేలాన్ని అడ్డుకునేవాళ్లమన్నారు. వేలం పాట ద్వారా గనులు కేటాయించవద్దని సీఎంగా కేసీఆర్ గతంలోనే కేంద్రానికి లేఖ రాశారని, నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి స్పందిస్తూ వేలం లేకుండా కేటాయించాలని కేంద్రాన్ని కోరిన సంగతిని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కోల్ బ్లాక్‌ల వేలానికి మద్దతు తెలుపుతోందని, దీనికి కేసుల భయమా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు.

ప్రైవేటీకరణ చేసేందుకే...

ఒడిశాలో రెండు లిగ్నైట్ గనులను బీజేపీ ప్రభుత్వమే ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిందని, గుజరాత్‌లోనూ రెండు పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థలకు 2015లో ఐదు కోల్ బ్లాక్‌లను కేటాయించిందని, అదేవిధంగా తమిళనాడులో బీజేపీ అధ్యక్షుడు అన్నామలై అభ్యంతరం తెలిపితే... ఎలాంటి వేలం లేకుండా లిగ్నైట్ గనులను ప్రభుత్వ రంగ సంస్థకు కేటాయించిందని కేటీఆర్ చెప్పారు. కానీ తెలంగాణలో మాత్రం సింగరేణికి ఎందుకు గనులకు కేటాయించటం లేదని ప్రశ్నించారు. ఈ ప్రక్రియలో సింగరేణిని ప్రైవేటీకరణ చేసే పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉందంటూ ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం అప్పట్లో చెప్పిందని, కానీ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ గని లేకుండా నష్టపోయేలా కేంద్ర ప్రభుత్వమే చేసిందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకే వేలం కార్యక్రమం ముందుకు పెట్టారని, ఈ వేలంపాటలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పాల్గొంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

నాడు అంధకారంలోకి దక్షిణాది

సింగరేణి కార్మికుల సత్తా ఏంటో తెలంగాణ ఉద్యమ సమయంలో చూశామని, అప్పుడు వాళ్లు సమ్మె చేస్తే దక్షిణ భారతం మొత్తం అంధకారంలోకి వెళ్లే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. అలాంటి సింగరేణిని కచ్చితంగా బీఆర్ఎస్ కాపాడుకుంటుందని చెప్పారు. తెలంగాణ నుంచి ఒకరు కేంద్రమంత్రి అయితే రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టు రావాలని, కానీ మన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉన్నదాన్ని అమ్మే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. లోక్‌సభలో బీఆర్ఎస్ లేకపోవటంతోనే సింగరేణిని ఖతం పట్టించబోతున్నారని వ్యాఖ్యానించారు. నాలుగు బొగ్గు గనులను కేటాయించే అవకాశం ఉన్నప్పుడు కూడా ఎందుకు కేటాయించటం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. బొగ్గు గనులను కార్పొరేట్ గద్దలకు కేటాయించే ప్రయత్నాలను సాగనివ్వమని, 2028లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు ఈ వేలం దక్కించుకున్న కంపెనీలను సహించబోమని హెచ్చరించారు. బొగ్గు గనుల వేలంపై రెండు, మూడు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని కేటీఆర్ వివరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టండి

అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో 10వ రౌండ్ బొగ్గు బ్లాకులు వేలం వేయనున్న నేపథ్యంలో.. గురువారం ఆయన ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్యాప్టివ్, వాణిజ్య బొగ్గు బ్లాకుల నిర్వహణపై చర్చించారు. శాఖా పరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వీలైనంత త్వరగా ఆయా సంస్థలకు కేటాయించిన బొగ్గు బ్లాకుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దిగుమతులు తగ్గించుకుని బొగ్గు ఉత్పత్తి, ఎగుమతులు పెంచుకోవాల్సిన ఆవశ్యకతపై కిషన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

గడ్కరీతో కిషన్ రెడ్డి భేటీ

రోడ్లు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని గురువారం బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రోడ్ల మౌలిక సదుపాయాలపై కొద్దిసేపు చర్చించారు. రాష్ట్రానికి రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని, మరిన్ని రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని నితిన్ గడ్కరీకి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సింగరేణి 'సెగ'పట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఏమిటని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. పైగా ఈ వేలంలో పాల్గొని బ్లాకులను దక్కించుకోవాలని సింగరేణి సంస్థను కోరుతుండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజానికి కేంద్రం ఇంతకుముందు పలు దఫాలుగా సింగరేణి ఏరియాలోని కల్యాణఖని, శ్రావణపల్లి, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గుబ్లాకులకు వేలం నిర్వహించింది. అప్పుడు ఉన్న బీఆర్ఎస్ సర్కారు ఆ వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, దూరంగా ఉంది.

మీది తప్పంటే మీదేనంటూ..: గతంలో బీఆర్ఎస్ సర్కారు బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా అడ్డుకోవడం ద్వారా సింగరేణి సంస్థకు అపార నష్టం కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే దిశగా కలసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి ప్రాంతంలోని బొగ్గు గనులను వేలంలో ఎవరు దక్కించుకున్నా మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక తిరిగి స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సైతం ఈ వ్యవహారంలో తీవ్రంగా స్పందించింది. బొగ్గు గనుల వేలాన్ని తప్పనిసరి చేస్తూ 2015లో కేంద్రం తెచ్చిన చట్టానికి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విమర్శించారు. బీఆర్ఎస్ పెద్దలు గతంలో జరిగిన వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేసి, వారి అనుయాయులకు సత్తుపల్లి, కోయగూడెం బొగ్గు బ్లాకులు దక్కేలా చేసుకున్నారని ఆరోపించారు. సింగరేణి ఏరియాలోని గనులను ఆ సంస్థకే కేటాయించాలని కేంద్రాన్ని కోరుతామని చెప్పారు. మొత్తంగా 3 ప్రధాన పక్షాలు కూడా పరస్పర ఆరోపణలు చేసుకుంటుండటంతో 'సింగరేణి' అంశం చర్చనీయాంశంగా మారింది.

వేలానికి సింగరేణి దూరమే?

సింగరేణి (కొత్తగూడెం): శ్రావణపల్లి బొగ్గు బ్లాకు వేలం ప్రక్రియలో పాల్గొనాలని తొలుత సింగరేణి యాజమాన్యం భావించినట్టు తెలిసింది. కానీ ప్రస్తుత రాజకీయ విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో వేలానికి దూరంగా ఉండాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. నిజానికి శ్రావణపల్లి బొగ్గు బ్లాకును దక్కించుకుని, తవ్వకాలు చేపట్టే విషయంలో చాలా పెద్ద ప్రక్రియ ఉంటుందని అంటున్నాయి. శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు 11.9 కోట్ల టన్నుల మేర ఉన్నట్టు అంచనా వేశారు. టన్నుకు ఇంత అనే లెక్కన కొంత సొమ్ము ముందే చెల్లించి వేలంలో పాల్గొనాలి. వేలంలో దక్కించుకున్నా.. నిర్దేశిత ప్రాంతం ప్రైవేట్ భూమా, అటవీ భూమినా అన్నది తేల్చుకోవాలి. సహాయ, పునరావాస ప్యాకేజీ చెల్లించాలి, ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించి ఇతర అనుమతులు తీసుకోవాలి. ఇదంతా సాఫీగా సాగకుంటే వేలంలో చెల్లించిన సొమ్ము తిరిగొచ్చే పరిస్థితి ఉండదు. ఇప్పటికే సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలపై రాయల్టీల పేరిట ఏటా రూ.వందల కోట్లు చెల్లిస్తోంది. వేలంలో పాల్గొని బొగ్గు బ్లాక్ దక్కించుకుంటే మరింత ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా కంపెనీకి వచ్చే లాభం తగ్గుతుంది. వీకే-7 గని అనుమతుల ప్రక్రియ మూడేళ్లుగా కొనసాగుతుండటంతో.. శ్రావణపల్లి వేలం విషయంలో ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్టు సమాచారం.

గురుకులాలకు ఉద్యోగుల కేటాయింపు

- కోర్టు కేసులున్న వారికి మినహా మిగిలిన వారికి అలాట్‌మెంట్
- ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో పూర్తయిన కేటాయింపులు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగుల కేటాయింపుల ప్రక్రియ మొదలైంది. కొత్త జోనల్ విధానానికి అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకు జీఓ 317 జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే పలు సొసైటీలు ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపు పూర్తి చేసినప్పటికీ ఉద్యోగి వారీగా కేటాయింపులు విడుదల చేసే క్రమంలో పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఏడాదిన్నరగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఉద్యోగులను మినహాయిస్తూ మిగతా ఉద్యోగులకు నూతన జోనల్ విధానానికి అనుగుణంగా జిల్లా, జోనల్, మల్టీజోన్ కేటగిరీలను కేటాయిస్తూ గురుకుల సొసైటీలు చర్యలు వేగవంతం చేశాయి. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో గురువారం ఉద్యోగుల కేటాయింపుల ప్రక్రియ పూర్తయింది. ఈమేరకు సొసైటీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో కూడా ఈ కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో ఈ సొసైటీలో కూడా ఉద్యోగ కేటాయింపులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో ఏడాది క్రితమే ఉద్యోగ కేటాయింపులు జరిగాయి. తాజాగా ఉద్యోగుల వారీగా కేటాయింపు ఉత్తర్వులు జారీ కానున్నాయి. తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) పరిధిలో మాత్రం ఈ ప్రక్రియ పెండింగ్‌లోనే ఉంది.

స్పౌజ్ కేటగిరీ ఉద్యోగులకు న్యాయం చేయాలి: టిగారియా

గురుకుల విద్యా సంస్థల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జీఓ 317 అమలు ప్రక్రియ పరిష్కారం కావడం శుభసూచకమని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టిగారియా) అధ్యక్ష, కార్యదర్శులు మామిడి నారాయణ, మధుసూధన్ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి స్పౌజ్‌గా ఉన్న కేటగిరీని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వ, పీఎస్‌యూల పరిధిలో ఉద్యోగి స్పౌజ్‌గా ఉన్న వారికి కూడా న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా పీహెచ్ కేటగిరి, సింగిల్ ఉమెన్, డివోర్స్, అన్ మ్యారీడ్, మెడికల్ కేటగిరీలను కూడా పరిగణించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈమేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందించారు.

క్లుప్తంగా...

తెలుగురాని వారికి పరిచయ కోర్సు

తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): అధికార భాషగా తెలుగును అమలుచేసే ప్రభుత్వ విధానంలో భాగంగా తెలుగు రాని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల కోసం 'తెలుగు పరిచయ కోర్సు'ను నిర్వహించనున్నట్టు తెలుగు అకాడమీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 48 రోజుల కాలవ్యవధిలో తెలుగులో మాట్లాడటం, రాయడం, చదవడం నేర్పిస్తారు. పరిచయ కోర్సులో ప్రవేశానికి కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ (10వ తరగతి). ప్రవేశంకోసం తమ వివరాలతో హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమీ కార్యాలయానికి జూలై 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో తీసుకోవచ్చని, ఇతర వివరాల కోసం ఫోన్ నంబర్లు 040-23226047/ 8886801239 040-23225215ను సంప్రదించాలని సూచించారు. ఈ కోర్సు తరగతులు జూలై 15 నుంచి 48 పని రోజులలో సోమవారం నుంచి శనివారం వరకు సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

జూలైకి ముందే న్యాయ కోర్సుల్లో తరగతులు సాధ్యం కాదా?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: జూలై మాసానికి ముందే న్యాయ విద్యా కోర్సుల్లో తరగతులను ప్రారంభించలేరా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరాలు అందజేయాలని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదేశించింది. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను జూలై నెలలోపు పూర్తి చేయడం లేదని, దీంతో తరగతుల ప్రారంభం తీవ్ర ఆలస్యం అవుతోందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. తరగతుల ప్రారంభంపై వివరాలు తెలుసుకోవడానికి వారం సమయం కావాలని ఏఏజీ కోరడంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.

కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి నిరుద్యోగులను వేధిస్తోంది

ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వని రేవంత్ సర్కార్: రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మార్పు కోసం ఓటేసిన పాపానికి నిరుద్యోగ యువతను కాంగ్రెస్ వేధిస్తోందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఎన్నికల కోడ్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ ప్రభుత్వం ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగ యువత పట్ల నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ విడుదల చేస్తామన్న హామీ అటకెక్కిందన్నారు. గ్రూప్ 2లో 2వేల పోస్టులు ఇవ్వాల్సి ఉండగా 783 పోస్టులతోనే చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. గ్రూప్ 3లో మరో మూడు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మెగా డీఎస్సీలో 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. జీవో 46పై సీఎస్‌కు ఫిర్యాదు ఇవ్వాలని వెళితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో గోడ మీద ఫిర్యాదును అతికించి వచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రూప్-2, గ్రూప్-3 కేటగిరీల్లోని ఖాళీలను భర్తీ చేయాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ రెండు కేటగిరీల్లో ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ... మరిన్ని ఖాళీలున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. వీటిని కూడా భర్తీ చేయాలని కోరుతూ గురువారం టీజీపీఎస్సీ చైర్మన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. ఉద్యోగ నియామక సంస్థలు నిర్వహించే పరీక్షలను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిబంధనలు అమలు చేయాలని కోరారు. గ్రూప్-1 రాసిన అభ్యర్థుల సంఖ్యను వెంటనే ప్రకటించాలని, గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులకు కేటగిరైజేషన్ ప్రకారం కటాఫ్ మార్కుల ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైడల్ పవర్ డౌన్!

పనిచేయని స్థితిలో 329.8 మెగావాట్ల జల విద్యుత్ యూనిట్లు

- మరమ్మతులు జరగకపోవడం, నిర్వహణ లోపమే కారణం!
- ఆరు నెలలుగా టెండర్లు ఖరారు చేయని జెన్‌కో
- కృష్ణాలో వరదలు ప్రారంభమైతే విద్యుత్‌ను నష్టపోయే పరిస్థితి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎగువ, దిగువ జూరాల వంటి నాలుగు ప్రధాన జల విద్యుత్ కేంద్రాలకు గత కొంతకాలంగా మరమ్మతులు నిర్వహించకపోవడంతో వాటి ఉత్పత్తి సామర్థ్యం క్షీణించిపోయింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే మరమ్మతులు నిర్వహించాల్సి ఉండగా, టెండర్ల నిర్వహణలో తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) తాత్సారం చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో కృష్ణా నదికి ఎగువ నుంచి వరదలు ప్రారంభం కానుండగా, పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని చేసుకునే పరిస్థితి లేకుండా పోయినట్లు తెలిసింది. ఇదే జరిగితే రూ.కోట్లు విలువ చేసే జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశాన్ని రాష్ట్రం కోల్పోయినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చిన్నచిన్న సమస్యలే అయినా..

రాష్ట్రంలో చిన్నాపెద్దా కలిపి మొత్తం 2441.76 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రాలుండగా, ఎప్పటికప్పుడు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రస్తుతం 329.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జలవిద్యుత్ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన జలవిద్యుత్ కేంద్రాలన్నింటిలో ఒక్కో యూనిట్ పనిచేయడం లేదని అధికారవర్గాలు తెలిపాయి. గత ఆరు నెలలుగా టెండర్ల ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో మరమ్మతులు ప్రారంభం కాలేదు. చిన్న చిన్న సమస్యలే ఉండడంతో ఒక్కో కేంద్రం మరమ్మతులకు రూ.10 కోట్లలోపు వ్యయమే కానుండగా, టెండర్లు ఖరారు చేయకపోవడంతో వర్షాకాలంలో ఆయా యూనిట్లలో జల విద్యుదుత్పత్తి నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.

సాగర్, శ్రీశైలం కేంద్రాలకూ మరమ్మతులు నో

రాష్ట్రంలోని జల విద్యుత్ కేంద్రాలు సగటున ఏటా 3000 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. థర్మల్ విద్యుత్‌తో పోల్చితే అత్యంత చౌకగా కాలుష్యం లేకుండా జలవిద్యుత్ లభిస్తోంది. కృష్ణా నదిపై నిర్మించిన ఎగువ జూరాల జలవిద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 234 (6x39) మెగావాట్లు కాగా ఇక్కడ మూడో యూనిట్ జనరేటర్ సమస్యతో పనిచేయడం లేదు. దిగువ జూరాల విద్యుత్ కేంద్రం స్థాపిత సామర్థ్యం 240 (6x40) మెగావాట్లు కాగా, అందులోని అన్ని యూనిట్లలో సీల్ లీకు అవుతోంది. వీటిల్లో కనీసం ఒక యూనిట్ పనిచేయకపోవచ్చని, తద్వారా 40 మెగావాట్ల విద్యుదుత్పత్తికి నష్టం కలగనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇక రాష్ట్రంలోనే అత్యంత పెద్ద జలవిద్యుత్ కేంద్రమైన 'శ్రీశైలం'స్థాపిత సామర్థ్యం 900 (6x150) మెగావాట్లు కాగా, అందులో 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4వ యూనిట్ పనిచేయడం లేదు. జనరేటర్ స్టేటర్, రోటర్లు కాలిపోవడంతో వాటిని మార్చాల్సి ఉంది. మరో భారీ జలవిద్యుత్ కేంద్రం నాగార్జునసాగర్ స్థాపిత సామర్థ్యం 815.6(1x110 + 7x100.8) మెగావాట్లు కాగా, అందులో 100.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ పనిచేయడం లేదు. రోటర్‌కు సపోర్టింగ్‌గా ఉండే స్ట్రక్చర్‌కు పగుళ్లు రాగా మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. వీటికి సకాలంలో మరమ్మతులు నిర్వహిస్తే వరదల సమయంలో పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో సోదాలు

అక్రమ మైనింగ్‌లో మనీలాండరింగ్‌పై ఈడీ ఆరా

- ఇంటితోపాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు
- ఏకకాలంలో పలుచోట్ల సోదాలు.. పలు కీలక పత్రాలు స్వాధీనం
- ఇది ముమ్మాటికి రాజకీయ కుట్ర: ఎమ్మెల్యే గూడెం



పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం ఇంటి వద్ద సీఐఎస్ఎఫ్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్/పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: అక్రమ మైనింగ్ వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో ఆరా తీస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. గురువారం ఉదయాన్నే ఈడీ అధికారులు బృందాలుగా విడిపోయి సోదాలు ప్రారంభించారు. మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు మైనింగ్‌కు సంబంధించి కార్యాలయాలు, బంధువులు, బినామీల ఇళ్లలో ఏకకాలంలో ఈడీ అధికారులు హైదరాబాద్, పరిసరాల్లోని మొత్తం ఏడుకు పైగా ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు సాయంత్రం వరకు దాదాపు 11 గంటలపాటు సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరోపణలపై మధుసూదన్ రెడ్డిపై పటాన్‌చెరు పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా మధుసూదన్‌రెడ్డిని స్థానిక పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మరో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను, డిజిటల్ డివైజ్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే ఇంట్లోని వ్యక్తులు ఎవరినీ బయటికి రానీయలేదు. అలాగే వారి ఫోన్లను కూడా ఈడీ బయటకు అనుమతించలేదు. నివాసాల వద్ద ఉన్న కార్లలో కూడా తనిఖీలు చేసి అధికారులు కొన్ని కాగితాలను తీసుకెళ్లారు.

నిబంధనల అతిక్రమణపై కేసు నమోదు

కేంద్ర పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలు, అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు వంటి ఆరోపణలపై స్థానిక తహసీల్దార్ ఫిర్యాదు మేరకు మధుసూదన్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధానంగా సంతోష్ గ్రానైట్ మైనింగ్, ఈ ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారింది. సంబంధిత అనుమతుల గడువు ముగిసినా కూడా మధుసూదన్‌రెడ్డి మైనింగ్ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారంటూ ఇటీవల అధికారులు క్రషర్లను స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు వెలుగులోకి రావడంతో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ విచారణలో లక్డారంలో మధుసూధన్‌రెడ్డికి చెందిన కంపెనీలు నిర్వహిస్తున్న అనేక అక్రమ మైనింగ్ కార్యకలాపాలు బయటపడ్డాయి. మహిపాల్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డిలకు సంబంధించిన వ్యాపారాలపైనా ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవలే రూ.3 కోట్లతో మహిపాల్ రెడ్డి అల్లుడు లాండ్‌క్రూజర్ కారును కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి డబ్బు ఎక్కడిది అన్న కోణంలోనూ ఈడీ ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

కొండను తవ్వి ఎలుకను పట్టారు

ఈడీ తనిఖీలకు తాము పూర్తిగా సహకరించామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చెప్పారు. సోదాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని నిర్ధారించుకున్నాక అధికారులు వెళ్లిపోయారన్నారు. కొన్ని దస్తావేజులకు సంబంధించిన జిరాక్స్ పత్రాలను వెంట తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షపూరిత దాడిగా ఆయన అభివర్ణించారు. దేశం యావత్తు ఈడీ అధికారుల తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు.

నీట్‌పై సీబీఐ విచారణ జరిపించాలి

విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగింది: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో 'నీట్' పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పరీక్షా పత్రాలు లీక్ అయినట్లు ఆరోపణలు రావడం ఒకటైతే, 63 మంది విద్యార్థులకు ఒకే ర్యాంకు రావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గురువారం ఆయన శాసనసభలో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల అంశంలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై తక్షణమే కేంద్రం స్పందించాలని కోరారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి నెలరోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతినిచ్చి.. ఆ తరువాత మరో వారం రోజులు గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పొడిగించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పరీక్షల ఫలితాలు జూన్ 14వ తేదీ రావాల్సి ఉండగా.. పదిరోజుల ముందుగానే ప్రకటించడం కూడా అనుమానాలు మరింత పెరగడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయని, గ్రేస్ మార్కులు కూడా ఇష్టానుసారం కలిపారని మంత్రి ఆరోపించారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్(ఎన్డీయే)పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.

బొగ్గు గనుల వేలంపై పునరాలోచన చేయాలి..

బొగ్గు గనులను వేలం వేయకుండా ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలోనే ప్రారంభించాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. బొగ్గు గనులను సింగరేణి ద్వారానే ఏర్పాటు చేయాలని, కానీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాత్రం ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్నట్లు చెబుతున్నారని మంత్రి విమర్శించారు. అన్ని బొగ్గు నిక్షేప సంస్థలు లాభాల్లో ఉన్నాయని, కిషన్‌రెడ్డి ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బొగ్గు గనుల అంశంపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి మాట్లాడతారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలపై పునరాలోచన చేసుకోవాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఒక్కసీటు కూడా రాదని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. జీవో 46పై త్వరలోనే సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు నిధులు ఇవ్వాలి

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ రమణాచారి, ఎమ్మెల్సీ వాణిదేవి

సాక్షి, హైదరాబాద్: బ్రాహ్మణులు అగ్రవర్ణాలకు చెందినప్పటికీ ఈ వర్గంలో అనేకమంది పేదవాళ్లు ఉన్నారని, పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ కె.వి. రమణాచారి కోరారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి, పార్టీ నేత దేవి ప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాక బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేశారని, కానీ ఇప్పుడు బ్రాహ్మణుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో ఉన్న నిరుపేదల గురించి ఆలోచించింది కేసీఆర్ ఒక్కరేనని తెలిపారు. దేవిప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను కాంగ్రెస్ పట్టించుకోవడం లేదన్నారు.

జోసా కౌన్సెలింగ్‌లో జోష్

▶ మొదటి పేజీ తరువాయి



ఐఐటీలో బాలుర విభాగంలో 585 ర్యాంకుకు సీటు వస్తే, ఈసారి 649 ర్యాంకు వరకూ సీటు వచ్చింది. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీ (నిట్)ల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. వరంగల్ నిట్‌లో బాలుర విభాగంలో 1664 ర్యాంకుకు గత ఏడాది సీటొస్తే, ఈసారి 2698 ర్యాంకుకు సీటు వచ్చింది. బాలికల విభాగంలో పోయినసారి 3593 ర్యాంకుకు సీటొస్తే, ఈసారి 4625 ర్యాంకుకు కూడా సీటు వచ్చింది. ఇక ఏపీ నిట్‌లో బాలికల విభాగంలో గత ఏడాది 17873 కటాఫ్ ఉంటే, ఈసారి ఇది 23130కి పెరిగింది. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఐఐటీలు మినహా అన్ని జాతీయ కాలేజీల్లో ర్యాంకును బట్టి సీటు కేటాయిస్తారు. ఐఐటీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు ఇస్తారు. జోసా మొత్తం ఐదు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

ముంబై ఐఐటీలోనే టాపర్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకులు పొందిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ముంబై ఐఐటీకే ప్రాధాన్యమిచ్చారు. టాపర్లంతా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ వైపే మొగ్గు చూపారు. ఓపెన్ కేటగిరీలో ముంబై ఐఐటీలో తొలి ర్యాంకు మొదలుకుని 68వ ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి. బాలికల విభాగంలోనూ 7వ ర్యాంకు సహా 421వ ర్యాంకు వరకూ సీట్లు పొందారు. తర్వాత స్థానంలో ఢిల్లీ ఐఐటీ ఉంది. ఇక్కడ 116లోపు ర్యాంకు వరకూ సీట్లు దక్కాయి. కాన్పూర్ ఐఐటీలోనూ పోటీ ఎక్కువగానే ఉంది. ఓపెన్ కేటగిరీలో 226 ర్యాంకుతో ప్రారంభమై 414 ర్యాంకుతో ముగిసింది. హైదరాబాద్ ఐఐటీలో సీఎస్‌సీ ఓపెన్ కేటగిరీలో 431వ ర్యాంకుతో మొదలై 649వ ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి.

వివిధ విద్యాసంస్థల్లో సీట్ల వివరాలు

సంస్థ	ఎన్ని కాలేజీలు	సీట్లు
ఐఐటీలు	23	17,740
ఎన్ఐటీలు	31	24,226
ట్రిపుల్ ఐటీలు	25	8,546
కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలు	48	6,000

చివరి కౌన్సెలింగ్ వరకు చూడాలి



గత కౌన్సెలింగ్‌తో పోలిస్తే ఈసారి జోసా కౌన్సెలింగ్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. కటాఫ్ ఊహించని విధంగా పెరిగింది. సీట్లు పెరగడమే దీనికి కారణం. విద్యార్థులు చివరి కౌన్సెలింగ్ వరకూ వేచి చూస్తే తప్పకుండా మంచి అవకాశాలు రావచ్చు. రెండో దశ కౌన్సెలింగ్ నుంచి ఆప్షన్లు ఇచ్చే ముందు సీట్ల కేటాయింపుపై కొంత కసరత్తు చేయాలి.

– ఎంఎస్ రావు (గణిత శాస్త్ర నిపుణులు)

తొలి రౌండ్ జోసా కౌన్సెలింగ్‌లో ప్రధాన ఐఐటీల్లో ఏ ర్యాంకు వరకూ సీట్లు

ఐఐటీ	ర్యాంకు	
	బాలురు	బాలికలు
ముంబై	68	421
కాన్పూర్	248	1,117
ఖరగ్‌పూర్	414	1,579
ఢిల్లీ	116	556
మద్రాస్	159	757
హైదరాబాద్	649	1,809
తిరుపతి	4,469	6,324
రూర్కీ	481	1,697
పాలక్కాడ్	5,556	9,127
భిలాయ్	5,907	11,290

ప్రధాన నిట్‌లు

	బాలురు	బాలికలు
వరంగల్	2,698	4,625
తిరుచిరాపల్లి	1,019	1,945
సూరత్‌కల్	1,423	2,433
క్యాలికట్	4,088	6,233
ఆంధ్రప్రదేశ్	16,278	24,130
జలంధర్	9,357	15,718
అగర్తల	18,050	30,270



సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న డీజీపీ రవి గుప్తా

సంపూర్ణ విద్యతోనే విద్యార్థుల ఎదుగుదల: డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు సిలబస్‌లోని అంశాలతోపాటు పాఠ్యేతర కార్యకలాపాలు ఎంతో ప్రధానమని డీజీపీ రవిగుప్తా అభిప్రాయపడ్డారు. విద్యతోపాటు విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదల పెంపొందించే సంపూర్ణ విద్య అవసరమని స్పష్టం చేశారు. గురువారం బౌరంపేట్లోని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఓక్విండ్స్ క్యాంపస్ ప్రథమ వార్షికోత్సవంలో డీజీపీ రవి గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా డీజీపీ 60 అడుగుల స్తంభంపై జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీజీపీకి సిల్వర్ ఓక్స్ స్కూల్ ఎయిర్ ఎన్‌సీసీ స్క్వాడ్రన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ రవి గుప్తా మాట్లాడుతూ.. విద్యార్థులు పోలీస్ శాఖ, ఇతర వృత్తులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ, విద్యావేత్త అంజలి గుప్తా పాల్గొన్నారు.

మా వాటా జలాలను మళ్లీ క్యారీ ఓవర్ చేయాలి

కృష్ణా బోర్డుకు తెలంగాణ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయంలో 7.50టీఎంసీల తెలంగాణ వాటా జలాలు నిల్వ ఉన్నాయని, వాటిని ప్రస్తుత నీటి సంవత్సరానికి బదిలీ(క్యారీ ఓవర్) చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. 2023 జూన్ 1 నుంచి ప్రారంభమై 2024 మే 31తో ముగిసిన గత నీటి సంవత్సరంలో తెలంగాణకు కేటాయించిన జలాల్లో ఈ మేరకు 7.5 టీఎంసీలను వాడుకోలేదని, ఈ నీళ్లను ప్రస్తుత నీటి సంవత్సరంలో మళ్లీ తెలంగాణకే కేటాయించాలని కోరింది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఒక నీటి సంవత్సరంలో వాడుకోకపోవడంతో మిగిలే జలాలను తదుపరి నీటి సంవత్సరానికి బదిలీ చేయాలని ఉందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. గతంలో సైతం క్యారీ ఓవర్ అంశంపై తెలంగాణ అనేక సార్లు విజ్ఞప్తి చేయగా, కృష్ణా బోర్డు మాత్రం అపెక్స్ కౌన్సిల్‌లో, కృష్ణా ట్రిబ్యునల్-2లో ఈ అంశాన్ని పరిష్కరించుకోవాలని తేల్చి చెప్పింది.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు కృషి

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు
- కేరళ బీసీ కమిషన్‌తో భేటీ..అక్కడ బీసీ రిజర్వేషన్ల అమలుపై చర్చ



జస్టిస్ శశిధరన్‌తో కృష్ణమోహన్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ కోసం చిత్తశుద్ధితో తెలంగాణ బీసీ కమిషన్ వ్యవహరిస్తుందని వివరించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లను అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వే సైతం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. కేరళ పర్యటనలో ఉన్న తెలంగాణ బీసీ కమిషన్ బృందం గురువారం కేరళ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శశిధరన్‌తో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో బీసీల కోసం అమలు చేస్తున్న రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల్లో వాటా వంటి అంశాలపై చర్చించింది.

నీట్ పరీక్ష రద్దుకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఎన్‌టీఏ నిర్వహించిన నీట్-2024లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. అత్యంత లోపభూయిష్టంగా నిర్వహించిన ఈ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రం లీకేజీ అంశాన్ని తీవ్రంగా పరిగణించి సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశంలో లక్షలాది విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుకు సంబంధించిన ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరించాల్సిన ఎన్టీఏ.. అత్యంత ఉదాసీన వైఖరి అవలంబించిందని మండిపడ్డారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే దేశవ్యాప్తంగా అన్ని కుల సంఘాలతో కలిసి దీక్షకు దిగుతామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.




ఓ విశ్వసించిన వారలారా! ఇంకొకరి సొమ్మును అధర్మంగా తినకండి. అయితే పరస్పర అంగీకారంతో జరిగే క్రయ విక్రయాల ద్వారా లభించే దానిని తినవచ్చు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 21 జూన్ 2024

మండుటెండల మహోపద్రవం

గత దశాబ్దిన్నరగా ఎన్నడెరుగని పరిస్థితి. మే నెలలో మండే ఎండలు తెలిసినవే అయినా, ఏప్రిల్ మొదలు జూన్ సగం దాటినా మాడు పగిలేలా దీర్ఘకాలిక ఉష్ణపవనాల దెబ్బ ఇప్పుడే అనుభవంలోకి వచ్చింది. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులతో ఢిల్లీ సహా ఉత్తరాది అంతా ఇప్పుడు అగ్నిగుండమైంది. మొన్న మంగళవారం 1969 తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో 35.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతతో ఢిల్లీ మలమల మాడిపోయింది. ఒక్క జూన్‌లోనే ఇప్పటిదాకా ఏడు రోజులు తీవ్ర ఉష్ణపవనాలతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరి కాగా, పగలే కాదు రాత్రి ఉష్ణోగ్రతలూ గణనీయంగా పెరిగిపోవడంతో అవస్థలు హెచ్చాయి. మే 12 తర్వాత ఇప్పటి వరకు ఢిల్లీలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు రాత్రి పొద్దుపోయినా 40 డిగ్రీల కన్నా తగ్గనే లేదు. నిరాశ్రయులు 192 మంది ఈ జూన్ నెల 11 నుంచి 19 మధ్య కాలంలో వడదెబ్బ తగిలి మరణించారట. మునుపెన్నడూ చూడని ఇన్ని మరణాల సంఖ్య పరిస్థితి తీవ్రతకు మచ్చుతునక.

నగరంలో నీటి కొరత మరో పెద్ద కథ. అధిక జనాభాతో దేశరాజధాని చాలాకాలంగా తల్లడిల్లుతోంది. సమీప ప్రాంతాల నుంచి వందలాది మంది వలస రావడంతో గత పాతికేళ్ళలో ఢిల్లీలో డజన్లకొద్దీ శిబిరాలు చట్టవిరుద్ధంగా వెలిశాయి. అసలే శిథిలమైన నగర జలవ్యవస్థ కారణంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలకు, మరీ ముఖ్యంగా ఈ మురికివాడలకు కనీసం తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి. దానికి తోడు యమునా నదీజలాలు తగ్గిపోయి, నీటి కోసం అల్లాడే ఎండాకాలం వస్తే వాటర్ ట్యాంకర్లతో నీటి పంపిణీ పెద్ద వ్యాపారమైంది. ఇదే అదనుగా జలవనరుల్ని యథేచ్ఛగా కొల్లగొడుతున్న ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల మాఫియా బయలుదేరింది. పెరిగిన ఎండలతో ఉత్తరాదిన రోజువారీ విద్యుత్ వినియోగం 89 గిగా వాట్ల పతాకస్థాయికి చేరి, ఢిల్లీ విమానాశ్రయం అరగంటసేపు కరెంట్ కోతలో మగ్గాల్సి వచ్చింది. మిగతా దక్షిణ, పశ్చిమ, తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి ఉత్తరాదికి 25 నుంచి 30 శాతం విద్యుత్ దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ ఎండల్లో ఇన్ని సమస్యల ముప్పేటదాడితో రాజధాని ప్రజలకు కష్టాలు వర్ణనాతీతం.

సందట్లో సడేమియాగా వ్యవహారం రాజకీయ రంగు పులుముకొంది. పొరుగున హర్యానాలోని బీజేపీ ప్రభుత్వాన్ని అభ్యర్థించినా, యమునలోని నీళ్ళొదలడం లేదన్నది ఢిల్లీ ఆప్ సర్కార్ ఆరోపణ. మాకే తగినంత లేవన్నది హర్యానా జవాబు. నీళ్ళైనా అందించలేకపోవడం ఆప్ వైఫల్యమేనంటూ ఢిల్లీ బీజేపీ నేతలు రోడ్డు పైకొచ్చి నిరసనలకు దిగడం ఒక ఎత్తయితే... ట్యాంకర్ల మాఫియా రెచ్చిపోవడం, ఢిల్లీ నీటి సరఫరా పైపులకు సైతం దుష్టశక్తులు చిల్లులు పెడుతున్నాయంటూ ఆప్ సర్కార్ ఆ పైపులకు పోలీసు రక్షణ కోరడం పరాకాష్ఠ. దేశ రాజధానిలో నీటి కొరతపై ప్రధాని మోదీ స్పందించకపోతే శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానంటూ ఢిల్లీ మంత్రి ఆతిశి ప్రకటించడంతో మహానగరం మరింత వేడెక్కింది. నిజానికి, ఈసారి రుతుపవనాలు త్వరగానే కేరళను తాకి, ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. తీరా జూన్ 12 నుంచి మధ్యభారతంలో అవి స్తంభించేసరికి, దేశమంతా ఇటు వర్షాలు లేవు. అటు ఎండలు, ఉక్కపోత. దక్షిణాదితో పోలిస్తే ఉత్తర, పశ్చిమ భారతావనిలో మరీ దుర్భరం. ఇలాంటి దీర్ఘకాలిక వేసవిని ప్రకృతి విపత్తుగా పరిగణించాలంటున్నది అందుకే!

నిజానికి ఇదంతా ఎక్కడో ఢిల్లీలో వ్యవహారమనీ, అది అక్కడికే పరిమితమనీ అనుకోవడానికి వీల్లేదు. వాతావరణ మార్పులు, మన స్వయంకృతాపరాధాల కారణంగా భవిష్యత్తులో దేశంలోని నగరాలన్నిటికీ ఇదే దుఃస్థితి దాపురించడం ఖాయం. ఆ మధ్య బెంగుళూరులో ఇలాంటివే చూశాం. దేశానికి అభివృద్ధిఇంజన్లయిన బొంబాయి, కలకత్తా, చెన్నై, హైదరాబాద్, పుణే లాంటి నగరాల్లోనూ రేపు ఇవే పరిస్థితులు వస్తే, పరిస్థితి ఏమిటి? దేశ ఆర్థికపురోగతికి వెన్నెముక అయిన వీటిని నివాసయోగ్యం కాకుండా చేస్తే, జనం ఉద్యోగ, ఉపాధుల మాటేమిటి? పొంచివున్న నీటికొరత నివారణకు పాలకులు ఏం ప్రణాళిక వేస్తున్నారు? హైదరాబాద్ సహా అనేక నగరాల్లో వందల కొద్దీ చెరువులు, కుంటలు కబ్జాకు గురై, పర్యావరణానికీ, పెరుగుతున్న జనాభా అవసరాలకూ తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా మొద్దునిద్ర వదిలి, దీర్ఘకాలిక వ్యూహంతో ప్రభుత్వాలు ముందుకు రాకపోతే కష్టం.

మానవాళికి శాపంగా మారిన ఈ అధిక ఉష్ణోగ్రతల వెనక వాయుకాలుష్యం, శరవేగంగా పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, అడవుల నరికివేత... ఇలా చాలా కారణాలున్నాయి. విపరీతంగా నిర్మాణాలు పెరిగి, పట్టణాలన్నీ కాంక్రీట్ జనారణ్యాలుగా మారేసరికి, పచ్చని చెట్లు, ఖాళీ ప్రదేశాలున్న ప్రాంతాలతో పోలిస్తే కొద్ది కి.మీ.ల దూరంలోనే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పైగా, దీనివల్ల రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం చల్లబడడం కూడా పాతికేళ్ళ క్రితంతో పోలిస్తే బాగా నిదానించిందట. 'పట్టణ ఉష్ణద్వీప' ప్రభావంగా పేర్కొనే ఈ పరిస్థితిని నివారించడం అత్యవసరం. అలాగే, నిలువ నీడ లేని వారితో సహా సమాజంలోని దుర్బల వర్గాలను ఈ వేడిమి బాధ నుంచి కాపాడే చర్యలు చేపట్టాలి. ఒంట్లో నీటి శాతం తగ్గిపోనివ్వకుండా ప్రభుత్వాలు సురక్షిత తాగునీటి వసతి కల్పించాలి. శీతల కేంద్రాలు, ఎండబారిన పడకుండా తగినంత నీడ ఏర్పాటు చేయాలి. గత ఏడాది, ఈసారి ఎన్జీఓ 'స్వయం ఉపాధి మహిళా సంఘం' (సేవ) అమలు చేసిన 'ఎండల నుంచి బీమా సౌకర్యం' లాంటి వినూత్న ఆలోచనలు అసంఘటిత కార్మికుల జీవనోపాధిని కాపాడతాయి. ఇప్పటికే ఈ 2024 మానవచరిత్రలోనే మండుటెండల వత్సరంగా రికార్డు కెక్కింది. వచ్చే ఏడాది ఈ రికార్డును తిరగరాయక ముందే ఈ మహోపద్రవం పట్ల కళ్ళు తెరవడం మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.6.37 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** జ్యేష్ఠ సా.6.22 వరకు, తదుపరి మూల **వర్జ్యం:** రా.2.27 నుండి 4.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.28 నుండి 1.20 వరకు **అమృతఘడియలు:** ఉ.9.18 నుండి 10.56 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇంగ్లీషు మీడియం కొనసాగేనా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మొత్తం దేశ చరిత్రనే మార్చే పథకం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు విద్య. ఆ విద్యా విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా, ఆపేస్తుందా అనేది ప్రశ్న. గత ఐదేండ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యారంగంలో వచ్చిన మార్పులు గణనీయమైనవి. ఆ మార్పులను అనిష్టంగానైనా కొత్త ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న ఐదేండ్లలో విద్యారంగంలోని మార్పులు పాతుకుపోతాయి. అలాకాకుండా మళ్ళీ పాత పద్ధతిలోకి విద్యావ్యవస్థను నెడితే ప్రజలు ఏం చెయ్యాలనేది చాలా కీలకమైంది. అందుకే స్కూళ్ళలో పిల్లల భవిష్యత్తును కొత్త ప్రభుత్వం వెనక్కి నెట్టకుండా చూడాల్సిన బాధ్యత వైసీపీ రాజకీయ శక్తులతో పాటు, పిల్లల తలిదండ్రుల మీద కూడా ఉంది.

ఎన్నికల సమయంలో చండీగఢ్‌లో జరిగిన రాజ్యాంగ రక్షణ సదస్సుకు నేను వక్తగా వెళ్ళాను. అది ఆఖరి ఘట్టం ఎన్నికల ముందు. చివరి ఘట్టంలో పంజాబు రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఆ సదస్సు మే 22న జరిగింది. మరుసటి రోజు అక్కడి మేధావులు పంజాబు గ్రామాల్లో నాకోసం సమావేశాలు ఏర్పాటు చేశారు. నేను మూడు గ్రామాల్లో జరిగిన మూడు మీటింగుల్లో పాల్గొని మాట్లాడాను. మీటింగులో ఆడా, మగా చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

పంజాబులో ప్రభుత్వ పాఠశాల విద్య పంజాబీ భాషలోనే బోధిస్తారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్నట్లు ఒక్క సబ్జెక్టు మాత్రం ఇంగ్లీషులో ఉంటుంది. అయితే అక్కడ కూడా ప్రైవేట్ స్కూళ్లు ఇంగ్లీషు మీడియంలో నడుస్తాయి. పంజాబీలు ఇతర దేశాలకు ఎక్కువ వలసపోతారు కనుక వారు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ఉండాలని డిమాండ్ చేస్తున్నారా అని నేను అడిగాను. వాళ్ళు లేదు అన్నారు.

అప్పుడు నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం గురించీ, అది గ్రామాల్లోని పిల్లల్లో తెస్తున్న మార్పుల గురించీ వివరించాను. 'మా పిల్లలకు కచ్చితంగా అటువంటి ఇంగ్లీషు మీడియం విద్య కావాలి; వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీల ముందు ఈ డిమాండ్ పెడతా'మని వాళ్లు తీర్మానించుకున్నారు.

మొత్తం దేశ చరిత్రనే మార్చే పథకం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు విద్య. ఆ విద్యా విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా, ఆపేస్తుందా అనేది కీలకమైన ప్రశ్న. చంద్రబాబు నాయుడు క్యాబినెట్ ప్రమాణ స్వీకారం రోజు వేదిక మీద ఉన్నవారంతా గ్రామీణ పిల్లలు ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియం చదువు నేర్చుకోవడాన్ని వ్యతిరేకించినవారే. చంద్రబాబు ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి శాసించే అమిత్ షా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువుకు బద్ధ వ్యతిరేకి. అంతేకాదు, తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు స్కూళ్ళను స్థాపించి ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసిన నారాయణ మళ్ళీ మంత్రి అయ్యారు. కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్ళు చంద్రబాబు ప్రైవేటీకరణలో భాగంగా ఎదిగాయి.

ప్రభుత్వ రంగంలో ఇంగ్లీషు మీడియం విద్య ఒక సంక్షేమ పథకం కాదు. ప్రపంచంలోని అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాల విద్య ప్రభుత్వ రంగంలోనే ఉన్నది. కానీ, భారతదేశంలో ప్రైవేట్ పాఠశాల విద్య ప్రభుత్వ రంగ విద్యను సర్వనాశనం చేసింది. అటువంటి విద్యా విధానం నుండి గ్రామీణ విద్యార్థులను కాపాడే విద్యావిధానాన్ని



ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రభుత్వం దీన్ని రద్దు చేసి మళ్ళీ పాత పద్ధతిలోకి విద్యావ్యవస్థను నెడితే ప్రజలు ఏం చెయ్యాలనేది చాలా కీలకమైంది.

కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం, 2024–25 ఎకడమిక్ సంవత్సర స్కూళ్ల ప్రారంభం ఏకకాలంలో జరిగాయి. అయితే ఈ సంవత్సరానికి కావలసిన బైలింగ్వల్ బుక్స్(ఉభయ భాషా పుస్తకాలు), పిల్లలకిచ్చే డ్రెస్సులు, బూట్లు ఈ ప్రభుత్వం సకాలంలో ఇస్తుందా అనేది ప్రశ్న. గత ఐదేండ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యారంగంలో వచ్చిన మార్పులు గణనీయమైనవి. ఆ మార్పులను అనిష్టంగానైనా కొత్త ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న ఐదేండ్లలో విద్యారంగంలోని మార్పులు పాతుకుపోతాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలలో బీదవారు, అగ్రకులాలలో బీదవారి పిల్లలకు 2029 ఎన్నికల నాటికి ఈ విద్యావ్యవస్థ తమకు ఎటువంటి భవిష్యత్తును ఇవ్వనుందో అర్థమయ్యే దశ వస్తుంది. కానీ ఇప్పుడు స్కూళ్ళలో పిల్లల భవిష్యత్తును కొత్త ప్రభుత్వం వెనక్కి నెట్టకుండా చూడాల్సిన బాధ్యత అటు వైసీపీ రాజకీయ శక్తులతో పాటు, ఇటు పిల్లల తలిదండ్రుల మీద ఉంది.

ఇప్పటి నుండి గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం విద్యా పరిరక్షణ కమిటీలు వేసుకోవలసిన అవసరం ఉంది. గ్రామాల్లో ప్రజలు తమ రాజకీయ అభిప్రాయాలను అధిగమించి విద్యారంగ పరిరక్షణ కోసం కమిటీలు వేసుకుని గ్రామంలోని పిల్లలందరి భవిష్యత్ కాపాడవలసిన బాధ్యత ఉంది. గ్రామాల్లో కూడా ధనవంతులున్నారు. వారి పిల్లలను ప్రైవేట్ స్కూళ్ళలో విపరీతంగా డబ్బులు ఖర్చుపెట్టి చదివించగలిగేవారూ ఉన్నారు. ఇటువంటివారు, ఉద్యోగులు, పట్టణాల్లోని ధనవంతులు... బీద బిక్కి పిల్లలందరికి ఇంగ్లీషు వస్తే తమ పిల్లలు వారితో పోటీ పడాల్సి వస్తుందని భావించి ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియంను వ్యతిరేకించే అవకాశం ఉంది.

జగన్ ప్రభుత్వాన్ని ఉద్యోగస్థులు, కొంత మంది ఉపాధ్యాయులతో పాటు ఇతర ధనవంతులు వ్యతిరేకించడంలో తమ పిల్లల భవిష్యత్ స్వార్థం పనిచేసింది. ఈ స్వార్థం కులాలకు అతీతంగా ఉంటుంది. ప్రతి రిజర్వేషన్ కేటగిరిలో డబ్బున్నవారు తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదివించి, ప్రభుత్వ తెలుగు మీడియం పిల్లలు తమ పిల్లలతో పోటీ పడకుండా ఉండాలనే స్వార్థం ఓటు వేసే దగ్గర కూడా పనిచేస్తుంది. ఈ స్వార్థపు వేళ్లను తెంపడం చాలా కష్టం. మార్పు తెచ్చే ప్రభుత్వాలను దింపెయ్యాలనే ఈ ధనిక వర్గం ఓటు వ్యవస్థను తమకు అనుకూలంగా తిప్పుకుంటుంది.

ప్రపంచీకరణ యుగంలో వర్గం, హోదా, ఆధిక్యత... నాణ్యమైన ఇంగ్లీష్ విద్యతో ముడిపడి ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నిర్మాణాల్లో కూడా ఈ విధంగా ఆలోచించే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మార్పు తమ వర్గ శత్రువు అనుకునే శక్తులు వీరు. వీరు గ్రామాల్లో ఉన్నారు, పట్టణాల్లో ఉన్నారు.

భారతదేశ చరిత్రలో ఎప్పుడు కూడా స్కూలు విద్య ఎన్నికల్లో చర్చనీయాంశం కాలేదు. ఈసారి ఆంధ్ర ఎన్నికల్లో అది చర్చనీయాంశం అయింది. బహిరంగ సభల్లో సైతం స్కూలు పిల్లలు ఇంగ్లీషు, తెలుగులో వాగ్ధాటితో మాట్లాడటం, అదీ బీద కుటుంబం నుంచి వచ్చిన వారు మాట్లాడటం ఆ యా గ్రామాల్లో, పట్టణాల్లో ధనవంతులు జీర్ణించుకోలేని విషయం. మార్పును అంగీకరించదల్చుకోని విషయం. ఇది వైసీపీ ఓటమికి కొంత దోహదపడి ఉండవచ్చు. ఈ ధోరణిని తిప్పికొట్టాలంటే ప్రభుత్వ స్కూళ్ళలో చదివే పిల్లల తల్లిదండ్రుల తిరుగుబాటు మాత్రమే పనిచేస్తుంది.

భారతదేశంలో విద్య మీద గ్రామీణ స్థాయిలో చర్చలు, పోరాటాలు జరగలేదు. కమ్యూనిస్టులు కూడా ఇటువంటి పోరాటాన్ని జరపలేదు. ఈసారి ఆంధ్ర ఎన్నికల్లో కొత్త విద్యావిధానాన్ని ఓడించడానికి కమ్యూనిస్టులు కూడా సహకరించారు. ఆ విధంగా వీరు బీజేపీ భావజాలానికి మద్దతిచ్చారు.

అందుకే రానున్న ఐదేండ్లలో సమాన భాష, పురోగామి భావజాల పాఠశాల విద్య కోసం బలమైన పోరాటం జరగాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఈ పోరాటానికి నేతృత్వం వహించాల్సి ఉంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

జరిగిన మంచి



మూడు దశాబ్దాల తర్వాత, బారాముల్లాలో సిక్కు సమాజం 'నగర్ కీర్తన్' జరిపింది. ఆర్టికల్ 370 రద్దు కశ్మీర్‌లో బలమైన శాంతి, సామరస్యతలకు దారితీసింది. అన్ని విశ్వాసాలు, సమాజాలు సౌభ్రాతృత్వ భావనలో మనగలుగుతున్నాయి.

– ఫాతిమా దార్, కశ్మీరీ ఇండియన్

నీటు మాట



పెద్ద జోక్: తొమ్మిది లక్షల మంది విద్యార్థులకే విజయవంతంగా (మోసం లేకుండా) పరీక్ష నిర్వహించలేని జనాలు, వంద కోట్ల మందికి పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించామని చెప్పుకొంటున్నారు.

– అనుష్కా మిత్తల్, వ్యాఖ్యాత

నిజమైన మనుషులు



మలప్పురం నుంచి ఒక 'నిజమైన కేరళ కథ': తిరూర్‌లోని వెట్టకోరుమాకం ఆలయంలో మంటలు వ్యాపించినప్పుడు, ముగ్గురు ముస్లిం యువకులు మహమ్మద్ నౌఫల్, మహమ్మద్ బేసిల్, రసూల్ ఆ మంటలను ఆర్పేందుకు పరుగెత్తారు. 'జనాలు ఎవరూ సాయానికి ముందుకు రాకపోతే, వాళ్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చాం' అని పూజారి అన్నారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

అర్థం కావడం ముఖ్యం



తరగతి గదిలో ఈ మాటలు అనాలని నా పిల్లల్ని ప్రోత్సహిస్తాను: 1. మేడమ్, నాకు అర్థం కావడం లేదు. 2. మళ్లీ చెప్తారా? 3. నాకో డౌట్ 4. దీని గురించి మళ్లీ మీతో మాట్లాడొచ్చా?... ఇలాంటివి అడగటం చాలా సాధారణం; పిల్లలకు ఇది స్పష్టంగా చెప్పాలి.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

అంతు పట్టేనా?



ప్రపంచంలో ఏం జరుగుతోంది? ఉత్తర కొరియాలో పుతిన్; జీ–7 దేశాలు 50 బిలియన్ డాలర్లను ఉక్రెయిన్‌కు ఇవ్వడం; రష్యా అణు సబ్‌మెరైన్ క్యూబాలో; దలైలామాను అమెరికన్లు కలవడం; ఖలిస్తాన్‌ను కెనడా ప్రోత్సహించడం; చైనా, ఐఎంఎఫ్ నుంచి పాకిస్తాన్ ప్రయోజనాలు పొందే ప్రయత్నం... ఏదో జరుగుతోంది.

– సాజిద్ ఎస్.తరార్, పాక్ వ్యాపారవేత్త

విధానం ఏమిటి?



మనకో పెద్ద ప్రశ్న: భారత నేల మీద బహిరంగంగా టిబెట్ గురించిన రాజకీయ వ్యాఖ్యలను చేసేలా అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులను అనుమతించడం ద్వారా న్యూఢిల్లీ ఏం సాధించాలనుకుంటోంది? ఒకవేళ ఇదే భారత విధానమైతే, మరి దాన్నే భారత అధికారులు, నాయకులు వేదిక మీద ఎందుకు చేయకూడదు?

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

పెద్ద మనుషుల తరం



మా 'నానా' (తాత ; అమ్మ తండ్రి) మాకు అర్థం కాని భాషలో పుస్తకాలు చదవడాన్ని చూస్తూ పెరిగాము. అవి భగవద్గీత, రామాయణం, ఇంకా ఇతర మత గ్రంథాలని చెప్పేవాళ్లు. ఆయన పుస్తకాల్లో ఒకటి (ఉర్దూలో ఉన్న నవదుర్గల కథ) ఇవ్వాళ దొరికింది. ఒకప్పుడు మనుషులు మత దురభిమానం ఏమాత్రం లేకుండా కూడా ధార్మికంగా ఉండేవాళ్లు.

– ఏక్తా చౌహాన్, కళా బోధకురాలు

ఆమె ఎవరంటే...

ఆమె ఎవరని అడుగుతారేమో
ఏమని చెప్పాలి!?
ఆమె అక్షరం అని చెప్పనా
కష్ట జీవుల కన్నీటి వ్యథ అనాలా
ఆమె ఓ ధిక్కార స్వరం అని చెప్పనా
ఏమని చెప్పాలి?
అణిచివేతల సాచివేతల రాజ్యంలో
ఆమె ఓ పోరాట జ్వాల
చీకటి కొనల మీద చిక్కటి వెలుగు తాను

ఆమె ఎవరని అడుగుతారేమో
ఆమె అన్నార్తుల
ఆకలి కేకల పోరు నాదమని
గొంతు లేని ప్రజల గొంతుకని
ఆమె అక్షరం తెలియని వాళ్ల
అడుగు జాడల్లో అక్షర దివిటని
ఆమె ప్రజా పోరు దారుల్లో
ఓ అడుగు జాడని చెప్పగలను



ఆమె గొంతు ఎందుకు
నొక్కుతున్నారని అడిగితే మాత్రం
ఆమె శోషితుల పక్షమై నిల్చినందుకు
ఆమె పౌర హక్కులు అడిగినందుకు
ఆమె స్త్రీ సమానత్వం కోరినందుకు
ఆమె జాతి విముక్తి నినదించినందుకు
ఆమె స్వేచ్ఛను కోరినందుకే కదా
రాజ్య ద్రోహం అనే రాజ్య బహుమానం

– వంగల సంతోష్
(అరుంధతీ రాయ్‌పై పెట్టిన కేసును ఖండిస్తూ)

మనస్ఫూర్తిగా జీవించే యోగం కోసం...

ప్రస్తుతం మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం లేదంటే అతిశయోక్తి కాదు. పని ఒత్తిడి, ఆర్థికపరమైన సమస్యలు, ఇతర ఇబ్బందుల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతిరోజూ కనీసం ఓ అర గంటయినా శారీరక శ్రమ చేయాలంటారు నిపుణులు. అందుకు యోగా చక్కని మార్గం. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుంది. చాలామందికి, వారి అస్తవ్యస్తమైన, బిజీ జీవితాల నుండి యోగా ఉపశమనాన్ని ఇవ్వగలదు. యోగా చేయడం వల్ల శరీరానికి నూతనోత్సాహం కలుగుతుంది. బలాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుంది. భంగిమను మెరుగుపరుస్తుంది. మనసు, శరీరం, ఆత్మను నియంత్రించడంలో యోగా సహాయపడుతుంది.

యోగా ఒక శక్తిమంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధన. యోగా ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేట్లు చేస్తుంది. యోగా చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. యోగ శ్వాసక్రియ శక్తిని కూడా మెరుగుపరుస్తుంది. యోగా సాధన సాగదీసినట్లు అనిపించవచ్చు. కానీ శరీరానికి మంచి అనుభూతి అందించడం, కదిలే విధానంలో చాలా మార్పు చూపుతుంది. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల బరువు తగ్గడం, ఒత్తిడిని తగ్గించుకోవడం సాధ్యమవుతాయి. యోగ అభ్యాసం వలన కలిగే ప్రయోజనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వ్యాప్తిలోకి వచ్చాయి.

యోగాలో చాలా రకాలు ఉన్నాయి, హఠ (అనేక శైలుల కలయిక) అత్యంత ప్రాచుర్యం పొందిన శైలులలో ఒకటి. హఠ యోగం ప్రాణాయామాలపై (శ్వాస నియంత్రిత వ్యాయామాలు) దృష్టి పెడుతుంది. వీటి తర్వాత వరుసలో ఆసనాలు (యోగా భంగిమలు) ఉంటాయి. అవి శవాసనంతో (విశ్రాంతి కాలం) ముగుస్తాయి.



యోగశాలల్లో సాధారణంగా అద్దాలు ఉండవు. సాధకులు తమను చుట్టుపక్కల వ్యక్తులు ఎలా చూస్తారనే దాని కంటే ముఖ్యంగా తమ పట్ల తమకు ఏకాగ్రత అవసరం. యోగా సాధన చేయని వ్యక్తుల కంటే యోగా సాధన చేసేవారికి తమ శరీరాల గురించి ఎక్కువ అవగాహన ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. యోగాసనాలు వేసేవారు ఎక్కువ సంతృప్తిగా ఉన్నారు. తమ శరీరాలపై తక్కువ ఫిర్యాదులు చేశారు. అందుకే సానుకూల శరీర ఆకృతి, ఆత్మగౌరవాలను ప్రోత్సహించే కార్యక్రమాలు యోగా చికిత్సలో భాగం అవుతున్నాయి.


యోగాను అభ్యసించడం ద్వారా, ఒక వ్యక్తి జీవితంలోని ఇతర రంగాలలో కూడా అవగాహన మెరుగవుతుంది. తినే రుగ్మతలను యోగా పోగొడుతుంది. బుద్ధిపూర్వకంగా తినడం, శారీరక భావోద్వేగ అనుభూతులను అవగాహనకు తెచ్చుకోవడంలో యోగా సాయపడుతుంది. విచారంలో ఉన్నప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు పరధ్యానంగా తింటారు. అదే యోగాను అభ్యసించే వ్యక్తులు ఒక పద్ధతి ప్రకారం మనస్ఫూర్తిగా భుజిస్తారు. అందుకే బరువు తగ్గాలనుకునేవారికి యోగా సాధన ఉత్తమం. బుద్ధిపూర్వకంగా తినేవారు తమ శరీరాన్ని ఆరోగ్యాంగా చూసుకుంటారు. యోగా సాధన చేసేవారిలో కండరాల బలం, స్థితప్రజ్ఞత, ఓర్పు, కార్డియో–రెస్పిరేటరీ ఫిట్‌నెస్ మెరుగవుతాయని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. యోగా, మంచి ఆహార అలవాట్లు మనిషి మనుగడను మెరుగుపరుస్తాయి. మనిషి ప్రశాంతతకు, ఆనందమయ జీవితానికి యోగా మంచి ఉపకరణం.

– డా॥ ఎం. అఖిల మిత్ర । ప్రకృతి వైద్యులు
(నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం)

సంతాపం సగం చేటు

పుట్టెడు కష్టం వచ్చి శోకసంతాపాల్లో మునిగి ఉన్న వ్యక్తిని, 'ఊరుకో, దుఃఖించకు!' అంటే ఊరుకోడు. ఊరుకోలేడు. అనుకోకుండా తీవ్రమైన కష్టాలు ఎదురయినప్పుడు మనిషికి సంతాపం, దిగులు, దుఃఖం కలగటం మామూలు విషయమే. కొన్ని పరిమితులలో ఉన్నవరకూ అది మానసిక ఆరోగ్యానికి మంచిది కూడా!

అయితే ఘడియకో, గంటకో, రోజుకో, వారానికో ఎలాగోలా దాన్ని అధిగమించాలి. బాధే సౌఖ్యమనే భావన పట్టుకొని, శోకపు ఊబి నుంచి బయటపడే ప్రయాస చేయని దేవదాసు మనసు మీదా, జీవితం మీదా అదుపు కోల్పోయి మరింత శోకం కొని తెచ్చుకొన్నవాడయ్యాడు.



సఫల జీవనం కోరేవాడికి సంతోషం సగం బలం. సంతాపం సగం చేటు.

సందర్భానికి సరిపడని నవ్వులాగా, దీర్ఘ కాలం కొనసాగే సంతాపం కూడా నాలుగందాల చేటు అంటుంది మహాభారతం. 'సంతాపాత్ భ్రశ్యతే రూపం, సంతాపాత్ భ్రశ్యతే బలమ్'... దీర్ఘ శోకం వల్ల శరీరం చిక్కి, ముఖం నిస్తేజమై, ఆకారం వికారమవుతుంది. సంతాపం వల్ల బలం– అటు మనోబలమూ, ఇటు శరీర బలమూ– క్షీణించటం జరుగుతుంది. 'సంతాపాత్ భ్రశ్యతే జ్ఞానం, సంతాపాత్ వ్యాధిం ఋచ్ఛతి'... దుఃఖం వల్ల వివేచనా, జ్ఞానమూ సన్నగిల్లుతాయి. మితిమీరిన సంతాపం అనారోగ్యాన్ని కలిగిస్తుంది.

శోకించటం వల్ల, కోల్పోయింది తిరిగిరాదు. తిరిగి రావాలంటే కావాల్సింది ప్రయాస. ఆ ప్రయాసకు శోకం ప్రతిబంధకం. శోకం వల్ల, శోకించేవాడికి లాభం శూన్యం. అతడి శత్రువులకు మాత్రం అతడి శోకం ఆనందాన్నిస్తుంది అంటాడు విదురుడు.

– ఎం. మారుతి శాస్త్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

● విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియతో పాటు ఉపాధ్యాయ బదిలీలను వేగవంతంగా చేపట్టినందుకు ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. మల్టీజోన్‌-2 పరిధిలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోందని, పదోన్నతులతో ఖాళీ అయిన ఉద్యోగాలను కూడా వేగంగా భర్తీ చేయాలని జాక్టో చైర్మన్‌ జి.సదానంద్‌గౌడ్, సెక్రటరీ జనరల్‌ ఎం.రాధాకృష్ణ, కోశాధికారి కె.కృష్ణుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



శ్రీరాంసాగర్ వెలవెల

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. బ్యాక్‌వాటర్ ఏరియా నెర్రెలు బారింది. ప్రస్తుతం జలాశయంలో కేవలం 8 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ఇందులో 5 టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుంది. గత ఏడాది ఈ సమయానికి ప్రాజెక్టులో 15 టీఎంసీల నీరు ఉంది. ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి వరద రాకపోతే ప్రాజెక్టు వట్టిపోయినట్టే.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

రుణమాఫీకి పరిమితులు?

▶ మొదటి పేజీ తరువాయి

కసరత్తు చేశాయని సమాచారం.

ధనికులు, ప్రముఖులను మినహాయిస్తూ..

సీఎం కార్యాలయ వర్గాలు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల అంచనా ప్రకారం.. ధనికులకు రుణమాఫీ ఎట్టి పరిస్థితుల్లోనూ చేసే అవకాశం లేదు. ప్రస్తుతం కేంద్రం అమలు చేస్తున్నా పీఎం కిసాన్ పథకం కింద.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్‌పర్సన్లు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధిక ఆదాయం ఉండి ఆదాయ పన్ను చెల్లించేవారిని మినహాయించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేయనున్న రైతు రుణమాఫీలోనూ ఈ వర్గాలను మినహాయించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఆదాయ పన్ను చెల్లించే ప్రతి ఒక్కరినీ కాకుండా.. అధిక ఆదాయమున్న వారిని మాత్రమే మినహాయిస్తారని అంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ అందరినీ కాకుండా.. అటెండర్లు వంటి చిన్నస్థాయి ఉద్యోగులకు రైతు రుణమాఫీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారని వివరిస్తున్నాయి. ఇలాంటి వారికి రుణమాఫీని మినహాయిస్తే ప్రజల్లో వ్యతిరేకత వచ్చే అవకాశం పెద్దగా ఉండదని ప్రభుత్వం భావిస్తున్నట్టు చెప్తున్నాయి. ఇక రుణమాఫీకి కటాఫ్ తేదీని కూడా మంత్రివర్గ సమావేశంలోనే ఖరారు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన తేదీ లేదా సోనియాగాంధీ పుట్టినరోజును ప్రామాణికంగా తీసుకునే ప్రతిపాదన ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ రెండు తేదీల్లో ఏదో ఒక దాన్ని ఫైనల్ చేసే అవకాశం ఉందని అంటున్నారు.

భూసీలింగ్ ఏదైనా వర్తింపజేస్తారా?

ఆగస్టు 15వ తేదీలోగా రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం గడువులోగా రుణమాఫీ చేసేందుకు సన్నాహాలు చేయాలని వ్యవసాయ, ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు కూడా. రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరం? అందుకు తగ్గట్టుగా నిధుల సమీకరణకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు, అందుబాటులో ఉన్న వనరులేమిటన్న దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో జరిగిన రుణమాఫీ అమలు తీరును పరిశీలించటంతోపాటు ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ పథకాలు, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలకు అనుసరించిన పద్ధతులపై అధికారులు అధ్యయనం చేశారు. ఆ పథకాల ప్రయోజనాలు, అనుసరించిన విధివిధానాలు, నిర్దేశించిన అర్హతలను కూడా పరిశీలించారు. రాష్ట్ర ఆర్థిక, వ్యవసాయశాఖల అధికారులు ముంబై వెళ్లి మహారాష్ట్ర రుణమాఫీని అధ్యయనం చేసి వచ్చారు. ఏం చేసినా అసలైన రైతులకు మేలు జరిగేలా, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతీ రైతుకు ప్రయోజనం కలిగించేలా విధివిధానాలు ఉంటాయని అధికారులు చెప్తున్నారు. అయితే ధనిక రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉండదన్న చర్చ కూడా జరుగుతోంది. కానీ కొన్ని నిబంధనలను కఠినంగా అమలు చేసే ప్రతిపాదన ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి. రైతు భరోసాను ఐదు లేదా పదెకరాలకు పరిమితం చేసే ఆలోచన ఉన్నట్టు ప్రచారం జరిగింది. అలాగే రుణమాఫీకి కూడా అలాంటి పరిమితి విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

ఇంకా తర్జనభర్జన

రైతు రుణమాఫీ కోసం వడ్డీతో కలిపి దాదాపు రూ.35 వేల కోట్లు కావాలని అధికారులు అంచనా వేశారు. కటాఫ్ తేదీ, షరతులను బట్టి ఆర్థికభారం తగ్గే అవకాశం ఉందని అంటు న్నారు. అయితే ఆర్థికభారం తగ్గించుకునేందుకు ఎక్కువ షరతులు విధిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందా? అన్న సంశయం ప్రభుత్వంలో వ్యక్తమవుతున్నట్టు చెప్తున్నారు. ఉద్యోగులను మినహాయిస్తే వారి నుంచి వ్యతిరేకత వస్తుందేమోనన్న చర్చ జరుగుతోంది. అలాగే ఐదు లేదా పదెకరాలకే పరిమితి విధిస్తే.. మిగతా రైతు ల నుంచి వ్యతిరేకత రావొచ్చని అంటున్నారు. షరతులు పెడితే ఆర్థికంగా పెద్ద మొత్తంలో మిగులు ఉండాలని.. అలాకాకుండా మిగిలేది తక్కువే ఉంటే షరతులు ఎక్కువగా పెట్టకపోవడమే మంచిదన్న అభిప్రాయం కూడా నెలకొంది. ఈ క్రమంలో 'మినహాయింపుల'పై ప్రభుత్వం తర్జనభర్జన పడుతూనే ఉంది. మరోవైపు ఒకేసారి పెద్ద మొత్తంలో సొమ్మును సమకూర్చడం సాధ్యంకానందున.. విడతల వారీగా రుణమాఫీ జేసే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లదు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. పక్కన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: భావ ప్రకటన స్వేచ్ఛకు తమ ప్రభుత్వంలో ఎలాంటి భంగం కలగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మంలో రెండు రోజులుగా జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్రమహాసభలు గురువారం ముగిశాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భట్టి మాట్లాడుతూ, మీడియా భద్రత కోసం ఒక చట్టాన్ని తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపు త్వరలోనే జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతు రుణమాఫీ విషయంలో అపోహలు అవసరం లేదని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిజం కత్తి మీద సాము లాంటిదని, నీతి, నిజాయితీతో పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, కె.రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలోనే రాష్ట్ర అధ్యక్షుడిగా కె.విరాహత్ అలీని ఎన్నుకోగా మిగతా కమిటీని ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.రాంనారాయణ (ఖమ్మం)తో పాటు ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులతో పాటు 16 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గాడిపల్లి మధు (వరంగల్), ఎంఏకే.ఫైసల్ (సంగారెడ్డి), బి.సంపత్‌కుమార్ (పెద్దపల్లి), కార్యదర్శులుగా కె.శ్రీకాంత్‌రెడ్డి (సంగారెడ్డి), జి.మధుగౌడ్ (వనపర్తి), వి.యాదగిరి (హైదరాబాద్), కోశాధికారిగా ఎం.వెంకట్‌రెడ్డి(మేడ్చల్), కార్యవర్గ సభ్యులుగా ఎం.వేణుగోపాలరావు(ఖమ్మం), పి.వేణుమాధవరావు(హనుమకొండ), ఆర్.ప్రకాశ్‌రెడ్డి (మంచిర్యాల), ఎం.కర్ణయ్య (నాగర్‌కర్నూల్), జి.శ్రీనివాస్‌శర్మ (మెదక్), పి.ప్రభాకర్‌రెడ్డి (నల్లగొండ), సయ్యద్ అబ్దుల్ లతీఫ్(కామారెడ్డి), జె.సురేందర్‌కుమార్ (జగిత్యాల), ఎ.రవీందర్ (కరీంనగర్), ఎ.రాజేశ్(హైదరాబాద్), కె.రాజిరెడ్డి(సిద్దిపేట), సయ్యద్ గౌస్ మోహియుద్దీన్(హైదరాబాద్), కె.అనిల్‌కుమార్ (హైదరాబాద్), చలసాని శ్రీనివాసరావు(సూర్యాపేట), కంకనాల సంతోశ్(హనుమకొండ), గుడిపెల్లి శ్రీనివాస్(రంగారెడ్డి)ని ప్రకటించారు.

పండుటాకులకు 'చేయూత'!

- కామారెడ్డి జిల్లాలో అధికారుల సర్వే
- సొంతూళ్లలోనే పింఛన్ అందించేందుకు కసరత్తు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, కామారెడ్డి: పింఛన్‌దారుల కష్టాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. చేయూత ద్వారా అందుతున్న పింఛన్లు సొంతూళ్లలోనే తీసుకుంటున్నారా? వేరే ఊళ్లకు వెళ్లాల్సి వస్తుందా? అన్నదానిపై క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుగుతోంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఎల్లారెడ్డిలో, ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన లబ్ధిదారులకు కామారెడ్డిలో పింఛన్లు ఇస్తున్న విషయంపై ఈ నెల 18న 'పింఛన్ కోసం 50 కిలోమీటర్లు' శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో ప్రచురితమైన కథనంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారు. పింఛన్‌దారుల కష్టాలపై వెంటనే అధికారులను నివేదిక అడిగారు. ఇదే సమయంలో జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాల్లో ఒక చోట పింఛన్ మంజూరై, మరో చోట పింఛన్ తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్న పింఛన్‌దారుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.చందర్ ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 21న సాయంత్రం 4 గంటలలోపు వివరాలను మెయిల్ చేయడంతో పాటు సాఫ్ట్ కాపీ అందించాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత రానుంది.

తీరనున్న పండుటాకుల కష్టాలు...

పింఛన్ కోసం పండుటాకులు పడుతున్న కష్టాలకు త్వరలోనే పరిష్కారం దొరకనుంది. 'సాక్షి' కథనంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. ఏడాదిన్నర కాలంగా సమస్య ఉంటే ఎందుకు పరిష్కరించలేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జాబితా రూపొందించిన తరువాత చేయూత పింఛన్‌దారులకు వారి వారి గ్రామాల్లోనే పింఛన్ అందే ఏర్పాట్లు చేయనున్నారు. దీంతో వారి కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు.

తండ్రి మందలించాడని కుమారుడి బలవన్మరణం



సాయిచరణ్

నస్పూర్ (మంచిర్యాల): పుస్తకాలు పారేసుకున్నాడని తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణ పరిధిలోని సంఘం మల్లయ్యపల్లెలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. మల్లయ్యపల్లెకు చెందిన రెడ్డి శ్రీనివాస్, అనూష దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ మున్సిపాల్టీలో చెత్త తరలించే వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పెద్ద కుమారుడు రెడ్డి సాయిచరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో పాఠ్యపుస్తకాలు ఎక్కడో పారేసుకోవడంతో తండ్రి మందలించాడు. దీంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయిచరణ్ ఇంటి పైకప్పుకు చున్నీతో ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

17 లక్షల ఎకరాల్లో సాగు

- పత్తి 15.60 లక్షల ఎకరాల్లో, కంది 76 వేల ఎకరాల్లో
- వ్యవసాయ మంత్రి తుమ్మల వెల్లడి
- ఎరువుల సరఫరా పారదర్శకంగా జరిగేలా చూడాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల 19 వరకు 17 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పత్తి 15.60 లక్షల ఎకరాలు, కంది 76 వేల ఎకరాల్లో సాగయిందని చెప్పారు. రానున్న రోజుల్లో వరినాట్లు, ఆరుతడి పంటల సాగు ఊపందుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో వానాకాలం పంటల సాగు, ఎరువుల నిల్వ, సరఫరాపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎరువుల సరఫరా పారదర్శకంగా జరగాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు చేస్తే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేయాలని, అదే విధంగా విక్రయాలను పరిశీలించాలని సూచించారు.

10.40 ఎల్ఎంటీల యూరియా కేటాయింపు

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) యూరియా, 2.40 ఎల్ఎంటీల డీఏపీ, 10.00 ఎల్ఎంటీల కాంప్లెక్స్ , 0.60 ఎల్ఎంటీల ఎంవోపీ ఎరువులు కేటాయించిందని మంత్రి తెలిపారు. జూలై చివరి నాటికి 5.65 ఎల్ఎంటీల యూరియా అవసరం కాగా ఇప్పటికే 8.35 ఎల్ఎంటీల యూరియా, అలాగే 1.57 ఎల్ఎంటీల డీఏపీ, 1.30 ఎల్ఎంటీల కాంప్లెక్స్, 0.38 ఎల్ఎంటీల ఎంవోపీ అందుబాటులో తెచ్చామన్నారు. 1.07 ఎల్ఎంటీల యూరియా, 0.54 ఎల్ఎంటీల డీఏపీ, 1.06 ఎల్ఎంటీల కాంప్లెక్స్ ఎరువులను రైతులు కొనుగోలు చేశారని మంత్రికి అధికారులు వివరించారు.

ఆగస్టు వరకు సరిపడా ఎరువుల కోసం కేంద్ర మంత్రికి లేఖ

ఆగస్టు నెల వరకు సరిపడా ఎరువులను వీలైనంత త్వరగా రాష్ట్రానికి సరఫరా చేయాలని కోరుతూ కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి లేఖ రాశారు. వానాకాలం పంటలు తెలంగాణలో ముందుగా ప్రారంభమవుతాయని, దానికి తగ్గట్లుగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే రెండు నెలలకు సరిపడా ఎరువులను ముందుగానే తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. రాష్ట్ర కేటాయింపుల ప్రకారం ఆగస్టు నెల వరకు కేటాయించిన డీఏపీ, ఇతర ఎరువులను వెంటనే సరఫరా చేసేలా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఎకరాకు రూ.15 వేలివ్వాలి: జూలకంటి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతు భరోసా పెట్టుబడి ద్వారా రైతులను ఆదుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఈవీఎంలు వెరిఫికేషన్ చేయండి

- 8 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు
- మైక్రో కంట్రోలర్ చిప్‌ల ట్యాంపరింగ్‌పై అనుమానాలు వ్యక్తంచేస్తూ ఈసీకి అభ్యర్థనలు
- ఏపీ, ఒడిశా అసెంబ్లీలకు సంబంధించి మూడు దరఖాస్తులు


సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలపై కొందరు అభ్యర్థులు అనుమానాలు వ్యక్తంచేస్తూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఈవీఎంలలోని మైక్రో-కంట్రోలర్ చిప్‌లు ట్యాంపరింగ్‌కు గురయ్యాయో లేదో తనిఖీ చేయాలని ఆయా లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఆరు రాష్ట్రాల పరిధిలోని ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులుసహా ఎనిమిది దరఖాస్తులు ఈసీకి అందాయి. తమిళనాడు, హరియాణాలో చెరో రెండు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చెరో స్థానంలో ఇలా మొత్తంగా 8 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. పేపర్ బ్యాలెట్ విధానానికి మారుదామంటూ దాఖలైన పిటిషన్లను కొట్టేస్తూ, ఈవీఎం విధానాన్ని సమర్థిస్తూ ఏప్రిల్ 26వ తేదీన సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు వెలువడిన వేళ ఇలా ఈసీకి అభ్యర్థనలు రావడం గమనార్హం. అయితే ఆయా నియోజకవర్గాల్లో ఓడి రెండో, మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంలపై సందేహాలు వ్యక్తంచేస్తే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ర్యాండమ్‌గా ఐదు శాతం ఈవీఎంలను చెక్‌చేసేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది. ఈ వెసులుబాటును వినియోగించుకుంటూ ఓడిన అభ్యర్థులు కొందరు తాజాగా ఈసీని ఆశ్రయించగా ఆయా వివరాలను ఈసీ వెల్లడించింది. ఆరు రాష్ట్రాల్లో కలిపి 92 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను చెక్ చేయనున్నారు. అయితే ఒక్కో ఈవీఎం సెట్‌ను తనిఖీచేయడానికి నిర్వహణ ఖర్చుగా రూ.47,200ను ఆ అభ్యర్థి ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జూన్ ఒకటో తేదీన ఈసీ ఒక ప్రకటన జారీచేయడం తెల్సిందే. ఈవీఎంల తనిఖీ ఖర్చును భారత్ ఎలక్ట్రానిక్స్ (బెల్), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐఎల్)లు రూ.40,000 నిర్ణయించగా జీఎస్టీ 18 శాతం(రూ.7,200) కలుపుకుంటే ఖర్చు రూ. 47,200గా తేలింది. అయితే ఈవీఎంల తరలింపు, వాటిని తనిఖీని రికార్డ్ చేసేందుకు సీసీటీవీల ఏర్పాటు, విద్యుత్ చార్జీలు, వీడియోగ్రఫీ, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో ఇతర నిర్వహణ ఖర్చులు అదనంగా ఉండొచ్చని తెలుస్తోంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి సంజయ్ రాధాకృష్ణ విఖే పాటిల్ 40 పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ చేయాలని దరఖాస్తుచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని ఒక లోక్‌సభ పరిధిలోని 4 పోలింగ్ స్టేషన్లను, హరియాణాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోని 6 పోలింగ్ స్టేషన్లను, తమిళనాడులోని 2 లోక్‌సభ స్థానాల్లోని 20 పోలింగ్ స్టేషన్లను అభ్యర్థులు తనిఖీకి ఎంచుకున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలోని బొబ్బిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎంలను తనిఖీ చేయాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోరారు. గజపతినగరం అసెంబ్లీ స్థానంలో ఒక పోలింగ్ స్టేషన్, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 12 పోలింగ్ స్టేషన్లను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎంచుకున్నారు. తెలంగాణలోని జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న నారాయణ్‌ఖేడ్‌లో 7 , జహీరాబాద్‌లో 7, ఆందోల్‌లో 6 పోలింగ్ స్టేషన్లను బీజేపీ అభ్యర్థి ఎంచుకున్నారు. ఒడిశాలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 13 పోలింగ్ స్టేషన్లను బీజేడీ అభ్యర్థి ఎంచుకున్నారు.

కశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు

- రాష్ట్ర హోదా పునరుద్ధరణ కూడా..
- శ్రీనగర్‌లో ప్రకటించిన ప్రధాని మోదీ



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయని ప్రధాని మోదీ చెప్పారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతానికి త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. గురువారం సాయంత్రం శ్రీనగర్‌లో రూ.1,500 కోట్ల విలువైన 84 అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లో ఇటీవలి ఉగ్రదాడులకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ శత్రువులకు తగు రీతిలో బుద్ధి చెబుతామన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న జమ్మూకశ్మీర్ యువతను ఆయన అభినందించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అడ్డుగోడ తొలగిపోయిందని, జమ్మూకశ్మీర్‌లో నేడు భారత రాజ్యాంగం నిజంగా అమలవుతోందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో శాశ్వతంగా శాంతిని నెలకొల్పుతామని ప్రజలకు హామీ ఇచ్చారు.

శ్రీనగర్‌లో నేడు యోగా డే

అంతకుముందు, జమ్మూకశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనకు గాను గురువారం సాయంత్రం శ్రీనగర్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)వద్ద ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు దాల్ సరస్సు సమీపంలోని ఎస్‌కేఐసీసీలో జరిగే 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో 7 వేల మందికి పైగా పాలుపంచుకుని ఆసనాలు వేస్తారు.


కేజ్రీవాల్‌కు బెయిల్

మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు • నేడు విడుదలకానున్న ఢిల్లీ సీఎం

ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ అభియోగాలపై అరెస్టయిన ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు గురువారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ వెకేషన్ స్పెషల్ జడ్జి నియయ్ బిందు ఆదేశాలు జారీ చేశారు. బెయిల్ ఆదేశాలను 48 గంటల పాటు నిలిపి ఉంచాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభ్యర్థనను జడ్జి తిరస్కరించారు. బెయిల్ ఉత్తర్వులను హైకోర్టులో సవాల్ చేస్తామని, అందుకోసం 48 గంటలు ఆదేశాలను నిలిపి ఉంచాలని ఈడీ అభ్యర్థించింది. కానీ జడ్జి నియయ్ బిందు ఇందుకు సమ్మతించలేదు. దర్యాప్తునకు ఆటంకం కల్పించకూడదని, సాక్షులను ప్రభావితం చేయరాదని కేజ్రీవాల్‌కు కోర్టు షరతులు విధించింది. అలాగే అవసరమైనప్పుడల్లా కోర్టు ఎదుట హాజరుకావాలని, దర్యాప్తునకు సహకరించాలని షరతులు పెట్టింది. కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ రావడం ఆప్‌కు, ఇండియా కూటమి మిత్రపక్షాలకు ప్రధానికి వ్యతిరేకంగా ఒక అస్త్రం దొరికినట్లే. కేజ్రీవాల్ న్యాయవాదులు శుక్రవారం కోర్టులో పూచీకత్తును సమర్పిస్తే అదేరోజు తీహార్ జైలు నుంచి ఢిల్లీ సీఎం బయటకు వస్తారు. ఢిల్లీ మద్యం పాలసీలో కొందరు మద్యం వ్యాపారులకు మేలు చేకూర్చేలా ఉద్దేశపూర్వకంగా నిబంధనలకు చేర్చారని, ఈ కుట్రలో కేజ్రీవాల్ భాగస్వామి అని ఆరోపిస్తూ ఈడీ మార్చి 21న ఢిల్లీ సీఎంను అరెస్టు చేసింది. మద్యం వ్యాపారుల నుంచి అందుకున్న ముడుపులను గోవా ఎన్నికల్లో ఆప్ ప్రచారానికి వినియోగించారని, ఆప్ జాతీయ కన్వీనర్‌గా కేజ్రీవాల్ వ్యక్తిగతంగా, పరోక్షంగా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లేనని ఈడీ వాదించింది. ఈ ఆరోపణలను ఖండించిన కేజ్రీవాల్ ఒక్క పైసాను కూడా ఈడీ పట్టుకోలేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీంకోర్టు మే 10 తేదీన కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఎన్నికలు ముగిశాక కేజ్రీవాల్ జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోయారు.

ఈడీది అంతులేని దర్యాప్తు

మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఎలాంటి నగదును స్వాధీనం చేసుకోలేదని, కేజ్రీవాల్‌పై అభియోగాలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని ఆయన న్యాయవాది వాదించారు. ఈడీ పక్షాన హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్.వి.రాజు కేజ్రీవాల్‌కు బెయిల్‌ను వ్యతిరేకించారు. ఈడీ ఊహాజనిత దర్యాప్తును చేయడం లేదని, లంచాలుగా ఇచ్చిన కరెన్సీ నోట్ల ఫోటోలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. గోవాలో కేజ్రీవాల్ బసచేసిన సెవన్ స్టార్ హోటల్ గదికి చెల్లింపులు జరపడానికి ముడుపుల డబ్బునే వాడారని ఆరోపించారు. తన మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్‌ను కేజ్రీవాల్ ఇవ్వడం లేదని, దీనిబట్టి మద్యం కుంభకోణంలో ఆయన పాత్ర ఉందని భావించవచ్చని రాజు వాదించారు. కేజ్రీవాల్ మొబైల్ ఫోన్‌ను ఓపెన్ చేస్తే మరింతమంది ప్రమేయం బయపడుతుందన్నారు. 'కేజ్రీవాల్ వ్యక్తిగతంగా ఎలాంటి నేరానికి పాల్పడకపోయినా.. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) సెక్షన్ 70 ప్రకారం ఆమ్‌ఆద్మీ పార్టీ వ్యవహారాలకు ఆయనే బాధ్యుడు కాబట్టి ఆప్ నేరాలకు కూడా జాతీయ కన్వీనర్‌గా ఢిల్లీ సీఎం దోషిగా బాధ్యుడవుతాడు' అని రాజు పేర్కొన్నారు. కేజ్రీవాల్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి.. ఈడీ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. 'ఈడీ స్వతంత్ర సంస్థా? లేక రాజకీయ బాసులు చెప్పినట్లు ఆడుతోందా? అని విక్రమ్ చౌదరి ప్రశ్నించారు. ఊహాజనిత అంశాల ఆధారంగానే ఈడీ తుది నిర్ణయాలకు వస్తోందన్నారు. ఆప్‌కు రూ. 45 కోట్లు ముడుపులు ముట్టాయనడానికి ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఇంకా అరెస్టులు కొనసాగిస్తున్నారు. మరోవైపు రూ. 100 కోట్లు ముడుపులుగా అందాయంటారు. ఈడీ ఇంకా ఆధారాలు సేకరిస్తూనే ఉంటే.. ఇది అంతులేని దర్యాప్తే అవుతుంది. కాబట్టి ఇతరులకు ఇచ్చినట్లే కేజ్రీవాల్‌కు స్వేచ్ఛనివ్వాలని విక్రమ్ చౌదరి కోర్టుకు విన్నవించారు.



మనీలాండరింగ్ కేసులో పరిణామక్రమం..

జూలై 2022: ఢిల్లీ ఎక్సైజ్ విధానంలో రూపకల్పన, అమలులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశం.

ఆగస్టు 2022: సీబీఐ, ఈడీ కేసులు నమోదు.

అక్టోబర్ 30, 2023: మనీ లాండరింగ్ కేసులో నవంబరు 2న విచారణకు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు ఈడీ తొలి సమన్లు.

ఏప్రిల్ 27: చట్టవిరుద్ధ అరెస్టు.. స్వేచ్ఛాయుత ఎన్నికలు, సమాఖ్య వ్యవస్థ అనే ప్రజాస్వామ్య మూలస్తంభాలపై దాడి అని సుప్రీంకోర్టుకు తెలిపిన కేజ్రీవాల్.

ఏప్రిల్ 29: ఈడీ పలుమార్లు సమన్లు జారీచేసినా స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి కేజ్రీవాల్ విచారణకు హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.

మే 10: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు. జూన్ 2న లొంగిపోవాలని ఆదేశం.

మే 30: అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌ను కోరుతూ ఢిల్లీ కోర్టుకు కేజ్రీవాల్.

జూన్ 5: మధ్యంతర బెయిల్ తిరస్కరణ.

జూన్ 20: రెగ్యులర్ బెయిల్ మంజూరు.

హజ్ యాత్రలో వెయ్యి మంది మృతి

రియాద్: ఈ ఏడాది హజ్ యాత్రలో ఎండల తీవ్రతకు తాళలేక 10 దేశాలకు చెందిన 1,081 మంది చనిపోయారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో భారతీయులు 68 మంది కాగా, ఈజిప్టు దేశస్తులు అత్యధికంగా 658 ఉన్నారు. ఒక్క గురువారమే ఈజిప్టుకు చెందిన 58 మంది చనిపోయినట్లు ఆ దేశ దౌత్యాధికారి ఒకరు తెలిపారు. మొత్తం మృతుల్లో 630 మంది వరకు అనధికారికంగా వచ్చిన వారు ఉన్నారు. అధికారికంగా పేర్లు నమోదైన వారికి, ప్రభుత్వం ఏసీ ప్రాంతాన్ని కేటాయిస్తుంది. అనధికారికంగా వచ్చిన వారు ఎండకు తాళలేక ప్రాణాలు కోల్పోతున్నారని అధికారులు చెప్పారు.

ఢిల్లీలో వడగాడ్పులకు గూడు లేని 192 మంది బలి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎండల తీవ్రత, వడగాడ్పులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 11 నుంచి 19వ తేదీల మధ్య అత్యధికంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ సమయంలో వేడిగాలులకు తాళలేక 192 మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో 80 శాతం మంది ఎటువంటి ఆశ్రయం లేని వారేనని సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ అనే ఎన్జీవో తెలిపింది. ఇటువంటి వారికి తక్షణమే వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ చెప్పారు. గాలి కాలుష్యం, పారిశ్రామికీకరణ,అడవుల నరికివేత వంటివి ఉష్ణోగ్రతలు పెరగడానికి, గూడు లేని వారి ఇబ్బందులను పెంచాయని విశ్లేషించారు.

ప్రొటెం స్పీకర్‌గా మహతాబ్




న్యూఢిల్లీ: ఏడుసార్లు ఎంపీ అయిన భర్తృహరి మహతాబ్ లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 95 (1) ప్రకారం.. కొత్త స్పీకర్ ఎన్నికయ్యే దాకా ప్రిసైడింగ్ ఆఫీసర్ (ప్రొటెం స్పీకర్)గా మహతాబ్‌ను నియమించారని చెప్పారు. మహతాబ్ ఇటీవలి ఎన్నికల్లో కటక్ నుంచి బీజేపీ టికెట్‌పై గెలుపొందారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ సీనియర్ నేత బిజూ జనతాదళ్‌కు వీడి బీజేపీలో చేరారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈనెల 24న మొదలు కానున్నాయి. 24, 25వ తేదీల్లో ప్రొటెం స్పీకర్ కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 26న స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ప్రొటెం స్పీకర్‌కు సహాయపడేందుకు ఐదుగురు సభ్యుల ప్యానెల్‌ను నియమించారు. ఈ చైర్‌పర్సన్స్ ప్యానెల్‌లో కె.సురేష్ (కాంగ్రెస్), టి.ఆర్.బాలు (డీఎంకే), రాధామోహన్ సింగ్, ఫగ్గన్‌సింగ్ కులస్తే (బీజేపీ), సుదీప్ బందోపాధ్యాయ్ (టీఎంసీ)లు సభ్యులుగా ఉన్నారు. సంప్రదాయం ప్రకారం అత్యధిక సార్లు ఎంపీయైన కె. సురేష్(ఎనిమిది సార్లు) ప్రొటెం స్పీకర్ కావాలని, బీజేపీ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడం లేదని కాంగ్రెస్ స్పందించింది.

రాజ్‌భవన్‌లో నాకు భద్రత లేదు

- గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ సంచలన ఆరోపణ
- బెంగాల్ పోలీసులతో తనకు ముప్పు ఉందని ఆందోళన



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ప్రభుత్వంతో ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ విభేదాలు మరోసారి తెరమీదకొచ్చాయి. గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బెంగాల్ పోలీసు బృందంతో మనకు ముప్పు ఉందని గవర్నర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్‌భవన్‌లో డ్యూటీలో ఉన్న పోలీసులంతా అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయన ఆదేశించిన కొద్దిరోజులకే ఇలా వ్యాఖ్యానించడం గమనార్హం. ''ప్రస్తుత ఆఫీసర్-ఇన్‌చార్జ్, ఆయన బృందం వల్ల నా వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉంది. ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తెలియజేశా. అయినా ఆమె ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చుట్టూ ఉన్న కోల్‌కతా పోలీసులతో నాలో అభద్రతా భావం గూడుకట్టుకుపోయింది'' అని గవర్నర్ ఆందోళన వ్యక్తంచేశారు. '' ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగేలా ఇక్కడి పోలీసులు ప్రవర్తిస్తున్నారు. రాజ్‌భవన్‌కు వ్యతిరేకంగా వాళ్లు పనిచేస్తున్నట్లు నా వద్ద విశ్వసనీయ సమాచారం ఉంది. ఇక్కడ పనిచేస్తున్న పోలీసులు గతంలో రాష్ట్ర సచివాలయం 'నబన్నా'లో పనిచేశారు. ఒకరి కోసం వీళ్లు పనిచేస్తున్నారు. వాళ్ల పేరు నేను చెప్పదల్చుకోలేదు'' అని గవర్నర్ వ్యాఖ్యానించారు.



చినాబ్‌పై చుక్‌చుక్ రైలు

నది ఉపరితలం నుంచి 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పరుగులు పెడుతున్న రైలు. జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై కొత్తగా కట్టిన ఈ వంతెనపై తొలిసారిగా పూర్తిస్తాయిలో ట్రయల్ రన్‌ను గురువారం విజయవంతంగా పూర్తిచేశారు. మొత్తంగా 40.79 కి.మీ.ల పొడవైన 9 సొరంగాలను దాటుతూ సంగల్దన్ నుంచి రెయిసీకి ఈ రైలు ప్రయాణించింది. ఈ వంతెన పొడవు 1,315 మీటర్లు. ఈ వంతెన పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ కన్నా 35 మీటర్ల ఎత్తు ఎక్కువ ఉండటం విశేషం.

రిజర్వేషన్ల పెంపు చెల్లదు

బిహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన పాట్నా హైకోర్టు • విద్యా, ఉద్యోగాల్లో కోటా పెంచడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ

పట్నా: బిహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. విద్యా, ఉద్యోగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లు పెంచుతూ 2023 నవంబర్‌లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. రిజర్వేషన్లు పెంచడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ సంచలన తీర్పు వెలువరించింది. రిజర్వేషన్లు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16ని ఉల్లంఘించడమే అవుతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది రితికా రాణి చెప్పారు. తమ పిటిషన్లపై హైకోర్టు ఈ ఏడాది మార్చి నెలలో తీర్పును రిజర్వ్ చేసిందని, గురువారం తుది తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు పౌరులంతా సమానమే. ఆర్టికల్ 16 ప్రకారం ఉద్యోగం, ఉపాధి విషయంలో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. కుల గణన ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంచినట్లు బిహార్ ప్రభుత్వం న్యాయస్థానంలో వాదించిందని పిటిషనర్ల తరఫు మరో న్యాయవాది నిర్భయ్ ప్రశాంత్ తెలిపారు. ఇంద్ర సహానీ కేసుతోపాటు మరాఠా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. విద్యా, ఉద్యోగాల్లో కోటాను 50 శాతానికి మించి పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందని గుర్తుచేశారు.

75 శాతానికి చేరిన రిజర్వేషన్లు

బిహార్ ప్రభుత్వం కుల గణన నిర్వహించింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఈబీసీ) 63 శాతం ఉన్నట్లు ఈ సర్వేలో తేలింది. ఎస్సీ, ఎస్టీలు కలిపి 21 శాతానిపైగా ఉన్నట్లు వెల్లడయ్యింది. ప్రభుత్వం గతంలోనే ఈబీసీలకు 10 రిజర్వేషన్లు కల్పించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీల్లేదు కాబట్టి రిజర్వేషన్ చట్టాల్లో సవరణలు చేసింది. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. 50 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల కోటాను 65 శాతానికి పెంచేసింది. ఈ మేరకు గత ఏడాది నవంబర్ 21న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. బిహార్‌లో ఈబీసీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరుకున్నాయి. సవరించిన రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి బిహార్ సర్కారు విజ్ఞప్తి చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల జాబితా తొమ్మిదో షెడ్యూల్‌లో ఉంది. ఈ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాలను కోర్టుల్లో సవాలు చేసేందుకు అవకాశం ఉండదు. సుప్రీంకోర్టు 1992లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా బిహార్ సర్కారు రిజర్వేషన్లు పెంచడాన్ని సవాలు చేస్తూ పలువురు పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

వియత్నాంతో పుతిన్ చెట్టపట్టాల్

పలు ద్వైపాక్షిక ఒప్పందాలు ఖరారు



హనోయ్: యుద్ధోన్మాదంతో ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగాక అంతర్జాతీయ మద్దతు కరువైన తరుణంలో రష్యా ఆసియా దేశాలతో మైత్రికి మొగ్గుచూపుతోంది. అందులోభాగంగానే ఉత్తర కొరియా పర్యటన ముగించుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం అక్కడి నుంచి నేరుగా వియత్నాం చేరుకున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా గురువారం వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. విద్య, శాస్త్ర సాంకేతికత, చమురు, సహజవాయువుల అన్వేషణ, ఆరోగ్య రంగాల్లో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అణు శాస్త్ర సాంకేతికతపై ఉమ్మడి పరిశోధనకూ అంగీకరించారు.

'నీట్' కౌన్సెలింగ్ రద్దు కుదరదు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్-యూజీ కౌన్సెలింగ్ రద్దు చేయడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణ, పేపర్ లీక్, మూల్యాంకనంలో వ్యత్యాసాలపై దాఖలైన పలు పిటిషన్లను గురువారం ధర్మాసనం విచారించింది. నీట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ పిటిషన్లపై తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ల తరఫున మరో న్యాయవాది కోరారు. గ్రేసు మార్కులు పొందిన 1,563 మంది అభ్యర్థులకు ఈ నెల 23న నిర్వహించనున్న పరీక్షపై స్టే ఇవ్వాలని మరో న్యాయవాది విజ్ఞప్తి చేశారు. వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. గ్రేసు మార్కులు పొందిన అభ్యర్థులకు ఈ నెల 23న నిర్వహించే పరీక్షతోపాటు వచ్చే నెల 6న జరిగే కౌన్సెలింగ్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. అడ్మిషన్ల ప్రక్రియ తుది తీర్పునకు లోబడే ఉంటుందని వ్యాఖ్యానించింది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు ఈ పిటిషన్లను జత చేస్తూ తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. వేర్వేరు హైకోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్టీఏ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాదులకు సుప్రీం నోటీసులిచ్చింది.హైకోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఆయా హైకోర్టుల్లో విచారణలపై స్టే విధించింది.

యుద్ధాలను ఆపే మోదీ పేపర్ లీకేజీలు ఆపలేరా?

రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల్లో అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్-రష్యా, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలను ఆపేసే శక్తి ఉందని చెప్పే ప్రధాని నరేంద్ర మోదీకి మన దేశంలో పేపర్ లీకేజీలను ఆపే శక్తి లేదా? అని ప్రశ్నించారు. లీకేజీలను ఆపాలని మోదీ కోరుకోవడం లేదని ఆక్షేపించారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థలను అధికార బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చెరబట్టాయని, అందుకే పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితి మారనంత వరకు పేపర్ లీక్‌లు ఆగవని తేల్చిచెప్పారు. రాహుల్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మంది నీట్ అభ్యర్థుల ఆందోళనలను నరేంద్ర మోదీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయన దృష్టి మొత్తం ఇప్పుడు పార్లమెంట్‌లో స్పీకర్‌ను ఎన్నుకోవడంపైనే ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ మానసికంగా కుప్పకూలిపోయారని, ఇకపై ఆయన ప్రభుత్వాన్ని నడిపించేందుకు మరింత ఇబ్బంది పడుతారని చెప్పారు.

పార్లమెంట్‌లో లేవనెత్తుతాం..

''నరేంద్ర మోదీకి ఇప్పుడు ఎవరూ భయపడడం లేదు. గతంలో ఆయన ఛాతీ 56 అంగుళాలు ఉండేది. ఇప్పుడది 32 అంగుళాలకు కుదించుకుపోయింది. భయపెట్టి, బెదిరించి పని చేయించుకోవడం మోదీకి అలవాటు. ఇప్పుడు ప్రజల్లో మోదీ అంటే భయం పోయింది. దేశంలో బలమైన ప్రతిపక్షం ఉంది. ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతాం''. అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

నీట్‌పై ఆందోళన అవసరం లేదు | **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్ష విషయంలో ఆందోళన అవసరం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎక్కడో జరిగిన చిన్నాచితక సంఘటనలు ఈ పరీక్ష సక్రమంగా రాసిన లక్షలాది మంది అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం చూపబోవని చెప్పారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం డార్క్‌నెట్‌లో లీక్ అయ్యిందని, అందుకే పరీక్ష రద్దు చేశామని ధర్మేంద్ర ప్రధాన్ తెలియజేశారు.

నీట్ పేపర్ లీకేజీ నిజమే

పట్నా: బిహార్‌లో చోటుచేసుకున్న నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో సంచలన విషయాలు బయటకొచ్చాయి. పేపర్ లీక్ నిజమేనని పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. నీట్‌కు ఒక్క రోజు ముందు ప్రశ్నపత్రంతోపాటు సమాధానాల 'కీ'ని సైతం అభ్యర్థులకు అందజేసి, పరీక్షకు సిద్ధం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసులో బిహార్ పోలీసులు పలువురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నలుగురు నీట్ అభ్యర్థులు అనురాగ్ యాదవ్, శివానందన్, అభిషేక్, ఆయుష్ రాజ్, ఇద్దరు లీకేజీ ముఠా సభ్యులు నితీశ్, అమిత్ ఆనంద్‌తోపాటు ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్ సికిందర్ యాదవేందు ఉన్నారు. ఈ యాదవేందు మేనల్లుడే అనురాగ్. విచారణలో నిందితులు ఏం చెప్పారో వారి మాటల్లోనే...

''బిహార్ దానాపూర్ టౌన్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సికిందర్ ప్రసాద్ యాదవేందు మమ్మల్ని సంప్రదించాడు. మేనల్లుడు అనురాగ్‌సహా నలుగురికి ప్రశ్నపత్రం ఇచ్చి యాదవేందు నుంచి రూ.32 లక్షలు తీసుకున్నాం''
- నితీశ్, అమిత్

'' అమిత్, నితీశ్ ప్రశ్నపత్రం, కీ అందజేశారు. పరీక్షకు సిద్ధం కావడానికి సహకరించారు'
- అనురాగ్, నీట్ అభ్యర్థి

''యాదవేందు అంకుల్ మే 4న ఓ ఇంటికి రమ్మని చెప్పాడు. అక్కడ నితీశ్, అమిత్ ప్రశ్నపత్రం ఇచ్చి నన్ను పరీక్షకు సిద్ధం చేశారు''
- శివానందన్ కుమార్, నీట్ అభ్యర్థి

''నీట్ ప్రశ్నపత్రం కోసం యాదవేందుకు రూ.40 లక్షలు చెల్లించాం''
-అవదేశ్, అభిషేక్ కుమార్ తండ్రి

''యాదవేందు రూ.40 లక్షలు తీసుకున్నాడు''
నీట్ అభ్యర్థి ఆయుష్ రాజ్ తండ్రి

''రాజస్తాన్‌లోని కోటాలో శిక్షణ పొందుతున్న నా మేనల్లుడు అనురాగ్ యాదవ్ నా సోదరి రీనా కుమారితో కలిసి నీట్ పరీక్ష రాయడానికి పాట్నా వచ్చాడు. వారికి పాట్నాలో ప్రభుత్వ అతిథి గృహంలో నేనే బస ఏర్పాట్లు చేశా. నీట్ పరీక్ష రాయడానికి నా మేనల్లుడు సహా నలుగురి అభ్యర్థులకు సహకరించా. నలుగురికి ప్రశ్నపత్రాలు సమకూర్చా. ఒక్కొక్కరి నుంచి రూ.40 లక్షల చొప్పున డిమాండ్ చేశా. నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ రూ.32 లక్షల చొప్పున తీసుకున్నారు''
- యాదవేందు, ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్

తేజస్వీ యాదవ్ సహాయకుడి హస్తం!

ప్రభుత్వ అతిథి గృహంలో అనురాగ్ యాదవ్, ఆయన తల్లికి బస ఏర్పాట్ల వెనుక బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. గెస్టు హౌస్ బిల్లులను పరిశీలించగా, అందులో మంత్రిజీ అని ఉంది. తేజస్వీ యాదవ్ వ్యక్తిగత సహాయకుడైన ప్రీతమ్ కుమార్ ఈ గెస్టు హౌస్‌ను బుక్ చేసేందుకు యాదవేందుకు సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తమిళనాట కల్తీ మద్యం కాటు..

40కి చేరుకున్న మరణాలు

- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 116 మంది
- విచారణకు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో కమిటీ వేస్తున్నామన్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణపురం ప్రాంతం కల్తీ మద్యం బాధితుల రోదనలతో ప్రతిధ్వనిస్తోంది. కల్తీ మద్యం కాటుకు బలైన వారి సంఖ్య 18 నుంచి గురువారం 40కి చేరుకుంది. ఆస్పత్రుల పాలైన బాధితుల సంఖ్య 116కు పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ చెప్పారు. కల్తీ మద్యం తాగి పలువురు ప్రాణాలు కోల్పోవడం, పెద్ద సంఖ్యలో బాధితులు ఆస్పత్రి పాలైన ఘటన తనకు తీవ్ర వేదన కలిగించిందని సీఎం ఎంకే స్టాలిన్ చెప్పారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ఇప్పటి వరకు పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారని సీఎం చెప్పారు. ఎక్కువ శాతం మిథనాల్ కలిపిన సారాయి తాగడం వల్లే మరణాలు సంభవించినట్లు తేలిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేలు చొప్పున సాయం అందజేస్తామని ప్రకటించారు. పెద్ద సంఖ్యలో సంభవించిన మరణాలకు కారణాలను కనుగొనడంతోపాటు, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ బి.గోకుల్‌దాస్ సారథ్యంలో ఏకసభ్య కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు.

16 మంది పరిస్థితి విషమం

బుధవారం తమ ఆస్పత్రిలో చేరిన 19 మంది కల్తీ మద్యం బాధితుల్లో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. జిప్మర్‌తోపాటు సేలం, కళ్లకురిచ్చి, విల్లుపురం ఆస్పత్రుల్లో బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో 34 మంది పూర్తిగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని అంటున్నారు. కల్లకురిచ్చి ఘటనపై సీబీసీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టి ఇప్పటి వరకు 200 లీటర్ల కల్తీ మద్యం పట్టుకున్నారు. అందులో ప్రమాదకర స్థాయిలో మిథనాల్ ఉన్నట్లు తేలింది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 21 । జూన్ । 2024



పరిధులు దొరకని చోరీలు!
దూర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లిన వారిపై స్నాచర్లు పంజా విసరడంతో బాధితులు ఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. -8లో



కరెంటోళ్లు.. ఇక ఆన్‌లైన్
వర్షాకాలం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా విద్యుత్ సిబ్బంది ‘లైన్ టు లైన్ సర్వే చేపట్టను న్నారు. ఆర్టిజన్ మొదలు ఎస్‌ఈ వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నారు. -10లో

గరిష్టం/కనిష్టం
35.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి జల్లులు పడవచ్చు. గరిష్ట ఉష్ణోగ్రత 35 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 25 ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో పశ్చిమ నైరుతీ దిశలుగా వీచవచ్చు.



ఇలా వచ్చి అలా వెళ్లి..

పట్టపగలే.. కత్తితో పొడిచి..

- మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన
- యజమాని సమయస్ఫూర్తి.. దొంగలు పరార్

బంగారు ఆభరణాల దుకాణంలో దోపిడీకి యత్నం

మేడ్చల్‌రూరల్: ఒకరు బుర్ఖా.. మరొకరు హెల్మెట్ ధరించిన దుండగులు పట్టపగలే జ్యువెలరీ షాపులో దోపిడీకి యత్నించారు. దుకాణ యజమానిపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యజమాని చాకచక్యంగా వ్యవహరించడంతో పలాయనం చిత్తగించిన ఘటన గురువారం మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, జ్యువెలరీ షాపు యజమాని చెప్పిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారి పక్కన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు (20 అడుగుల) దూరంలో జగదాంబ జ్యువెలరీ దుకాణం ఉంది. గురువారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో బైక్‌పై ఇద్దరు దుండగులు (వెనుక కూర్చున్న వ్యక్తి బుర్ఖా.. మరొకరు ముఖానికి హెల్మెట్ ధరించి ఉన్నారు) వచ్చారు. షాపులోకి వచ్చి యజమాని శేషురాం చౌదరిపై బుర్ఖా ధరించిన దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఆభరణాలు, నగదును తన వద్ద ఉన్న కవర్‌లో వేయాలని బెదిరించాడు. అరవవద్దని హిందీలో బెదిరించాడు. దీంతో పక్కనే ఉన్న శేషురాం చౌదరి కుమారుడు సురేశ్ షాపు వెనుక గదిలోకి పరుగులు తీశాడు. హెల్మెట్ ధరించిన దుండగుడు షాపులోని వెండి ఆభరణాలు తీసుకుని బుర్ఖా ధరించిన వ్యక్తికి కవర్ పట్టుకో అందులో వేస్తానని చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన షాపు యజమాని శేషురాం చౌదరి చాకచాక్యంగా వ్యవహరించి.. హెల్మెట్ ధరించిన వ్యక్తిని తోసి బయటికి వచ్చి చోర్ చోర్ అంటూ అరవసాగాడు. దీంతో దుండగులు పరారయ్యేందుకు బయటికి వస్తుండగా కొంత మేర దోచుకున్న ఆభరణాల కవర్ కిందపడింది. దానిని అక్కడే వదిలిపెట్టి బైక్ ఎక్కారు. అప్పటికే గది లోపలి నుంచి బయటికి వచ్చిన సురేశ్ షాపులోని కుర్చీని దుండగులపై విసిరి వారిని నిలువరించేందుకు యత్నించడంతో పరారయ్యారు. దుండగుల దాడిలో గాయపడిన శేషురాం చౌదరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సీసీ కెమెరాల్లో నిక్షిప్తం.. సోషల్ మీడియాలో వైరల్

దుండగులు దోపిడికి యత్నించిన జగదాంబ జ్యువెలరీ షాపులో, షాపు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. దీంతో దుండగుల దోపిడీ చేసిన తీరు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. బైక్‌పై వచ్చి లోపలికి ప్రవేశం. షాపు యజమానిపై దాడి, బెదిరింపులకు దిగిన తీరు సీసీ కెమెరాల్లో నమోదు కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు..

మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జ్యువెలరీ షాప్‌లో మిట్టమధ్యాహ్నం దుండగులు రెచ్చిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి పరిసరాలపై అవగాహన ఉన్నవారే దోపిడీకి స్కెచ్ వేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటన జరిగిన షాపును మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ పరిశీలించారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. దుండగులు ఉత్తరాదికి చెందినవారుగా అనుమానిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. దుండగులు పరారవుతుండగా గమనించిన ఓ వ్యక్తి బైక్‌పై కండ్లకోయ వరకు ఫాలో అయ్యాడని, బైక్ నంబర్, ఇతర ఆధారాలు సేకరించినట్లు, నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.



ఆరోగ్య మాత్ర

రాజ్‌భవన్ స్కూల్‌లో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది.

మారేడుపల్లి తహసీల్దార్ సస్పెన్షన్

ఆర్.ఐ., రికార్డు అసిస్టెంట్ కూడా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ కొరడా



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొరడా ఝుళిపించారు. గురువారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి అవాక్కయ్యారు. రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం.. కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ పద్మసుందరి, ఆర్ఐ ప్రసన్న లక్ష్మి, రికార్డు అసిస్టెంట్ రవిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఆధునికీకరణ దిశగా ఉస్మానియా ఆస్పత్రి

నూతన ఎంఆర్‌ఐ, మెడికల్ ఓపీ, డైట్ కిచెన్ ప్రారంభం నేడు



అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ఆధునికీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ దవాఖానాలో అధికారికంగా 1,168 పడకలు ఉండగా.. అక్కడక్కడ సర్దుబాటు చేసిన 1,385 పడకలతో రోగులకు చికిత్సలు అందితున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే ఆధునికీకరించిన ఓపీ విభాగం, నూతన ఎంఆర్‌ఐ, డైట్ కిచెన్‌ను శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నట్లు గురువారం ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రతి నిత్యం దాదాపు 2 వేల మంది ఓపీ, దాదాపు 150 నుంచి 200 మంది ఇన్‌పేషెంట్లకు చికిత్సలు అందే ఉస్మానియా ఆస్పత్రిలో.. మైనర్, మేజర్‌లతో కలిపి 200 శస్త్ర చికిత్సలు నిర్వహిస్తుంటారు. ఆస్పత్రికి అధునాతన సౌకర్యాలు చేకూరడంతో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు పలువురు వైద్యులు హర్షం వ్యక్తంచేశారు.

బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమన్వయ సమావేశంలో బోనాల జాతర ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో 2,400 దేవాలయాలల్లో ఉత్సవాలు ఘనంగా జరిగేలా ఏర్పాటు చేయాలని సూచించారు. దేవాలయాలకు చెక్కుల పంపిణీ త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నగరంలోని 28 ముఖ్యమైన దేవాలయాలకు ప్రజా ప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో బోనాల ఉత్సవాలకు గతంలో కంటే ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానమైన దేవాలయాల్లో హెల్త్ క్యాంపులు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

ఈట్.. ‘ఔట్’!

బయటి ఫుడ్ అంటే భయమే

- చిన్న చిరుతిండి నుంచి బడా హోటల్ దాకా
- అంతటా అపరిశుభ్రత, ఆహారం కల్తీ
- నగర హాస్టళ్లు, మార్కెట్లలోనూ అదే దుస్థితి
- నామమాత్రపు జరిమానాలతోనే సరి..





రాజ్‌బార్ అండ్ రెస్టారెంట్‌లో అపరిశుభ్రంగా వంట గది

తినాలంటే డౌటే!!

గ్రేటర్‌లో పేరెన్నికగన్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతరత్రా ఈట్ ఔట్‌లు ఎన్నో ఉన్నాయి. వాటిలో తినాలంటే సీట్ల కోసం గంటల తరబడి వెయిట్ చేయాలి. ఈ హోటళ్లలో కనిపించే తళుకులు, రద్దీ చూసి అబ్బో ఎంత గొప్ప హోటలో అనుకుంటాం. వాటిలో తినడమే స్టేటస్‌గా భావించే వారూ ఎందరో. నిజంగానే అవి అంత గొప్పవా? అంటే కానే కాదు. ఈ హోటల్లో కంటే చెట్టుకింద తినుబండారాలు తినడమే బెటరేమో అనుకునేట్లుగా ఉన్నాయి వాటి వంటగదుల్లోని పరిస్థితులు. అపరిశుభ్రత, వినియోగించే ఆహార పదార్థాల నాణ్యత లేమి, గడువు ముగిసిన సరుకులతో చేసిన వంటలు ప్రజలకు అంటగడుతుండటం తదితరమైనవి ఎన్నెన్నో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల తనిఖీల్లో బట్టబయలవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా.. చేయకూడని పనులెన్నో అవి చేస్తున్నాయి. గత రెండు నెలలుగా హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు వాటిల్లోని లోపాల్ని బయటి ప్రపంచానికి వెల్లడిస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటికీ ఇంకా తీరు మార్చుకోనివి ఎన్నో. కొందరు మాత్రం తనిఖీల భయంతో కాస్తో కూస్తో నిబంధనలు పాటిస్తూ సిబ్బందికి టోపీలు, గ్లవ్స్, అందరికీ కనిపించేలా లైసెన్సు బోర్డు ఉంచడం వంటివి చేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

పదే పదే అదే తీరు

సికింద్రాబాద్ నుంచి షేక్‌పేట దాకా.. బండ్లగూడ నుంచి బంజారాహిల్స్ దాకా.. నాగోల్ నుంచి నానక్‌రామ్‌గూడ వరకు.. మలక్‌పేట నుంచి మియాపూర్ వరకు అంతటా ఇదే పరిస్థితి. కొన్ని హోటళ్ల పేర్లు వినగానే ఎందరో లొట్టలేసుకొని వెళ్లే వాటిల్లోనూ పరిస్థితులు మెరుగ్గా లేవు. యాభయ్యేళ్లకు పైగా పేరుపొందిన హోటళ్లలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. అందరికీ సుపరిచితమైన, గొప్ప పేరున్న హోటళ్లు సైతం కనీస నిబంధనలు పాటించకపోవడం వాటి నిర్లక్ష్యానికి నిదర్శనం. తనిఖీల్లో లోపాలు గుర్తించాక, మళ్లీ ఆర్నెల్లకో, ఏడాదికో తనిఖీలు చేసినా అవే దృశ్యాలు కనిపిస్తుండటం ప్రజారోగ్యాన్ని అవి ఎంత తేలికగా తీసుకుంటున్నాయో ఊహించుకోవచ్చు. అందుకు తాజా ఉదాహరణ సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్. గతంలో ఓసారి ఈ హోటల్‌ను సీజ్ చేశారు కూడా. అధికారులు తమ బండారాన్ని బట్టబయలు చేస్తున్నా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడిస్తున్నా తమ వైఖరి మార్చుకోకపోవడం గమనార్హం. ప్రజారోగ్యానికి హాని కలిగించే వారికి జైలుతో పాటు జరిమానాలు విధించే వీలున్నా ఇవి పెద్దగా అమలు కాకపోవడం వల్లే చాలామంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

- హోటళ్లే కాదు.. స్టూడెంట్స్, వర్కింగ్ ఉమెన్స్ ఉండే హాస్టళ్లలోనూ అదే దుస్థితి. కుళ్లిన కూరగాయలతోనే వంటలు. కాలం తీరిన కారం, మసాలాలు, పురుగులు పట్టిన బియ్యం, అపరిశుభ్రంగా వంటగదులు. శేరిలింగంపల్లి, మాదాపూర్ వంటి హైటెక్కు ప్రాంతాల్లోని హాస్టళ్లలోనూ ఇదే దుస్థితి. పాన్‌లు, గుట్కాలు నములుతూ వంటలు చేయడం, వడ్డించడం వంటివి చూసి తనిఖీ అధికారులే నివ్వెరపోయారు.
- హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, మార్కెట్లు, హాస్టళ్లలో తనిఖీల సందర్భంగా అధికారులు గుర్తించిన అంశాల్లో నకిలీ లేబుల్స్‌తో వాటర్ బాటిల్స్, బ్రెడ్ పాకెట్స్, గడువు ముగిసిన సరుకులు, స్టోరేజీ పరిస్థితులు దారుణంగా ఉండటం, కుళ్లిపోయిన చికెన్, అధ్వానంగా వంటశాలలు, పండ్లను కృత్రిమంగా మగ్గపెట్టడం, చెత్త డబ్బాలకు మూతలు లేకపోవడం, లైసెన్సులు లేకపోవడం తదితరాలను గుర్తించారు.

నామమాత్రపు పెనాల్టీలు..

ఇప్పటి వరకు దాదాపు 90 హోటళ్లు తదితర సంస్థల్లో తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు ఇప్పటి వరకు పెనాల్టీలు విధించిన సంస్థలు పదికి లోపునే ఉన్నాయి. వివరాలిలా ఉన్నాయి.

పేరుగొప్ప..

తనిఖీలు చేసిన వాటిల్లో బేబీలాన్ బార్ అండ్ కిచెన్, షాన్‌బాగ్ హోటల్ డీలక్స్, చట్నీస్ రెస్టారెంట్, మినర్వా హోటల్, ఐటీసీ కాకతీయ, మేరీగోల్డ్, కృతుంగ రెస్టారెంట్, పిస్తా హౌస్, మెక్‌డొనాల్డ్స్, కాఫీ ట్రీ, ఆహా దక్షిణ్, గోకుల్‌చాట్, రత్నదీప్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, కేఎఫ్‌సీ, కామత్‌హోటల్, రాయలసీమ రుచులు, షాగౌస్ మల్టీక్విజీ రెస్టారెంట్, బాహుబలి కిచెన్, ప్యారడైజ్ ఫుడ్‌కోర్ట్, హోటల్ షాదాబ్, హాంప్‌షైర్ ప్లాజా హోటల్, న్యూఫిష్‌లాండ్, స్విస్ కెజిల్ బేకరీ, అగర్వాల్ ఫుడ్ ప్రొడక్ట్స్, హోటల్ బసేరా, బార్బిక్యూ నేషనల్ హాస్పిటాలిటీ, మధుశాల రెస్టారెంట్ అండ్ బార్, కులీనెస్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్, హోటల్ అశోకా, నిమ్రా కేఫ్ అండ్ బేకరీ తరతరాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

సంస్థ	ఉల్లంఘన	పెనాల్టీ (రూ.)
గౌరంగ్ డిజైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జూబ్లీహిల్స్	గడువు ముగిసిన మసాలాలు,స్టోరేజీ లోపాలు	30,000
ఔరా కేఫ్ అండ్ ఇన్‌ఫ్యూజన్ బార్ ,జూబ్లీహిల్స్	కుళ్లిన చికెన్,లేబుల్ లేని కాజు	50,000
బిలాల్ ఐస్‌క్రీమ్, మొజాంజాహీ మార్కెట్	నకిలీబ్రాండ్ల వాటర్, ఐస్‌క్రీమ్,గడువుముగిసిన లైసెన్స్	50,000
కరాచీ బేకరీ, మొజాంజాహీ మార్కెట్	గడువు ముగిసిన ఫుడ్ ఐటెమ్స్, నకిలీబ్రాండ్	50,000
క్లోవ్ ఫైన్ డైన్ వెజ్ రెస్టారెంట్, హిమాయత్‌నగర్	గడువు ముగిసిన ఆహారపదార్థాలు,అపరిశుభ్రత	50,000
క్రీమ్‌స్టోన్ కాన్సెప్ట్స్, హిమాయత్‌నగర్	గడువు ముగిసిన ఆహారపదార్థాలు,స్టోరేజీ లోపాలు	50,000

హోటళ్లలో అపరిశుభ్రత.. ఎలుకలు.. బొద్దింకలు

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

రాంగోపాల్‌పేట్: ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పలు హోటళ్లపై దాడులు చేశారు. ఈ సందర్భంగా పేరొందిన పలు హోటళ్ల నిర్వాహకులు ఏ మాత్రం పరిశుభ్రత పాటించకపోవడం, మాంసాహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిలువ ఉంచడం వారి దృష్టికి వచ్చింది. ఈ నెల 18వ తేదీన సికింద్రాబాద్‌లోని ప్రముఖ బిర్యానీ హోటల్ ఆల్ఫా హోటల్‌తో పాటు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న సందర్శిని హోటల్, రాజ్‌బార్ అండ్ రెస్టారెంట్‌లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఆల్ఫా బ్రాండ్ ఐస్ క్రీమ్, బ్రెడ్ ప్యాకెట్లు, టీపొడి ప్యాకెట్లపై ఎలాంటి మ్యానుఫ్యాక్చరింగ్ తేదీలు, బ్యాచ్ నంబర్లు లేవు. వంటగదిలో సరైన ఇన్‌సెక్ట్‌ప్రూఫ్ స్క్రీన్‌లను ఫిట్ చేయలేదు. గడువు తీరిపోయిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు నకలు కాపీ ఉంది. ఎఫ్ఎస్ఎస్ చట్టం 2006 క్లాస్ 62 ప్రకారం కేసు బుక్ చేస్తామని అధికారులు తెలిపారు. రాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లోని కిచెన్‌లో ఎలుకలు, బొద్దింకలు దర్శనమిచ్చాయి. పాక్షికంగా వండిన ఆహార పదార్థాలు స్టోర్ చేసి ఉన్నాయి. హోటల్ సందర్శినిలో బెల్లంపై సరికాని లేబుళ్లు వాడటం, గడువు ముగిసిన నూడిల్స్ ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా హోటళ్లలో శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించినట్లు అధికారులు తెలిపారు.



ఆల్ఫా హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మాంసం

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీగణేశ్



కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ ప్రమాణ స్వీకారం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేశ్ స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించి, అసెంబ్లీ కిట్‌తో కూడిన ప్రత్యేక బ్యాగును అందజేశారు. అనంతరం అసెంబ్లీ లాబీల్లో గ్రూపు ఫొటో దిగారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, జైప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నేతలు మర్రి అమరేందర్ రెడ్డి, ముప్పిడి మధుకర్, ముప్పిడి గోపాల్, ఆనంద్ బాబు, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, సదానంద్ గౌడ్, సంకి రవీందర్, బల్వంత్ రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల పెన్ను బహూకరణ



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు పెన్ను బహూకరిస్తున్న అమరేందర్ రెడ్డి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి అమరేందర్ రెడ్డి అరుదైన బహుమతిని అందజేశారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం అసెంబ్లీ లాబీలో రూ.50 వేల విలువైన ‘మాంట్‌బ్లాక్’ కంపెనీకి చెందిన పెన్నును ఆయనకు బహూకరించారు. ఎమ్మెల్యేగా కంటోన్మెంట్ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి లేఖలపై ఈ పెన్నుతోనే సంతకాలు చేస్తానని శ్రీగణేశ్ పేర్కొనడం విశేషం.



కాషాయ శ్రేణుల్లో జోష్

మేళ తాళాలు.. తీన్మార్ బాజాలు.. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో నగరంలోని బేగంపేట్ విమానాశ్రయం పరిసరాలు మార్మోగాయి. కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసి గురువారం నగరానికి తొలిసారిగా వచ్చిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ‘సెల్యూట్ తెలంగాణ’ పేరుతో బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి.



అడ్డొస్తున్నాడని..

- హత్యచేసి.. చెట్లపొదల్లో పడేసి..
- ఒకప్పుడు ఇద్దరూ కలిసి చోరీలు
- మనస్పర్థలు రావడంతో గొడవలు
- బోరబండలో మిస్సింగ్ కేసు.. సనత్‌నగర్‌లో మృతదేహం లభ్యం..
- పోలీసుల అదుపులో నిందితుడు
- సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన


హత్యకు గురైన అజార్

సనత్‌నగర్: దొంగతనాల్లో ఆధిపత్య పోరు ఓ హత్యకు దారితీసింది. తోటి దొంగను కత్తితో పొడిచి బండరాళ్లతో మోది హతమార్చిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హత్య జరిగి 24 గంటల కాకముందే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ ఏజీకాలనీ సమీపంలోని నేతాజీనగనర్‌కు చెందిన సయ్యద్ అజార్(22), ఎర్రగడ్డకు చెందిన మహ్మద్ ఆసిఫ్(23)లు ఇద్దరూ కలిసి దొంగతనాలు చేస్తుంటారు. నగరంలోని పలు స్టేషన్ల పరిధిలో వీరు పలు ఇళ్లలో చోరీలు చేశారు. దొంగిలించిన సొత్తును విక్రయించగా వచ్చే డబ్బును ఇద్దరూ పంచుకుంటారు. ఈ క్రమంలోనే 2023లో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఓ దొంగతనం చేశారు. చోరీ సొత్తు పంపకాల విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. అప్పటి నుంచి దొంగతనాల్లో ఇరువురి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఇద్దరూ మద్యం సేవించి భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వెనుక పొదల్లోకి వెళ్లారు. అక్కడ మరోసారి మద్యం తాగిన వీరిద్దరి మధ్య చోరీ సొత్తు విషయమై మళ్లీ ప్రస్తావనకు రావడం. నువ్వెంత అంటే.. నువ్వెంత అని ఆధిపత్యం కోసం పాకులాడే క్రమంలో మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన మహ్మద్ ఆసిఫ్.. సయ్యద్ అజార్‌ను కత్తితో పొడిచి రాళ్లతో తలపై మోది హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మరో మిత్రుడైన అజీజ్‌కు ఫోన్ చేసి తాను సయ్యద్ అజార్‌ను హత్య చేసి మృతదేహాన్ని పొదల్లో వేసిన విషయాన్ని తెలియజేశాడు. అయితే తమ కొడుకు సయ్యద్ అజార్ కనిపించడం లేదని తల్లిదండ్రులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన బోరబండ పోలీసులకు సయ్యద్ అజార్ హత్యకు గురైనట్లుగా తెలిసింది. అయితే సంఘటన జరిగిన పరిధి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో విషయాన్ని వారికి తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సనత్‌నగర్ పోలీసులు సయ్యద్ అజార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పరిధులు దొరకని చోరీలు!

- బస్సులు, మార్కెట్స్‌లో పంజా విసురుతున్న స్నాచర్లు
- పర్సులు, ఫోన్లతో పాటు బంగారు గొలుసుల తస్కరణ
- బాధితులు గమ్యం చేరాకే విషయం వారి దృష్టికి..
- ఎక్కడ ఫిర్యాదు చేయాలో పాలుపోని బాధితులు
- కేసులు నమోదు చేసేందుకు అధికారుల విముఖత
- ఓ మహిళను నాలుగు ఠాణాలు తిప్పిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: అమీర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ మహిళ కోఠిలో షాపింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చింది. ఆమె ఎక్కిన బస్సు సుల్తాన్‌బజార్, అబిడ్స్, నాంపల్లి, సైఫాబాద్, ఖైరతాబాద్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్.. ఇలా ఏడు ఠాణా పరిధుల మీదుగా ప్రయాణించింది. బస్సు ఎక్కేటప్పుడు మెడలో ఉన్న బంగారు గొలుసు ఇంటికి వచ్చాక లేకపోవడంతో ఆందోళనకు గురైంది.

- ఇప్పుడు ఆమె ఎక్కడి పోలీసులను ఆశ్రయించాలి? ఏ ఠాణా పరిధిలో కేసు నమోదు చేయించాలి? అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ, దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నట్లు చెప్పుకుంటున్న నగరంలో ఇప్పటికీ ఇది మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఈ కారణంగానే ఈ తరహాకు చెందిన అనేక మంది బాధితులు వివిధ పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల చోటు చేసుకున్న శ్రీరేఖ ఉదంతమే తాజా ఉదాహరణ.

శ్రీరేఖ విషయంలో ఏం జరిగిందంటే..

బర్కత్‌పురకు చెందిన శ్రీరేఖ గత శనివారం మధురానగర్‌లో ఉండే తన బంధువుల ఇంటికి వచ్చారు. ఆదివారం సోదరుడితో కలిసి రైతుబజార్‌కు వెళ్లి కూరగాయలు ఖరీదు చేశారు. మధురానగర్‌లోని బంధువుల ఇంటికి తిరిగి వచ్చి చూసుకోగా తన మంగళ సూత్రం కనిపించలేదు. హుటాహుటిన రైతుబజార్‌కు వెళ్లి విచారించినా ఫలితం దక్కలేదు. దీంతో ఆమె తొలుత సనత్‌నగర్ ఠాణాకు వెళ్లగా.. తమ పరిధి కాదన్న పోలీసులు ఆమెను ఎస్ఆర్ నగర్ పోలీసుస్టేషన్‌కు పంపారు. ఆ అధికారులు చోరీ జరిగిన ప్రాంతం బోరబండ ఠాణా పరిధిలోకి వస్తుందని చెప్పి వెనక్కి పంపారు. బాధితురాలు బోరబండకు వెళ్లి ఫిర్యాదు చేయగా అక్కడ కూడా నిరాశే ఎదురైంది. అక్కడ ఉన్న అధికారులు మధురానగర్‌కు ఠాణాకు పంపారు. ఎట్టకేలకు ఆ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చోరుల చేతిలో బాధితురాలిగా మారిన ఓ మహిళను పరిధుల పేరుతో నాలుగు ఠాణాల చుట్టూ తిప్పడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఆ చోరుల నైజమే విభిన్నం..

గొలుసులు, పర్సులు, సెల్‌ఫోన్లు తస్కరించే చోరులు రద్దీగా ఉండే బస్సులు, ఆటోలు, మార్కెట్లను ఎంచుకుని ముఠాగా అక్కడకు వెళ్తారు. మొదట గ్యాంగ్‌లోని కొందరు సభ్యులు టార్గెట్ చేసిన వ్యక్తి చుట్టూ చేరతారు. ఇలా చేరడాన్ని ఫీల్డింగ్ అని, వీరిని 'ఆడి' అని పిలుస్తారు. వీరు సదరు వ్యక్తి చుట్టూ చేరి హడావుడి చేయడంతో పాటు ఉత్కంఠ వాతావరణం, రాపిడి కలిగిస్తారు. అదే అదనుగా మరో ముఠా సభ్యుడు తమ 'టార్గెట్' నుంచి సెల్‌ఫోన్, పర్సు లేదా గొలుసు చోరీ చేస్తాడు. ఇలా చేయడాన్ని స్ట్రైకింగ్ అని, అతడిని 'షాను' అని పిలుస్తుంటారు. కావాల్సింది చేతి కందగానే 'షాను' అక్కడ నుంచి ఉడాయించడమో, మరో వ్యక్తికి అందించి పంపేయడమో చేస్తాడు. పండగలు, ఉత్సవాలు, ఊరేగింపులు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలు తదితరాలను దృష్టిలో పెట్టుకుని పంజా విసురుతూ ఉంటారు. తాము నష్టపోయామనే విషయం తెలియడానికి బాధితులకు చాలా సమయం పడుతుంది.

చట్టప్రకారం పరిధి అత్యంత కీలకం..

సాధారణంగా ప్రతి ఒక్కరం పోలీసులు చెప్పే పరిధుల విషయాన్ని సాకుగా చూస్తాం. ఎవరైతే ఏంటి కేసు నమోదు చేసుకోవచ్చుగా..? అని భావిస్తుంటాం. అయితే చట్ట ప్రకారం జ్యూరిస్‌డిక్షన్‌గా పిలిచే ఈ పరిధి అనేది చాలా కీలకం. ఓ నేరం ఓ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటే కచ్చితంగా ఆ ఠాణాలోనే కేసు నమోదు కావాలి. సంబంధిత కోర్టుకే ఎఫ్ఐఆర్ ప్రతిని పంపించాలి. అలా కాకుండా పోలీసులు చొరవ తీసుకుని కేసు నమోదు చేసినా, దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రాలు దాఖలు చేసినా.. నిందితుల తరఫున వాదించే డిఫెన్స్ న్యాయవాదులు ఆ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్తే మొదటికే మోసం వస్తుంది. ఆ కారణంగా కేసు న్యాయస్థానంలో వీగిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు పరిధి అనే అంశానికి అంతటి ప్రాధాన్యం ఇస్తుంటారు. అలసత్వం చూపించే కొందరు అధికారులకు కూడా ఇదే అవకాశంగా మారుతోంది.

బాధితులు ఇబ్బందిపడొద్దనే జీరో ఎఫ్ఐఆర్..

ఈ తరహా నేరాల బారినపడిన బాధితులు ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతోనే జీవో ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. దీని ప్రకారం పోలీసులకు ఓ ఫిర్యాదు అందినప్పుడు ఆ నేరం తమ పరిధిలో జరగలేదని తెలిసినా కేసు నమోదు చేయవచ్చు. అయితే దానికి ఎలాంటి నంబర్ కేటాయించకుండా జీరోగా నమోదు చేస్తూ.. సంబంధిత ఠాణాకు బదిలీ చేయవచ్చు. ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసిన తర్వాత ఇలా చేసే అవకాశం ఉంది. 2019 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ జీరో ఎఫ్ఐఆర్ విధానం అధికారికంగా అమలు చేస్తున్నట్లు అప్పటి డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి ప్రకటించారు. నగర పోలీసు కమిషనర్‌గా పనిచేసిన అంజనీకుమార్ మరో అడుగు ముందుకు వేశారు. 'ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్' అంటూ బాధితుల వద్దకు పోలీసులే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి, కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఈ విధానం అనేక విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ అమలైంది. శ్రీరేఖ ఉదంతాన్ని చూస్తే వీటిని అధికారులు పట్టించుకోలేదని స్పష్టమవుతోంది.

పోలీసుల స్పందనే సగం సాంత్వన..

ఓ నేరం బారినపడిన బాధితులకు పోలీసుల నుంచి వచ్చే సానుకూల స్పందనే సగం సాంత్వన చేకూరుస్తుంది. తక్షణం స్పందించే పోలీసులు కేసు నమోదు చేస్తే వారిపై సదభిప్రాయం ఏర్పడుతుంది. అలా కాకుండా ఠాణాల చుట్టూ తిప్పితే పోలీసులపై వ్యతిరేక భావం ఏర్పడుతుంది. అయితే కొందరు అధికారులు తక్షణం కేసు నమోదు చేయకపోవడానికి పెండెన్సీ పెరుగుతుందని, రికవరీలు తగ్గుతాయని భయపడటమే కారణం. వీటి ఆధారంగానే ఉన్నతాధికారులు పనితీరును మదిస్తారనే ఇలా చేస్తుంటారు. ఇలాంటి అంశాల్లో ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రతి ఠాణాలోనూ జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలంటూ పునరుద్ఘాటించాలి. ఆ దిశలో చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో మరికొందరు బాధితులు ఠాణాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా చేసే అవకాశం ఉంటుంది.

నేరాల దర్యాప్తులో ఐటీ కీలకం

రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి



సాక్షి, సిటీబ్యూరో: నేరాల దర్యాప్తులో సీసీటీవీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) విభాగం పాత్ర కీలకమైందని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన పలు ప్రాధాన్యమైన, సంక్లిష్టమైన కేసుల విచారణలో ప్రముఖ పాత్ర పోషించిన ఈ బృందాన్ని ఆయన నగదు పురస్కారంతో అభినందించారు. ఇటీవల మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసుతో పాటు చర్లపల్లి పరిధిలో జరిగిన ప్రాపర్టీ కేసు, భువనగిరి పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు వంటి పలు సంక్లిష్టమైన కేసులను త్వరితగతిన ఛేదించడంలో ఐటీ సెల్ సీసీటీవీ బృందం సాంకేతికపరమైన కృషిని ఆయన ప్రశంసించారు. ఐటీ సెల్ సమర్థవంతమైన పనితీరుతో ఎన్నో కేసుల్లో అసలైన నిందితులను వీలైనంత తక్కువ సమయంలోనే పట్టుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, పిల్లల అపహరణ వంటి ఎన్నో కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలను ప్రతి ఏరియాలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు అందిస్తున్నాయని వివరించారు. ఐటీ సెల్ విభాగంలోని ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని, నూతన సాంకేతిక వనరులను ఉపయోగించుకుని కేసుల దర్యాప్తు సులభతరం చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య


సంఘటన స్థలంలో షేక్ అలీ మృతదేహం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను కొందరు వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగాపురాలో నివసించే షేక్ అలీ(34) ఫ్లవర్ డెకరేటర్ ఆసిఫ్‌నగర్ నోబుల్ టాకీస్ చౌరస్తా నుంచి లోద్క్షత్రియ బయటక్ వెళ్లే దారిలో ఫీల్‌ఖానా వద్ద షేక్ అలీ మరి కొందరితో కలిసి మద్యం సేవించారు. అనంతరం వారి మధ్య గొడవ జరగగా షేక్ అలీపై దుండగులు కత్తులతో దాడిచేసి పరారయ్యారు. స్పృహ కోల్పోయిన బాధితుడు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్య చికిత్సల నిమిత్తం బాధితుడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాత కక్షలతో ఈ హత్య జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య


వీరబాబు (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని భార్య ప్రశ్నించడంతో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగడిపేట్ సుగుణమ్మ కాలనీకి చెందిన వీరబాబు, శాంతి భార్యాభర్తలు. శాంతి స్థానికంగా ఇళ్లలో పనిచేస్తుండగా, వీరబాబు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నిరోజులుగా వీరబాబు ఇంటికి ఆలస్యంగా రావడంతో పాటు డబ్బులు ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయమై భర్తను నిలదీయగా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నానని, అందుకే డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించాడు. అయితే విషయం బయటపడటంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. పనులకు వెళ్లకుండా అప్పులు చేయడం ప్రారంభించాడు. కాగా విజయనగరం జిల్లా పెదచామలపల్లిలో చదువుతున్న కుమారుడి సర్టిఫికెట్ కోసం ఈ నెల 15న శాంతి సొంతూరుకు వెళ్లింది. వివాహేతర సంబంధం బయటపడటంతో మనస్తాపంతో ఉన్న వీరబాబు ఈ నెల 18న మద్యం మత్తులో పురుగుల తాగాడు. ఈ విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు అతడిని అంగడిపేట్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహన తనిఖీల్లో 'రియలైజేషన్' టీమ్‌లు


వాహన తనిఖీలను పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: ప్రతి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ రియలైజేషన్ టీమ్‌లను ఏర్పాటు చేసి ర్యాండమ్‌గా వాహనాలు తనిఖీ చేస్తూ గతంలో ఉన్న పెండింగ్ చలానాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా హరిప్రసాద్ తెలిపారు. గురువారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తాలో వాహన తనిఖీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆన్‌లైన్‌లో చలానాలు చెల్లించేలా బకాయి ఉన్న వాహనదారులకు ట్రాఫిక్ సిబ్బంది సూచిస్తుంటారని, అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో బకాయిలు చెల్లించి వాహనదారులు వెళ్లిపోవచ్చని ఆయన పేర్కొన్నారు. తమ పరిధిలో ఉన్న ప్రతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోనూ ఒక రియలైజేషన్ టీమ్ నిత్యం వేర్వేరు చోట్ల వాహనాల తనిఖీ చేపడుతుందని, ఒక్కో టీమ్ రోజుకు 500 నుంచి 600 వాహనాలను తనిఖీ చేస్తుందన్నారు. చాలా రోజులుగా ట్రాఫిక్ ఉల్లంఘనుల బకాయిలు చెల్లించకుండా తిరుగుతుంటే ఈ తనిఖీల్లో వాటిని గుర్తించి అప్పటికప్పుడే ఆన్‌లైన్ నగదు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రియలైజేషన్ టీమ్‌లు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు గంటల పాటు ఈ తనిఖీలు చేస్తుంటాయని అన్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కూడా జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ జరిమానాలకు సంబంధించి బకాయిలు పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు.

'ఆల్బెండజోల్'తో చిన్నారులకు ఆరోగ్యం

- విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- తల్లిదండ్రులు బాధ్యతగా మాత్రలు వేయించాలంటున్న వైద్యులు


బంజారాహిల్స్‌లోని డీఏవీ స్కూల్‌లో నట్టల నివారణ మాత్ర వేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్: ఏడాది వయసు నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ కమ్యూనిటీ హాళ్లలో పిల్లలకు వేశారు. యేటా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేస్తున్నది. ఇందుకోసం ఆరోగ్య శాఖ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖాధికారుల పర్యవేక్షణలో పలు చోట్ల ప్రజాప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలకు ఈ మాత్రలను పంపిణీ చేశారు.

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజ్ భవన్ హైస్కూల్‌లో జరిగిన నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొన్నారు.
- వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్ కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్ ఆయా ప్రాంతాల్లా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పిల్లలకు మాత్రలు వేశారు.
- బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు కార్తీక్ మాట్లాడుతూ... రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం ఇవన్నీ నులిపురుగులతో జరిగే నష్టాలని పేర్కొన్నారు. నులిపురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటే దాని స్వభావం కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలు షూస్ వేసుకోవాలని బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. నిర్మూలన వల్ల రక్తహీనత నియంత్రిస్తున్నదని పోషకాహారం మెరుగుపడుతుందని కడుపు నొప్పి ఉండదని, బరువు పెరగడం, ఆకలి పెరగడం తదితర ప్రభావం చూపుతుందన్నారు. పిల్లలు మట్టిలో ఆడుకొని కలుషితమైన మట్టి చేతులను నోట్లో పెట్టుకోవడం వల్ల ఇది వ్యాప్తి చెందుతుందని పిల్లల్లో ఈ వ్యాప్తి సాధారణంగా ఉంటుందన్నారు. నులిపురుగులలో ప్రధానమైన జాతుల్లో నట్టలు, ఏలిక పాములు, నులిపురుగులు, కొంకిపురుగుల వంటివి ఉంటాయన్నారు. తమ పిల్లలకు నులిపురుగుల బాధ్యత వేసే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు మాత్రలు వేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.


ఫిలింనగర్ స్కూల్‌లో కార్పొరేటర్ వెంకటేష్

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని నిషుల్క్ ప్రభాత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు. ఖైరతాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ మస్రత్ హుస్సేన్, పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి


నందినగర్ ఖుష్బూ విద్యానికేతన్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాజ్‌దేవి


బంజారాహిల్స్‌లోని గతి స్కూల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

శ్రీనగర్‌కాలనీ: బీఆర్ఎస్ హయాంలోనే పేదలకు అన్నివిధాలా న్యాయం చేయడం జరిగిందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని సుల్తాన్‌నగర్ షంషేర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే మాగంటి, కార్పొరేటర్ దేదీప్య విజయ్‌లు చెక్కులను పంపిణీ చేశారు. ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దారు నవీన్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, నర్సింగరావు, ఆంజనేయులు యాదవ్, పవన్ ముదిరాజ్, అశోక్, బాలురజక, వాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నేషన్ ద్వారా శానిటేషన్ సిబ్బంది హాజరు


హాజరును పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్

హిమాయత్‌నగర్: తాజాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో శానిటేషన్ సిబ్బంది అటెండెన్స్ పేరుతో భారీ స్కామ్ జరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ ద్వారా హాజరు విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నారు. నగరంలోని దోమలగూడ ఏరియా ఏవీ కాలేజీ వద్ద కవాడిగూడ ఎస్‌ఎఫ్‌ఏ పరిధిలోని శానిటేషన్ సిబ్బంది హాజరు నమోదు పై ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో చేస్తున్న హాజరు విధానంపై గురువారం అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. హాజరు విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి


విద్యార్థినికి మాత్ర వేస్తున్న కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: నిరంతరం పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు ఆరోగ్యంపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను వేశారు. శ్రీరాంనగర్ ప్రభుత్వ వైద్యశాల ఎస్‌పీహెచ్‌ఓ అనూరాధ, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, శ్రీరాంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం ఇన్నర్‌వీల్ క్లబ్ చేయూత

బంజారాహిల్స్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం, వ్యాధిగ్రస్తుల కోసం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రతినిధులు ముందుకొచ్చారు. గురువారం తలసేమియా, సికిల్‌సొసైటీని సందర్శించి వ్యాధిని నిర్ధారించడంతో పాటు చికిత్స చేసేందుకు ట్రియో పీసీఆర్ మిషన్‌ను అందజేశారు. క్లబ్ సీనియర్ సభ్యురాలు నిర్మలా చక్రవర్తి రూ. లక్ష సహాయంతో కొనుగోలు చేసిన ఈ యంత్రాన్ని సభ్యులు తలసేమియా, సికిల్‌సెల్ సొసైటీ సభ్యులకు అందజేశారు. భవిష్యత్‌లో తమ క్లబ్ తరపున తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. క్లబ్ అధ్యక్షురాలు బోన్యా లహిరి, కార్యదర్శి నళిని ఎస్ కుమార్, పూర్వ డిస్ట్రిక్ట్ చైర్మన్ లీలా చద్వాని, కోశాధికారి ఆశా అగర్వాల్, మధు మాథుర్, వాసంతి, నమ్రతారవి, విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.


ట్రియో పీసీఆర్ మెషిన్‌ను అందజేస్తున్న దృశ్యం

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి


దానంను కలిసిన దుర్గా భవానీనగర్ బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలంటూ బస్తీవాసులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీలో కమ్యూనిటీ హాల్‌కోసం స్థలం ఉండి గతంలో నిధులు మంజూరైనప్పటికీ కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరగడం లేదని చొరవ తీసుకొని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలంటూ దానంను బస్తీవాసులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అధికారులతో అక్కడ పర్యటిస్తానని స్థానికంగా ఉన్న సమస్యలతో పాటు కమ్యూనిటీ హాల్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దుర్గాభవానీనగర్ ఫేజ్–1 అధ్యక్షులు వేముల జగన్, కార్యదర్శి ఓర్సు చిన్న శ్రీను, బత్తుల మల్లేష్, వరికుప్పల అర్జున్, ఓర్సు శ్రీకాంత్, విజయ్, రాజు, కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన సమస్యల పరిష్కారం

- సమస్యలపై అధికారుతో సమీక్ష
- డీఎంసీ సేవా ఇస్లావత్ నాయక్


డీఎంసీకి వినతి పత్రం సమర్పిస్తున్న బస్తీ నాయకులు

రహమత్‌నగర్: బస్తీల్లో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 డీఎంసీ సేవా ఇస్లావత్ నాయక్ స్పష్టం చేశారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా రహమత్‌నగర్ డివిజన్‌లోని బ్రహ్మశంకర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన సమస్యలపై సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని అనేక సమస్యలు సమీక్ష సమావేశంలో తమ దృష్టికి వచ్చాయని, అయితే అందులో ప్రధాన సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇందులో ప్రధానంగా డ్రైనేజీ, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పెండింగ్ పనులు అధికంగా ఉన్నాయన్నారు. అందిన ఫిర్యాదులపై ఆయా శాఖల సిబ్బంది ముందుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం నివేదికలు రూపొందిస్తారన్నారు. ప్రాధాన్యతను బట్టి నిధులను ఆయా పనులకు కేటాయించనున్నట్లు తెలిపారు. సమస్యలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం మంచి పని, దీని ద్వారా సమస్యలు తమ దృష్టికి నేరుగా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ... సమావేశంలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైతే నిధులు కేటాయింపు కోసం సంబంధిత శాఖ మంత్రులను తాము స్వయంగా కలిసి విజ్ఞప్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై నెలకోసారి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈఈ రాజ్‌కుమార్, పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీ రాణి, ఏఈ భరత్‌కుమార్, వీధి దీపాల విభాగం ఏఈ మల్లికార్జున్, జలమండలి మేనేజర్లు రాజేందర్, శ్రీనివాస్, సూర్య ప్రకాష్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఓర్సు అడవయ్య ఎక్బాల్, మన్సూర్, అనంతయ్య, వేముల యాదయ్య, జేపీ జ్ఞానేశ్వర్, లతీఫ్, శాంతకుమార్, రవిశంకర్, షేక్ సాబేర్, సంజీవ్ రావు, బ్రహ్మశంకర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కీలకమైన రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లై, ఐసీడీఎస్, ఎక్సైజ్ శాఖల అధికారులు రాకపోవడం పట్ల బస్తీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

రేపు ఎన్ఆర్ఆర్ పురం హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

రహమత్‌నగర్: బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీకి ఆదివారం ఎన్నికల జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అందులో పురుషుల 8 పోస్టులకు గాను 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండు మహిళల పోస్టులకుగాను ముగ్గురు మహిళలు బరిలో ఉన్నారు. రిజర్వేషన్ అయిన ఎస్సీ పోస్టు ఇప్పటికే ఏకగ్రీవం కాగా మిగతా వారు పోటీలో ఉన్నారు. ఈ సొసైటీ 1976వ సంవత్సరంలో ఏర్పాటైంది. ప్రతి ఐదు సంవత్సాలకు ఓ సారి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం 210 మంది సొసైటీలో వాటాదారులు (ఓటర్లు)గా ఉన్నారు. వీరు రేపు ఓటు హక్కులను వినియోగించుకోనున్నారు. ఆదివారం సైట్–1లోని సొసైటీ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. పోలింగ్ అనంతరం సాయంత్రం ఓట్ల లెక్కింపు నిర్వహించిన ఫలితాలను ప్రకటిస్తారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆయా బస్తీల్లో పర్యటిస్తు సొసైటీలోని వాటాదారులను (ఓటర్లు) కలుస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 71, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 80, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 65, పందిరి బీర 72, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 175, గింజ చిక్కుడు 75, గోకరకాయ 55, కీర 35, దోసకాయ 27, రూట్ రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 20, అరటికాయ 12, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వైభవంగా దైవసన్నిధానం బ్రహ్మోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీశ్రీభూ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం, అలంకారం, నిత్యహోమం, బలిహరణ, హారతి, తీర్థప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం జరిగిన గరుడ సేవకు భక్తులు విశేషంగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రసన్నలక్ష్మీ బృందంచే త్యాగరాజ సంకీర్తనలు భక్తి తన్మయత్వంలో ముంచెత్తాయి. బుధవారం రాత్రి ఐశ్వర్యవల్లి కాకులపాటి శిష్య బృందంచే భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది.


కళాకారులకు జ్ఞాపికలను అందజేసిన దృశ్యం

కేబీఆర్ పార్క్ వాక్‌వేలో అనుమానాస్పద కదలికలు

- మత్తుకు బానిసై పార్కులో తిష్ట
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


అనుమానితులను అదుపులోకి తీసుకున్న ఇంటర్‌సెప్టార్ పోలీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను ఇంటర్ సెప్టార్ ఫుట్ పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఇద్దరు యువకులు మత్తులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని మరింత లోతుగా విచారిస్తున్నారు. వీరిని అదుపులోకి తీసుకున్న బండరాయి వద్ద సిరంజ్, తెల్లని పౌడర్, ఇతర కవర్లు లభ్యమయ్యాయి. వివరాలివీ... త్రిపురకు చెందిన బూబాక్ సింగ్(23), మణిపూర్‌కు చెందిన వికాస్(25) కొంత కాలం క్రితం పొట్టకూటి కోసం నగరానికి వచ్చి సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ ఇద్దరినీ యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. రోడ్డున పడ్డ ఇద్దరు జూబ్లీహిల్స్ రోడ్–45 వైపు పార్క్ బండ కింద తలదాచుకున్నారు. అన్నపానీయాలు లేకుండా అక్కడే పడుకోసాగారు. గురువారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీనాథ్, భీమేష్ వీరిని గమనించారు. అనుమానాస్పద స్థితిలో ఉన్న వీరు పూర్తి మత్తులో ఉండి నడవడానికి వీలు లేకుండా తూలసాగారు. అక్కడ గాలించగా కొన్ని ఇంజెక్షన్లు, సిరంజీలు కనిపించాయి. ఓ వ్యక్తి రోజూ టాబ్లెట్స్ ఇస్తున్నట్లు తేలింది. చేతులపై ఇంజెక్షన్‌లు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించారు. త్రిపురలో ఉన్న సమయంలోనే మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తించారు. మత్తు కోసం ఆన్‌లైన్‌లో కొన్ని మత్తు టాబ్లెట్లు కొనుగోలు చేసి పొడి చేసుకొని వీటిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


మాత్రను వేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: విద్యార్థుల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందజేశారు. డాక్టర్ సుభాన్, హెచ్‌ఎం అహ్మద్, కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పించినా.. అందిపుచ్చుకోలేక..!

- రోటరీ క్లబ్ సేవల నమ్మకాన్ని వమ్ము చేసిన టీచర్లు
- ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో దిగజారుతున్న ప్రమాణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆదుకున్న సంస్థ


ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాల

బంజారాహిల్స్: ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ గత 10 సంవత్సరాల నుంచి దత్తత తీసుకుని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా షిఫ్టింగ్ విధానానికి స్వస్తి పలికే విధంగా 1–10వ తరగతి విద్యార్థులందరికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకటే షిఫ్టులో పాఠశాల నడిచేవిధంగా గతేడాది రూ.కోటి వ్యయంతో ఎనిమిది తరగతి గదులు నిర్మించి శభాష్ అనిపించుకుంది. అంతేకాకుండా పాఠశాల పరిసర ప్రాంతాల్లో పోలియో నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు, పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాలను కూడా నిర్వహించింది. ఇదే పాఠశాలలో బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి నీటి సంప్‌లు ఏర్పాటు చేసింది. మధ్యాహ్న భోజనశాల నిర్మాణంతో పాటు యాక్టివిటీ సౌకర్యాన్ని కూడా కల్పించింది. సమావేశ వేదిక నిర్మాణం, సోలార్ విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసింది. ఉపాధ్యాయులకు ఆధునిక టాయిలెట్ల నిర్మాణం చేపట్టింది. అంతేకాకుండా ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఆంగ్ల భాష సంభాషణ శిక్షణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసింది. నలుగురు విద్యా వలంటీర్లకు గత పదేళ్లుగా జీతాలు ఇస్తుంది. ఇద్దరు ఆయాలకు కూడా వీరే జీతాలు చెల్లిస్తున్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. స్కూల్ వాచ్‌మెన్‌ను నియమించి జీతం ఇస్తున్నారు. పాఠశాలలో సకల సదుపాయాలు ఏర్పాటు చేయడంతో గత ఐదేళ్ల నుంచి ఏయేటికాయేడు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి మొన్న స్కూళ్ల పునఃప్రారంభం నాటికి 1500 మంది విద్యార్థులతో కళకళలాడింది. ఈ సంస్థ ఇంత చేస్తున్నా టీచర్లు అవకాశాన్ని నిలుపుకోలేకపోయారు. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ నమ్మకాన్ని నిలబెట్టుకోకుండా వమ్ము చేశారు. ఆ సంస్థ ఉంచిన విశ్వాసం గాలిలో కలిసిపోయింది. 24 మంది టీచర్లకు గాను 22 మంది టీచర్లు ఇక్కడి నుంచి బదిలీ కావడంతో పాఠశాల స్థాయి ఒక్కసారిగా దిగజారిపోయి విద్యార్థులు ఇతర పాఠశాలల బాటపట్టారు. ఒక సంస్థ సుమారుగా ఈ స్కూల్ మీద గత పదేళ్లుగా రూ.10 కోట్లు ఖర్చు చేస్తే విద్యాశాఖ అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా పాలనను గాలికొదిలేశారు. ఫలితంగా టీచర్లు తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపెట్టి పాఠశాల ప్రమాణాలను పూర్తిగా దిగజార్చారు. ఇప్పుడు ఈ సంస్థ ఏదైనా పాఠశాలకు సహాయం చేయాలంటే ముందుకురాలేని పరిస్థితులను ఫిలింనగర్ స్కూల్ యాజమాన్యం కల్పించింది. విద్యాశాఖ అధికారుల నిర్వాకంతో ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదువుకోలేని పరిస్థితులను కల్పించారు. పట్టించుకువవారు లేక, ప్రజాప్రతినిధులు దృష్టిసారించక విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా తయారయ్యాయి. మొత్తం పాఠశాలను ప్రక్షాళన చేయకుంటే రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థులు పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నమ్మించి లైంగికదాడి

కాచిగూడ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమాకు చెదిన యువతి (28) చిక్కడపల్లిలోని హాస్టల్‌లో ఉంటోంది. లక్డికాపూల్‌కు చెందిన విశాల్ (27) ప్రైవేట్ ఉద్యోగి. వీరిద్దరు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి కాచిగూడలోని ఓ హోటల్ లాడ్జీలో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బుధవారం ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అతడు మరో యువతిని ఇటీవల పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది.

అద్దెకు తీసుకున్న కెమెరాతో పరారీ

వెంగళరావునగర్: కెమెరాను అద్దెకు తీసుకుని యువకుడు పరారైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ వీడియోగల్లీలో నివాసం ఉండే ఎం.సాగర్ కొంతకాలంగా కెమెరాలు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. మే నెల 30వ తేదీన అదే ప్రాంతానికి చెందిన ఎస్.అన్వేష్ అనే యువకుడు రోజుకు రూ. 700 చొప్పున కెమెరా అద్దెకు తీసుకున్నాడు. అతని ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ సాగర్ వద్ద ఉంచాడు. అన్వేష్ రెండు రోజుల తర్వాత సాగర్‌కు ఫోన్ చేసి తన తాత చనిపోయాడని, తనకు యాక్సిడెంట్ అయిందంటూ ఫేక్ ఫొటోలు పంపాడు. అనంతరం అతని నెంబర్ బ్లాక్ చేశాడు. ఇంతవరకు కెమెరాగానీ, అద్దెగానీ ఇవ్వలేదు. తాజాగా అన్వేష్ బుధవారం వేరే నెంబర్‌తో సాగర్ సోదరుడైన సంజయ్ భార్గవ్‌కు ఫోన్ చేసి కెమెరా అద్దెకు కావాలని అడిగాడు. దాంతో అతను ఆరా తీయగా విషయం తెలిసింది. బాధితుడు సాగర్ తాను మోసపోయానని గ్రహించి గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బౌరంపేట్ భూమిపై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ బిల్డర్లతో అధికారులు కుమ్మక్కై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దుండిగల్–గండిమైసమ్మ మండలం బౌరంపేట్‌లోని 10 ఎకరాల భూమిని ఓ సంస్థకు అక్రమంగా అప్పగించారంటూ దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వజ్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్, పి.రాఘవరావు వారసులతో కుమ్మక్కైన అధికారులు బౌరంపేట్ గ్రామంలోని సర్వే నంబర్ 166లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని వారి పేరున మార్చారని సిద్దిపేట జిల్లాకు చెందిన రఘువీర్‌రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. 2019లో సర్వే నంబర్ 166 అంతర్గత భాగంలో ఎక్కడో ఉన్న 2, 3, 4, 5, 6, 7ను తప్పుడు పత్రాలతో రింగ్ రోడ్డు పక్కన ఉన్న 24, 25, 26, 27, 28, 29గా మార్చారని పేర్కొన్నారు. ఇది విలువైన ప్రభుత్వ భూమి అని, అధికారులు చర్యలు చేపట్టి భూమిని స్వాధీనం చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, న్యాయమూర్తి జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలుకు 10 రోజుల సమయం కావాలని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోరడంతో ధర్మాసనం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణను జూలై 2కు వాయిదా వేసింది.

'సుప్రీం' జడ్జితో విచారణ జరిపించాలి

నీట్ అవకతవకలపై కిషన్‌రెడ్డికి విద్యార్థి సంఘాల లేఖ

హిమాయత్‌నగర్: 'నీట్' అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని తెలంగాణ విద్యార్థి, యువజన సంఘాల నేతలు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర లేఖ విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వ్యవహరించిన తీరు కూడా పలు అనుమానాలకు తావు ఇస్తుందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో నీట్ రాసిన 7 లక్షల మందికిపైగా విద్యార్థుల్లో చాలా మంది నష్టపోతున్నారని పేర్కొన్నారు.

నేటి నుంచి 'పవర్ గ్రిడ్ టీటీ' టోర్నీ



సాక్షి, హైదరాబాద్: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఇంటర్ రీజినల్ టేబుల్ టెన్నిస్(టీటీ) టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభంకానుంది. లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియం వేదికగా మూడు రోజులపాటు ఈ టోర్నీ జరగనుంది. పవర్‌గ్రిడ్‌కు చెందిన మొత్తం 15 జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి. పురుషుల, మహిళల టీమ్ విభాగాలతోపాటు వ్యక్తిగత, డబుల్స్ కేటగిరీల్లో మ్యాచ్‌లు ఉంటాయి. పవర్‌గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎస్ఆర్‌టీఎస్–1) రాజేశ్ శ్రీవాస్తవ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ టోర్నీని ప్రారంభించనున్నారు.

నగరంలో నేడు

- తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జనరచయిత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ రచించిన మహాశూన్యం (అనుభావ్య కావ్యం) కావ్యావిష్కరణ రవీంద్రభారతిలో సాయంత్రం 6 గంటలకు. ముఖ్యఅతిథిగా విశ్రాంతి ఐఏఎస్ అధికారి డాక్టర్. కె.వి. రమణ. అనంతరం 'అహో ఆంధ్రభోజ' సినీసంగీత విభావరి.
- మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా త్యాగరాయ గాన సభలోని కళాసుబ్బారావు కళావేదికలో సాయంత్రం 4:30 నుంచి 9 గంటల వరకు సినీసంగీత విభావరి . ముఖ్యఅతిథి మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి.
- అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీపీ మార్గ్‌లోని సంజీవయ్య పార్క్‌లో మెగా ఈవెంట్ మాస్ యోగ ప్రదర్శన.
- వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వికలాంగుల సమస్యల మీద వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రెస్‌మీట్.
- తెలంగాణ జలసాధన సమితి– తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1.30 గంటలకు 'జ్యూడీషియల్ కమిషన్‌లను బెదిరించే కేసీఆర్ భూస్వామ్య, రాచరిక విధానాలను ఖండించండి' అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం.

కరెంటోళ్లు.. ఇక ఆన్'లైన్'

ఈ నెల 24 నుంచి 15 రోజులపాటు లైన్ టు లైన్ సర్వే

- ఆర్టిజన్ నుంచి ఎస్ఈ వరకు క్షేత్రస్థాయి పర్యటనలు
- పోల్స్, లైన్స్, ఇన్సులేటర్స్ పనితీరు పరిశీలన
- '11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్ యాప్'లో వివరాల నమోదు
- 'సాక్షి'తో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ స్పష్టీకరణ

అసలే వర్షాకాలం.. వాన, వరదలు ముంచుకొచ్చాయంటే.. విద్యుత్ వ్యవస్థకు ముప్పే.. తిప్పలే తిప్పలు.. కరెంటోళ్లకు కష్టాలే కష్టాలు.. తీగలు తెగిపడటం, స్తంభాలు నేలకొరగడం, లైన్లపై చెట్లు కూలడం వంటి సమస్యలు తలెత్తడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా విద్యుత్ సిబ్బంది 'లైన్ టు లైన్ సర్వే చేపట్టనున్నారు. సోమవారం నుంచి వరుసగా పదిహేను రోజులపాటు ఆర్టిజన్ మొదలు ఎస్ఈ వరకు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో సంస్థాగతంగా, లైన్‌లవారీగా ఉన్న లోపాలను గుర్తించి, వివరాలను '11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్'యాప్ లో నమోదు చేయనున్నారు.



సాక్షి, సిటీబ్యూరో: "11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్' యాప్‌లో సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తి, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు లోపాన్ని సులభంగా గుర్తించడమేకాకుండా, సత్వరమే సరఫరాను పునరుద్ధరించే అవకాశం కూడా ఇంజనీర్లకు లభించనుంది' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన 'సాక్షి ప్రతినిధి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సరఫరాలో అంతరాయాలను నివారించే దిశగా చేపట్టిన చర్యలను వివరించారు.

సాంకేతిక లోపాల గుర్తించి...

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలో 33 కేవీ ఫీడర్లు 675, 11 కేవీ ఫీడర్లు 3,385 ఉన్నాయి. 11 కేవీ ఓవర్ హెడ్‌లైన్స్ 21,364 కిలోమీటర్లు, ఎల్‌టీ లైన్స్ 56,909 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 1.47 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. వీటి పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇన్సులేటర్లు, ఏబీ స్విచ్‌లు, కండక్టర్లు, డీటీఆర్‌ల వివరాలను పక్కాగా సేకరించి '11 కేవీ ఫీడర్ మేనేజ్‌మెంట్'యాప్‌లో నమోదు చేస్తాం. తద్వారా లైన్ల పునరుద్ధరణ పనులతోపాటు మెటీరియల్‌ను సమకూర్చడం కూడా సులువవుతుంది.

అధ్యయనం కోసం ప్రత్యేక బృందాలు

కోర్‌సిటీ మినహా ఇతర ఫీడర్లకు సెన్సార్లు లేవు. సాంకేతిక సమస్యల గుర్తింపులో జాప్యానికి ఇది కూడా ఓ కారణం. ఈ లోపాన్ని అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నాం. డిస్కం పరిధిలోని అన్ని ఫీడర్లకు సెన్సార్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించొచ్చని భావిస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును పరిశీలించేందుకు నలుగురు సీజీఎంల నేతృత్వంలోని నాలుగు బృందాలు ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్‌కు వెళ్లాయి. అక్కడి డిస్కంల పనితీరును అధ్యయనం చేసి, సమగ్ర నివేదికను అందజేస్తాయి.

ల్యాబ్ టెస్టింగ్‌కు మెటీరియల్స్


విద్యుత్ స్తంభాలు, కాసారాలు, కండక్టర్లు, విద్యుత్ మీటర్లు, ప్యానల్ బోర్డులు, కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఇన్సులేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇలా ప్రతి వస్తువు, పరికరం ప్రైవేటు ఏజెన్సీల నుంచే కొనుగోలు చేస్తున్నాం. ఎంఓయూకు ముందు చూపిన శాంపిల్స్‌కు ఆ తర్వాత సరఫరా చేస్తున్న మెటీరీయల్‌కు పొంతన ఉండటం లేదు. నాసిరకం మెటీరియల్ సరఫరా అవుతోంది. కాంట్రాక్టర్లు సరఫరా చేసిన మెటీరియల్‌ను ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయించకపోవడం వల్ల వాటిని అమర్చిన కొద్దిరోజులకే పాడైపోతున్నాయి. ఇకపై మెటీరియల్ కొనుగోలు అంశాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించాం. డిస్కం నిర్దేశించిన ప్రమాణాలు లేని వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని తీర్మానించాం. దీనిపై త్వరలోనే ఓ కఠినమైన పాలసీని కూడా తీసుకురాబోతున్నాం.

స్థానికులతో మమేకమై..

ఈదురుగాలుల వల్ల ఏదైనా లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు స్థానికుల నుంచి ఫిర్యాదు అందేవరకు సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలు తెలియడం లేదు. మెజార్టీ ఇంజనీర్లు కనెక్షన్ల జారీ, మీటర్ రీడింగ్, బిల్లుల వసూళ్లే ప్రధానంగా పని చేస్తున్నారు. సాంకేతిక అంశాలపై కనీస అవగాహన కూడా ఉండటం లేదు. సరఫరా వ్యవస్థపై క్షేత్రస్థాయి ఇంజనీర్లకు, ఆర్టిజన్లకు సరైన అవగాహన లేదు. ఈ నేపథ్యంలో సర్వేలో భాగంగా ప్రతి సెక్షన్ పరిధిలో రెండు బృందాలు(ఏఈ, సబ్ ఇంజనీర్) పర్యటించి సాంకేతిక లోపాలను గుర్తిస్తారు. కాలనీ సంక్షేమ సంఘాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఇతర వినియోగదారులతో మమేకమై సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయాలను నివారించనున్నారు.

'కంటి' సమస్యలకు అత్యాధునిక సర్జరీ 'సిల్క్'

'మెడి విజన్ ఐ కేర్ సెంటర్' వైద్యుల వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: నేత్ర సమస్యలతో బాధపడుతున్నవారి కోసం అత్యాధునిక శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చింది. నగరంలోని మెహిదీపట్నంలో ఉన్న మెడి విజన్ ఐ కేర్ సెంటర్ 'స్మూత్ ఇన్సిషన్స్ లెంటిక్యుల్ కెరాటొమిల్యూసిస్ ('సిల్క్') అనే అత్యాధునిక శస్త్ర చికిత్సను తాజాగా పరిచయం చేసింది. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, సంస్థ డైరెక్టర్ డాక్టర్ రూపక్‌కుమార్‌రెడ్డి సిల్క్ గురించి వివరించారు. దీర్ఘదృష్టి వంటి కంటి సమస్యలకు, ముఖ్యంగా మయోపియా సంబంధిత సమస్యలకు పరిష్కారంగా ఈ సర్జరీ ఉత్తమ ఫలితాలను అందిస్తుందని, లాసిక్ సర్జరీతో పోలిస్తే మరెన్నో రెట్లు ప్రభావవంతంగా ఉంటుందని అన్నారు. అమెరికా సాంకేతికత ఆధారంగా అందుబాటులోకి వచ్చిన ఈ సర్జరీ సౌకర్యం దేశవ్యాప్తంగా 27 చోట్ల అందుబాటులో ఉండగా, దక్షిణాదిలో తమతోపాటు మరొక్క చోట మాత్రమే ఉందన్నారు. కొన్ని నిమిషాల్లోనే సిల్క్ సర్జరీ పూర్తవుతుందని, శస్త్రచికిత్స అనంతరం 3 గంటల్లోపే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావచ్చని తెలిపారు. డిశ్చార్జ్ అయిన తర్వాత 3 రోజులపాటు స్వల్ప జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని వెల్లడించారు. గత నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన ఈ అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి వంద మందికి శస్త్రచికిత్స నిర్వహించిన తర్వాతే దీని విజయాలను నిర్ధారించుకున్నామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధిస్తేనే మేలు

ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీ ప్రసాద్

గచ్చిబౌలి: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తేనే పర్యావరణ పరిరక్షణతోపాటు మానవాళికి మేలు జరుగుతుందని రాష్ట్ర ఈఎఫ్ఎస్ అండ్ టీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో ఎన్విరాన్‌మెంట్ గవర్నెన్స్‌పై రిఫ్రెష్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో ప్లాస్టిక్ తల్లి పాలల్లోకి కూడా చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కొద్దిదూరానికి బైక్‌లు, కార్లపై వెళ్లడం మానుకుంటే కర్బన ఉద్గారాలను చాలా వరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని, మొక్కల నాటడం ఉద్యమంలాగా సాగాలని సూచించారు. పర్యావరణ చట్టాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వర్షపు నీటిని వ్యక్తిగత అవసరాలకు వాడుకునే విధంగా పొదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ క్లైమెట్ చేంజ్ ట్రెనింగ్ డివిజన్ హెడ్ డాక్టర్ రాజేశ్వర్, ఫారెస్ట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పీసీసీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణీప్రసాద్

డ్రగ్స్ పార్సిల్ పేరిట 15 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: ముంబై నుంచి ఇరాన్‌కు నిషేధిత మత్తు పదార్థాలు(డ్రగ్స్) పార్సిల్ చేస్తున్నారంటూ ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు బెదిరించి మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన ఓ వ్యక్తికి డీహెచ్ఎల్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'మీ పేరు మీద ఉన్న పార్సిల్ వచ్చింది, అందులో నిషేధిత వస్తువులు ఎండీఎంఏ డ్రగ్స్ ఉన్నాయి, ముంబై నుంచి ఇరాన్‌కు అవి పార్సిల్ అయ్యాయి' అని చెప్పారు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు ఈ విషయమై వ్యక్తిగతంగా కలవాలంటే ఎక్కడికి రావాలని ఫోన్‌లో వారిని అడిగాడు. వెంటనే మోసగాళ్లు ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు కాల్ బదిలీ చేస్తున్నట్లు భయపెట్టారు. తర్వాత మోసగాళ్లు చెప్పిన విధంగా రూ.15.36 లక్షల ఆర్‌టీజీఎస్ ద్వారా వారి ఖతాలకు బదిలీ చేశాడు. అయితే తాను మోసపోయానని వెంటనే గ్రహించిన బాధితుడు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరిట మోసం నగరానికి చెందిన ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగి మొబైల్ ఫోన్‌కు ఎస్‌బీఐ యోనో రివార్డ్ పాయింట్లపై ఆఫర్ గురించి సందేశం వచ్చింది. రివార్డ్ పాయింట్లలను క్లెయిమ్ చేయడానికి లింక్‌పై క్లిక్ చేయాలని సమాచారం వచ్చింది. వెంటనే ఆమె లింక్‌పై క్లిక్ చేయగా కొద్దిసేపటికి రూ.2.43 లక్షలు తన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఇతరుల ఖాతాకు బదిలీ అయ్యాయి. మోసపోయానని బాధిత మహిళ గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లపై సీఎం కుట్ర

- బీసీ, కుల సంఘాల ఆరోపణ
- జూలై 15న 'చలో సెక్రటేరియట్'కు పిలుపు



కామారెడ్డి డిక్లరేషన్ పత్రాన్ని ప్రదర్శిస్తున్న రాజారాం యాదవ్ తదితరులు

లక్డీకాపూల్: రిజర్వేషన్ల అంశంపై ప్రయివేటు వ్యక్తులతో హైకోర్టులో పిటిషన్ వేయించి, దొడ్డి దారిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ బీసీ, కుల సంఘాల నేతలతో కలిసి విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరిని ప్రకటించకపోతే జూలై 15న సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని, జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా ఎంతో తేలుస్తామని రాజ్యాంగాన్ని పట్టుకొని చెబుతున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మాటలకు విలువనివ్వరా అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, ఆయా సంఘాల నేతలు కరుణాకర్ , ఎల్చాల దత్తాత్రేయ, శారదాగౌడ్, మేకల కృష్ణ, లొడంగి గోవర్ధన్, నిమ్మల వీరన్న పాల్గొన్నారు.

భర్త వేధింపులతో ఆత్మహత్య

నాంపల్లి: భర్త వేధింపులతో జీవితంపై విరక్తి చెందిన ఓ గృహిణి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్వామి దయానందనగర్‌లో నివాసముంటున్న నరేష్‌కుమార్, విద్యారాణి(32) భార్యాభర్తలు. భర్త నిలోఫర్ ఆసుపత్రిలో ఉద్యోగి. గత కొంతకాలంగా ఇరువురి మధ్య గొడవ నడుస్తోంది. భర్త వేధింపులు ఎక్కువ కావడంతో విద్యారాణి జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంటి మీది నుంచి కిందికి దూకింది. తీవ్రంగా గాయపడిన ఆమను స్థానికులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తుదిశ్వాస విడిచింది. మృతురాలి సోదరుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదుతో హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏ షామ్ మస్తానే....!



'ఏ షామ్ (సాయంత్రం) మస్తానే మద్ హోష్ కియే జా..!'అంటూ బాలీవుడ్ దిగ్గజం రాజేష్ ఖన్నా మధురిమలతో సాయంత్రం మైమరిచిపోయింది.. అమితాబ్ షరాబీ పాటలతో ఓలలాడించింది. శంషాబాద్ పట్టణంలోని ఈరామ్ గార్డెన్‌లో భారత-అమెరికా ద్వంద్వ పౌరసత్వ ప్రథమ పౌరుడు ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ గురువారంరాత్రి బక్రీద్ సందర్భంగా ఇచ్చిన ఈద్ సెలబ్రేషన్ సంగీత, సాహిత్యప్రియులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమానికి కాంగ్రెస్ నేత, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చేసిన పలు వంటకాలు శాఖాహార, మాంసాహారప్రియులను నోరూరించాయి.

– శంషాబాద్

కలర్‌ఫుల్ కాంబినేషన్.. రిసార్ట్ వేర్స్..

- నయాలుక్ కోసం యువత ఆరాటం
- ఆకర్షణీయంగా డిజైన్లు





బంజారాహిల్స్: వీకెండ్ వచ్చిందంటే చాలు నగరవాసులు గతంలో పబ్‌లకు హోటళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు. కోవిడ్ అనంతరం మారిన పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు వీకెండ్ వచ్చిందంటే నగరవాసులు రిసార్ట్‌లకు వెళ్తున్నారు. అందులోనూ మలేషియా, సింగపూర్, స్విట్జర్లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలకూ సెలవులు ఎంజాయ్ చేయడానికి వెళ్తున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా డిజైనర్లు న్యూలుక్‌తో కొత్త డ్రెస్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. తాజాగా నగర మహిళలకు పరిచమైన హాలిడే రిసార్ట్ వేర్ నయాలుక్‌తో ఇట్టే ఆకట్టుకుంటోంది. ఇరుకుగా లేకుండా తేలికపాటి ఫ్యాబ్రిక్‌తో ఫ్యాషన్‌గా ఉండేలా డిజైనర్లు సరికొత్త హాలిడే రిసార్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్లో దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన వందమందికిపైగా ఫ్యాషన్ డిజైనర్లు తాము తీర్చిదిద్దిన దుస్తులను ప్రదర్శించారు. కుట్లు అల్లికలు లేకుండా మడతలు, క్లిప్పులతో తీర్చిదిద్దడం వీటి ప్రత్యేకత. ఏడాది కాలంగా హైదరాబాద్‌లో వివిధ ప్రదర్శనల్లో హాలిడే రిసార్ట్ వేర్‌ను ప్రదర్శించగా యువత నుంచి మంచి స్పందన లభించిందని, ముంబై తర్వాత హైదరాబాద్ మహిళలే ఫ్యాషన్‌కు పెద్ద పీట వేస్తున్నారని న్యూఢిల్లీకి చెందిన ఫ్యాషన్ డిజైనర్ కీర్తి వెల్లడించారు. నయాలుక్, కలర్‌ఫుల్ కాంబినేషన్ కోసం యువత ఆరాటపడుతుందని ముంబైకి చెందిన శృతి రాంక తెలిపారు. ట్రెండ్‌ను ఫాలో కావడంలో హైదరాబాద్ మహిళలు అందరి కంటే ముందున్నారన్నారు. ఇండో వెస్ట్రన్ కలయికలో ఈ నయా లుక్‌తో కూడిన దుస్తులు విశేషంగా ఆకట్టుకున్నాయి.

భాగ్యలక్ష్మి అమ్మవారికి కేంద్రమంత్రుల ప్రత్యేక పూజలు



చార్మినార్: కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్ తదితరులు గురువారం రాత్రి చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ట్రస్టీ శశికళ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.

సీఎంకు బోనాల ఉత్సవ కమిటీ సన్మానం



సీఎం రేవంత్‌కు వేద ఆశీర్వాదం చేస్తున్న పండితులు

బంజారాహిల్స్: ఆషాఢమాసం బోనాల జాతరను పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సత్కరించారు. ఈసారి జరిగే బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు పాటిల్ సదానంద్ యాదవ్, మధుసూదన్‌గౌడ్, ఆలే భాస్కర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ' పాఠశాలల పనులు వేగవంతం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. అవసరమైతే అదనంగా కూలీలను తీసుకోవాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. పనులు పూర్తయిన ఫొటో, వర్క్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. పాడైన బోర్డు స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, పాఠశాల భద్రతను దృష్టిలో పెట్టుకొని పనులను చేయాలని సూచించారు. పాఠశాలల్లో చెత్త, స్క్రాప్ తొలగించాలని, క్షేత్రస్థాయిలో ఏఈలు పనులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఆర్.రోహిణి, ప్రత్యేక అధికారులు, ఈఈ, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభం

సాక్షి,సిటీబ్యూరో: ఎనిమిదేళ్ల విరామం తర్వాత హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించే గోదావరి బెసిన్‌శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో అత్యవసర పంపింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నగరానికి ఆరు జలాశయాల నుంచి నీటి సరఫరా జరుగుతుండగా, అందులో నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ల నుంచే 75 శాతం నీటిని తరలిస్తున్నారు. ఇప్పటికే నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. తాజాగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో అత్యవసర పంపింగ్ ప్రారంభమైంది. చివరి సారిగా ఇక్కడి నుంచి 2016లో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోసి హైదరాబాద్‌కు తరలించారు. గురువారం జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ప్రాజెక్టుకు వెళ్లి ఎమర్జెన్సీ పంపింగ్ పనులను పరిశీలించారు.

మేనబావ తనను ప్రేమించడం లేదని..

కాచిగూడ: మేనబావ తనను ప్రేమించడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొనగండ్ల గ్రామానికి చెందిన రమా(23) కొండాపూర్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటోంది. ఆమె కొంతకాలంగా తన మేనబావను ప్రేమిస్తోంది. అయితే అతడు ప్రేమించకపోవడంతో తీవ్రంగా మనోవేదనకు గురైంది. కాచిగూడలోని టీఎక్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సోదరి ఉంటున్న హాస్టల్‌కు వచ్చింది. మోతాదుకు మించి అనస్తీయా ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్య చేసుకుంది.

శంకర్‌యాదవ్‌కు ఘనంగా నివాళి

హాజరైన మంత్రులు, మాజీమంత్రులు, ప్రముఖులు



శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, హరీశ్, కేటీఆర్, శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి.

రాంగోపాల్‌పేట్: మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు శంకర్ యాదవ్‌కు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. శంకర్‌యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ నెల 10వ తేదీన శంకర్ యాదవ్ మరణించగా, గురువారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఆడిటోరియంలో దశ దిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, మల్లారెడ్డి, దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, వివేక్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాగంటి గోపినాథ్, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీమంత్రులు మహమూద్ అలీ, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, జోగు రామన్న, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎగ్గెం మల్లేశం, బండ ప్రకాష్ ముదిరాజ్, నవీన్‌రావు, బల్మూరి వెంకట్, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, పలువురు మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, యాదవ సంఘాల నాయకులు రాజారాం యాదవ్, గోవర్ధన్ యాదవ్, అరిగెల నాగేశ్వర్ యాదవ్ పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. బోయిన్‌పల్లి, మోండా మార్కెట్ వర్తకులు, హమాలీ కార్మికులు స్వచ్ఛందంగా బంద్ చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 21, జూన్, 2024

ఆహ్లాదంగా తాన్సేన్ రెస్టారెంట్







కన్హా ఆశ్రమంలో యోగాసనాలు వేస్తున్న విదేశీయులు

యోగమస్తు..

భారతీయ సంస్కృతి విశ్వవ్యాప్తం ..

సంప్రదాయ భారతీయ 'యోగ' ఇప్పుడు విశ్వవ్యాప్తమైంది. మన దేశస్తులతో పోటీ పడుతూ విదేశీయులు కూడా ఆరోగ్య'యోగ'ం కోసం తపిస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాల్లో మమేకమైన ఆసనం...ఇప్పుడు ఆరోగ్యార్థుల పాలిట శాసనంగా మారింది. ఈ నేపథ్యంలో మన వాళ్లే కాకుండా పాశ్చాత్యులు కూడా యోగ సాధన కోసం నగరానికి క్యూ కడుతున్నారు. మేము సైతం అంటూ యోగ మార్గానికి జై కొడుతున్నారు. –సాక్షి, సిటీబ్యూరో

మానసిక – శారీరక ఆరోగ్యకర మార్పులకు వారధి..	నగరం వేదికగా విదేశీయులకు శిక్షణ..	నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా...

సౌంత్వన–ఉత్తేజమయం...



దేహానికి ధ్యానంలాంటిది...యోగ. ఒక్కో ఆసనం శరీరంలోని ఒక్కో అవయవానికి సాంత్వనను, ఉత్తేజాన్ని అందిస్తుంది. యోగలోని విభిన్నమైన బ్రీథింగ్ టెక్నిక్స్ శారీరక, మానసిక ఉపశమనాన్ని నెలకొల్పుతాయి. దశాబ్దకాలంగా ఆస్వాదనతో, అంకితభావంతో యోగ చేస్తున్నాను. ఫిట్నెస్ కోసమో, మరువు తగ్గించుకోడానికి మాత్రమే కాకుండా నిత్య జీవనం పై ఎంతో ప్రభావం చూపిస్తుంది. యోగాసనాలు యవ్వనత్వాన్ని కాపాడుతూ, చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. దృష్టి కేంద్రీకరణ, మానసిక నిలకడ–సమతుల్యతలో యోగ మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. షూటింగ్‌లో ఉన్నా, ఇతర ప్రాంతాల్లో ప్రయాణం చేస్తున్నా నిత్యం యోగ చేస్తుంటాను. ప్రాణాయామం, శ్వాస వ్యాయామాలు చేయడం ఇష్టం. ఎక్కువ కాలం యోగతో ప్రయాణం..ఆనందమయ జీవితానికి వారధి.

–శ్రద్దాదాస్, ప్రముఖ సినీనటి.

యోగ, ప్రాణాయామం, ధ్యాన సమ్మేళనం...

మానవ జీవితానికి అందిన అద్భుత వరం ..యోగ. యోగాసనాలు శారీరక, మానసిక స్థితిగతులపైన ఉత్తేజకర ప్రభావాన్ని చూపించడమే కాకుండా అంతర్గత శక్తిని ప్రసాదిస్తుంది. వీటి సమ్మేళనం జీవితంలో ఒక నూతన మార్గాన్ని సూచిస్తుంది. యోగలో ఎన్నో ఆసనాలు ఉన్నప్పటికీ నిత్య జీవనంలో ప్రత్యేకించిన 25–30 ఆసనాలు తప్పనిసరిగా చేయాలి. యోగ నిత్య ప్రయాణంలో క్రమ క్రమంగా శాశ్వత ప్రయోజనాలను అందిస్తుంది. ప్రస్తుత ఆధునిక, సాంకేతిక యుగంలో యోగను తప్పనిసరి దైనందిన చర్యగా మార్చుకోవాల్సిన అవసరముంది.

–యోగాన్వేషి స్వప్న, యోగా శిక్షకురాలు. హైదరాబాద్.





స్పృహ 'వర్సెస్' ఆందోళన..

యాంటీ డిప్రెసెంట్స్ వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని గణాంకాలు వెల్లడించాయి. సాధారణ ఆందోళన స్థాయి నుంచి అస్పష్టమైన చంచలత్వం, తీవ్ర శారీరక లక్షణాలు.. మూర్ఛపోయేంతలా మానసిక ఆందోళనలు పెరిగిపోతున్నాయి. ఆందోళన అనేది కేంద్ర నాడీ వ్యవస్థపై నియంత్రించలేని ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి సమస్యలకు యోగ పరిష్కారాలను సూచిస్తుంది. భావోద్వేగ నేపథ్యంతో పనిచేసే యోగ మెదడు సిగ్నలింగ్ వ్యవస్థను తిరిగి సున్నితం చేయడంలో సహాయపడుతుంది. భారతీయ సంస్కృతిలోని యోగ ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న మానసిక ఆందోళనను సమాధాన పరుస్తుంది. సామాజికంగా పెరిగిపోయిన ఆందోళన, అనిశ్చితి వంటి పరిస్థితులకు యోగ చక్కటి పరిష్కార మార్గం. ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా గతేడాది మానసిక వైద్యులను సంప్రదించిన సందర్శకులు,

– ఇరినా తాష్మెట్, ఉజ్బెకిస్తాన్. (కన్హా శాంతి వనంలో యోగా అభ్యాసకురాలు)

ఐక్య వేడుకగా..

అంతర్జాతీయ యోగ దినోత్సవ నేపథ్యంలో ఏటా యోగాకు పెరుగుతున్న ఆదరణ, ఉత్సాహం, ఐక్యత చూసి ఆశ్చర్యపోతున్నాను. యోగ సెషన్‌లో భాగంగా యోగలోని ఎనిమిది భాగాల్లో దేనిని సాధన చేసినా ఆసనం, ప్రాణాయామం, ధారణ, ధ్యానం, యామ–నియామ ప్రయోజనాలను అందిస్తుంది. అనతికాలంలోనే యోగ విశ్వవ్యాప్తమైంది. హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో అధికారిక వేడుకలకు ముందుగా ప్రపంచవ్యాప్తంగా వేడుకలను సమన్వయం చేస్తుంది. ఇందులో జైపూర్‌లోని ఓ గ్రామం నుంచి యునెస్కో–ప్యారిస్, యునైటెడ్ నేషన్స్–న్యూయార్క్ వరకూ అన్ని హార్ట్‌ఫుల్‌నెస్ బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగ దేశాన్ని దాటి వివిధ భాషలు, మతాలు, సంప్రదాయాలకు అతీతంగా ఐక్య వేడుకగా మారింది. యోగ కార్యక్రమాలను సిద్ధం చేయడం, నిర్వహించడం యోగ చేసిన అనుభూతిని అందిస్తుంది.

–డాక్టర్ వెరోనిక్ నికోలాయ్ (ఫ్రాన్స్), హార్ట్‌ఫుల్‌నెస్ యోగ అకాడమీ డైరెక్టర్.



'తాన్సేన్' మొఘల్ వైభవం

మణికొండ: ఐదు దశాబ్దాల వారసత్వంతో ఆహార ప్రియులకు విభిన్న రుచులను అందిస్తున్న ఓబ్రీస్ గ్రూప్ ఔటర్‌రింగ్ రోడ్డు పక్కన, ఐటీ జోన్‌కు సమీపంలో తాన్సేన్ రెస్టారెంట్‌ను గురువారం ప్రారంభించింది. అద్భుతమైన పాకశాస్త్ర వారసత్వం, మొఘల్ వైభవంతో దీన్ని తీర్చిదిద్దామని సంస్థ చైర్మెన్ అమర్ ఓబ్రి పేర్కొన్నారు. లెజండరీ సంగీత కారకుడు తాన్సేన్ నుంచి ప్రేరణ పొంది గ్యాస్ట్రోన మీ స్వచ్ఛమైన ఆనందాన్ని పొందుపరిచే రుచుల వేడుకగా ఇది నిలుస్తుందన్నారు. విభిన్న రుచులు, వంటకాల నైపుణ్యంతో ప్రతి వంటకం ఓ అద్భుత కళాఖండంలా తాన్సేన్‌లో ఉంటుందని చెఫ్ కన్సల్టెంట్ అనూజ్ వాధావన్ అన్నారు.



గెస్ట్స్‌కు 'బెస్ట్'గా...

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ వసతి సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా హోటల్స్ పనిచేయాలని సంబంధిత రంగ నిపుణులు సూచించారు. గ్లోబల్ హాస్పిటాలిటీ టెక్నాలజీ కంపెనీ ఓయో ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ ఈస్టిన్‌లో ఓ మీట్ ఏర్పాటు చేశారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన హోటల్స్ యజమానులను సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. దేశ వ్యాప్తంగా 100 మందికి పైగా పేరొందిన హోటళ్ల ప్రతినిధులు హాజరయ్యారు. ఓయో చీఫ్ మర్చంట్ ఆఫీసర్ అనుజ్ తేజ్‌పాల్ హల్సియోన్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ మేనేజింగ్ పార్టనర్ లీతేష్ ముండ్లూరు, వెంకట ఫణీంద్ర చౌదరి, టిప్సీ ఇన్ సూట్స్ హెడ్ విజయ్ యాదవ్ మాట్లాడారు.


బే విండోకు డిజైన్ ఎక్సలెన్స్...



నగరంతో పాటు పలుచోట్ల అందుబాటులోని ఫ్యాషన్ ప్రీమియర్ మిడ్–లగ్జరీ బ్రాండ్ బే విండోకు ప్రతిష్టాత్మక డిజైన్ ఎక్సలెన్స్ అవార్డ్ లభించింది. ఈ విషయాన్ని సంస్థకు చెందిన డిజైన్ లీడ్ సిద్ధాంత్ ఆనంద్ తెలిపారు. బ్రాండ్‌ను ప్రారంభించిన సంవత్సరంలోనే ఈ ప్రశంసలు లభించడం తమ డిజైన్ల వైవిధ్యానికి నిదర్శనమని, భారతీయతను ప్రతిబింబించే దాదాపు 1000కిపైగా అత్యాధునిక డిజైన్ల రూపకల్పన ద్వారా ఈ అవార్డుకు అర్హత పొందామని సంతోషం వ్యక్తం చేశారు.

సెల్ బేలో 'వర్షిణి' సందడి...

షావోమీ 14 సీవీ మోడల్ ఆవిష్కరణ..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టాలీవుడ్ నటి, యాంకర్ వర్షిణి గచ్చిబౌలిలోని సెల్ బే స్టోర్ వేదికగా సందడి చేశారు. షావోమీ ఆధ్వర్యంలోని సరికొత్త 5జీ హ్యాండ్సెట్ షావోమీ 14 సీవీ మోడల్‌ను నటి వర్షిణి గురువారం ఆవిష్కరించారు. ఎప్పటికప్పుడు మారిపోతున్న సాంకేతికత అధునాతన జీవన విధానానికి చేరువ చేస్తుందని ఆమె అన్నారు. వినూత్న ఫీచర్స్‌తో రూపొందించిన ఈ బ్రాండ్‌ను ఆవిష్కరించడం సంతోషమన్నారు. తెలంగాణ కస్టమర్లకు అధునాతన ఉత్పత్తులను అందించడంలో తమ సంస్థ ముందుంటుందని సెల్ బే వ్యవస్థాపకులు, ఎండీ సోమా నాగరాజు పేర్కొన్నారు. ఇండియా డిప్యూటీ హెడ్ కునాల్ అగర్వాల్, ఛానల్ సేల్స్ డైరెక్టర్ మల్లికార్జున రావు, ట్రేడ్ ఛానల్ హెడ్ సాజు రత్నం, జోనల్ హెడ్ సయ్యద్ అన్వర్, నేషనల్ రిటైల్ ఎండీ మొహమ్మద్ ఇఫ్తేకర్ పాల్గొన్నారు.







'మై గ్లామ్'లో మోడళ్లు..

స్థానిక రోడ్ నెం.1లోని పాప్ అప్ స్పేస్‌లో మై గ్లామ్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనలో వజ్రాభరణాలను మోడల్స్ ధరించి ర్యాంప్‌పై తళుక్కుమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వజ్రాభరణాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు సుచరిత, మనోజ్ తెలిపారు.

– బంజారాహిల్స్



బస్కింగ్.. జోష్

- వరల్డ్ మ్యూజిక్ డేతో అంకురార్పణ
- మెట్రో మెడ్లీతో శ్రీకారం చుట్టిన తొలి సిటీ

సాక్షి, సిటీబ్యూరో: మనం ఏదైనా బజార్‌లో షాపింగ్ చేస్తూ మన జేబులకు పనిచెబుతుంటాం.. .అక్కడే మూల ఖాళీగా ఉన్న ప్లేస్‌లో సంగీత బృందం మన చెవులకు పనికల్పిస్తుంది.. మనం ఏదో ఖాళీ మైదానంలో వాకింగ్ చేయడానికి వెళతాం ...అప్పటికే అక్కడ ఇద్దరో ముగ్గురో మ్యుజీషియన్లు కొన్ని వాయిద్యాలతో సంగీతాన్ని నడిపిస్తుంటారు. ఇలా ప్రజలు సంచరించే వీధుల్లో తమ కళను కళాకారులు ప్రదర్శించడాన్నే బస్కింగ్‌గా పేర్కొంటారు. పాశ్చాత్య దేశాల్లో విస్తృతంగా



వ్యాప్తిలో ఉన్న ఈ బస్కింగ్ మన దేశంలో ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. తాజాగా బస్కింగ్‌ను మెట్రో మెడ్లీ ద్వారా పూర్తి ప్రాచర్యంలోకి తెచ్చిన తొలి నగరంగా హైదరాబాద్ నిలిచింది. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని జూన్ 19 నుండి 22 వరకూ నగరంలోని మెట్రో స్టేషన్ల కారిడార్‌లలో గోథే–జెంట్రమ్ హైదరాబాద్ 'మెట్రో మెడ్లీ'ని నిర్వహిస్తోంది.

మెట్రో ప్రయాణికుల కోసం...

ఈ ఈవెంట్‌లో దాదాపు 100 మందికి పైగా సంగీత విద్వాంసులు పాల్గొంటున్నారు. రోజువారీ ప్రయాణికులను ఆనంద పరుస్తోంది. అమీర్‌పేట్, దిల్ సుఖ్‌నగర్, MG-B, పరేడ్ గ్రౌండ్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, ఉప్పల్ వంటి మెట్రో స్టేషన్లలో బస్కింగ్ ఈవెంట్ జరుగుతుంది. 'నగరవాసుల మెట్రో ప్రయాణానికి సంగీతంతో ఆనందాన్ని జత చేయడమే బస్కింగ్ ఉద్దేశమని' అని గోథే–జెంట్రమ్ హై ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ నూరియా వాహనవతి 'సాక్షి'తో చెప్పారు. జాజ్, టాలీవుడ్, రాక్ నుంచి బాలీవుడ్ వరకూ వివిధ సంగీత శైలులు వీనుల విందు చేస్తాయన్నారు. కళాకారులకు ప్రత్యక్షంగా సంగీత ప్రియుల స్పందన తెలియజేయడం ద్వారా ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. సంగీత కళాకారులను 20 గ్రూపులుగా విభజించారు, హైటెక్ సిటీ మెట్రో స్టేషన్‌లో ప్రదర్శన ఇచ్చిన ఏకం బ్యాండ్ గాయకుడు స్లోక రాజు మాటల్లో..చెప్పాలంటే ఇదో వైవిధ్యభరిత అనుభూతి.. బుధవారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ప్రదర్శన అందించిన కలెక్టివ్ సభ్యుడు, సాక్సాఫోన్ వాయించడంలో పేరొందిన జార్జ్ హల్ మాట్లాడుతూ, 'నిజ జీవితంలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ సంగీతం..వాటికి రిలాక్సేషన్ అందిస్తుంది. బస్కింగ్ నగరవాసులకు ఓ వింత అనుభూతి' అని చెప్పారు.



బస్కింగ్‌కి వెల్‌కమ్..

ఎటువంటి ముందస్తు అంచనాలూ లేకుండా ప్రజలకు సంగీత విందును పంచడం మరోవైపు కళాకారులకు ప్రోత్సాహం అందించడం...లక్ష్యాలుగా తొలిసారి నగరంలో బస్కింగ్ ట్రెండ్‌కి నాంది పలికాం. పాశ్చాత్య దేశాల్లో సర్వసాధారణమైన ఈ శైలికి ఈ స్థాయిలో వెల్‌కమ్ చెప్పిన తొలి నగరం మనదే. కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది.

–నూరియా వాహనవతి, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ గోథే–జెంట్రమ్



నాటిదే...నేటికీ...

తోలుబొమ్మల ప్రదర్శనలు లేదా పాము మంత్రగాళ్లు వంటి సంప్రదాయ వీధి ప్రదర్శనలు భారతీయ సంస్కృతిలో ఒక భాగం , అయితే అలాంటి కళారూపాలు కనుమరుగయ్యాయి. మరికొన్ని అరుదైపోయాయి. ఈ నేపథ్యంలో బస్కింగ్ పేరిట ఔత్సాహిక కళాకారుల్ని ప్రోత్సహించే ఆధునిక సంస్కృతి నగరానికి పరిచయం కావడం ఆహ్వానించదగ్గ పరిణామమే..

ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉందాం

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం




గురువారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ''మన కార్యకర్తలు కష్టాల్లోనూ, నష్టాల్లోనూ మనతోనే నిలబడ్డారు. జెండాలు మోసి కష్టపడ్డారు. మనకు ఓట్లు వేసి దెబ్బలు కూడా తిన్నారు. ప్రతి కార్యకర్తకూ తోడుగా నిలిచి భరోసా ఇద్దాం''అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ స్థానాలకు పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. సోషల్ మీడియా కార్యకర్తలను, మన కోసం నిలబడ్డ వలంటీర్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో మన పార్టీ జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలని, వారికి తోడుగా ఉండాలని ఆదేశించారు. ''రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ చూడని రీతిలో మన కార్యకర్తలు, సానుభూతిపరులమీద దాడులు చేస్తున్నారు. మనకు ఓటు వేసిన వారి మీద దాడులు చేస్తున్నారు. తీవ్రంగా అవమానించడంతోపాటు ఆస్తులకు నష్టం చేకూరుస్తున్నారు. ప్రాణాలు కోల్పోవడం కూడా కొన్ని చోట్ల చూశాం''అని పేర్కొన్నారు. ''మీ అందరికీ ఒక్కటే చెబుతున్నా.. మీ నియోజక వర్గాలలో కార్యకర్తలకు తోడుగా ఉంటూ పరామర్శించి భరోసా కల్పించండి. సోషల్ మీడియా కార్యకర్తలు, మనకోసం నిలబడ్డ వలంటీర్లకు తోడుగా నిలవాలి. ఇప్పటికే పార్టీ తరఫున ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పార్టీ ఇచ్చే సహాయాన్ని మీరు స్వయంగా అందచేయండి''అని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ''రాబోయే రోజుల్లో నేను కార్యకర్తలను కలుస్తా. నష్టపోయిన ప్రతి కార్యకర్త ఇంటికి వెళ్లి కలసి భరోసానిచ్చే కార్యక్రమం చేస్తా. మా ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అభ్యర్థి మా వద్దకు రాలేదనే మాట అనిపించుకోవద్దు. ప్రతి కార్యకర్తకూ భరోసా కల్పిద్దాం. ఇది అవసరం''అని సూచించారు. ''ఇప్పుడిది కేవలం ఇంటర్వెల్ మాత్రమే. శ్రీకృష్ణుడు తోడుగా ఉన్నా పాండవులకు ఓటమి తప్పలేదు. చివరకు ధర్మం, విశ్వసనీయత, నిజాయితీ తప్పకుండా మనం ధర్మం వైపే ఉన్నాం. విశ్వసనీయతతో రాజకీయాలు చేశాం. ప్రతి ఒక్కరూ అర్జునుడి మాదిరిగా తిరిగి విజయం సాధిస్తారు. ప్రజలను, దేవుడ్ని నమ్ముకున్నాం. ధైర్యంగా అడుగులు వేద్దాం''అంటూ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మేనిఫెస్టో ఎజెండాగా పాలన..

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టో హామీలను 99 శాతం అమలు చేశాం. ప్రతి ఇంటికీ మేనిఫెస్టోతో వెళ్లి ఆశీస్సులు తీసుకుని ఎన్నికలకు వెళ్లాం. ఏకంగా 99 శాతం హామీలను అమలు చేసి తలెత్తుకుని సగర్వంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగాం. ఇన్ని చేశాక వచ్చిన ఫలితాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇన్ని చేసిన తర్వాత, ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చిన తర్వాత కూడా ఇలాంటి ఫలితాలు చూసిన తర్వాత బాధ అనిపించింది. ఫలితాలు చూసిన తర్వాత శకుని, పాచికల కథ గుర్తుకొచ్చింది. శకుని పాచికల మాదిరిగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కానీ ఆధారాలు లేకుండా మాట్లాడలేం.

చంద్రబాబుకు సింగిల్ డిజిట్ చూస్తారు..

ఈరోజుకీ జగన్ అబద్ధాలు చెప్పడు, మోసం చేయడని గర్వంగా చెబుతున్నా. చంద్రబాబు కన్నా మనం ఎక్కువ హామీలిచ్చి ఉంటే బాగుండేదని చాలా మందికి అనిపించవచ్చు కూడా! రాజకీయాల్లో జగన్ ఇంత నిజాయితీగా ఉండడం అవసరమా? అనుకునే వాళ్లూ ఉండొచ్చు! కానీ ఒక్కటే చెబుతున్నా... ఓడిపోయినా ఫర్వాలేదు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం.. ధర్మం, న్యాయం కాదనే జగన్ ఎప్పుడూ నమ్ముతాడు. 2014లో కూడా ఇదే నమ్మా. సాధ్యం కానిది సాధ్యం కాదనే చెప్పాను. చంద్రబాబు వ్యవసాయ రుణాల మాఫీ దగ్గర నుంచి అన్నీ చేస్తానని చెప్పి 2019 నాటికీ చేయకపోవడం వల్ల నాడు ప్రజలు రెట్టించిన ఉత్సాహంతో మనల్ని అధికారంలోకి తీసుకొచ్చారు. మనకు గొప్ప విజయంతో అధికారం ఇచ్చారు. ప్రజలు మళ్లీ అదే చేస్తారు. ప్రజలు మనల్ని ఏ స్థాయిలో ఆశీర్వదిస్తారంటే.. చంద్రబాబు నాయుడికి సింగిల్ డిజిట్ వచ్చే పరిస్థితులు కూడా చూస్తాం. ఇది వాస్తవం.

ప్రజలతో కలసి పోరాటాలు చేద్దాం..

మన సంఖ్యాబలం తక్కువే కాబట్టి అసెంబ్లీలో మనం చేయగలిగేది తక్కువే. స్పీకర్ పదవి చేపట్టనున్న వ్యక్తి మాట్లాడుతున్న మాటలను మనం సోషల్ మీడియాలో చూస్తున్నాం. ఒకరేమో జగన్ ఓడిపోయాడు కానీ.. చనిపోలేదు అని అంటారు. చచ్చేదాకా కొట్టాలి అని ఇంకొకరు అంటారు. ఆ వ్యక్తిని ఇప్పుడు స్పీకర్ పదవిలోకి తీసుకెళ్తున్నారు. ఇలాంటి వ్యక్తుల మధ్య అసెంబ్లీలో మనం ఏదో చేయగలుగుతామనే నమ్మకం లేదు. కానీ చంద్రబాబు పాపాలు పండేకొద్దీ ప్రజలతో కలిసి, ప్రజల మధ్య నిలబడి పోరాటం చేసే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఊపందుకుంటాయి. శిశుపాలుడి పాపాలు పండినట్టుగా చంద్రబాబు నాయుడు పాపాలు వేగంగా పండుతున్నాయి. కాలం గడుస్తున్న కొద్దీ చంద్రబాబుపై ప్రజాగ్రహం, మన పట్ల అభిమానం వ్యక్తం అవుతుంది. మనం మళ్లీ రికార్డు మెజార్టీలతో గెలుస్తాం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



'ఉక్కు'పాతర

విశాఖ స్టీల్ ఆస్తుల అమ్మకాలు షురూ

- అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే బుద్ధిచూపించిన ఎన్‌డీఏ సర్కార్
- ప్లాంట్‌ను దివాలా సంస్థగా ముద్రవేసే ప్రయత్నం
- గత మార్చి 31కి రూ.4,979.15 కోట్ల ప్రతికూల నికర విలువ ఉన్నట్లు వెల్లడి
- మూలధనం సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఓ వైపు కేంద్ర గనుల శాఖ మంత్రి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదని బాహాటంగా చెబుతుంటే.. మరోవైపు ప్లాంట్‌ని నిర్వీర్యంచేసే పనుల్ని చాపకింద నీరులా చేసుకుంటూపోతున్నారు. వర్కింగ్ క్యాపిటల్ కోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే ఎన్‌డీఏ సర్కారు.. స్టీల్‌ప్లాంటుపై 'ఉక్కు'పాదం మోపుతున్నట్టు తెలుస్తోంది. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు విక్రయించి.. దివాలా సంస్థగా చూపించేందుకు కుయుక్తులు పన్నుతున్నట్లు పరిస్థితులను గమనిస్తే అర్థమవుతోంది. మూలధన సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి ఏర్పాట్లుచేయడాన్ని గమనిస్తే ఈ అభిప్రాయం బలపడుతోంది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఉన్న ఖరీదైన భవనాలు, స్టాక్‌యార్డుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) బోర్డు ఆమోదం తెలిపి... తూతూ మంత్రంగా తుది అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

మూలధన సంక్షోభం పేరుతో..

స్టీల్‌ప్లాంట్ బయట నిరర్థకంగా ఉన్న ఆస్తుల అమ్మకానికి సంస్థ యాజమాన్యం రంగం సిద్ధంచేసుకుంటోంది. మూలధన సంక్షోభాన్ని అధిగమిస్తూ.. పూర్తిస్థాయి ప్లాంట్ నిర్వహణ కోసం సొంతంగా నిధులు సమకూర్చుకునేందుకే ఆస్తుల వేలం ప్రక్రియ షురూ చేసింది. ఇటు ప్రజలు.. అటు ఉద్యోగుల ఆందోళనలు.. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ఎన్‌డీఏ ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్ విక్రయించేందుకు ఉన్న అవకాశాలపైనే దృష్టిసారించింది. ఉన్న ఆస్తులన్నింటినీ విక్రయించేసి.. ప్లాంట్ విలువను శూన్యం చేసేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ స్తబ్దుగా ఉన్నా.. తాజాగా విశాఖ ఉక్కు స్థలాల అమ్మకాల వ్యవహారాన్ని మళ్లీ వేగవంతం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో ప్రైవేటీకరణకు కొంత బ్రేక్ పడింది. ఇప్పుడు ప్రభుత్వం మారిన వెంటనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కు తగ్గడంలేదు. నిజానికి.. పరిశ్రమకు ప్రత్యేకంగా గనులు కేటాయించి, ఆర్థిక భరోసా కల్పించి కష్టాల నుంచి గట్టెక్కించొచ్చు. సెయిల్‌లో విలీనం చేయడం మరో పరిష్కారం అని తెలిసినా, కేంద్రం ఆ పని కూడా చేయడంలేదు. ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నా ప్రైవేటీకరణకే మొగ్గ చూపుతూ 'విశాఖ ఉక్కు'ఊపిరి తీసేలా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు తెరపైకి తెచ్చిన ఉక్కు స్థలాల అమ్మకం వ్యవహారాన్ని తాజాగా వేగవంతం చేశారు. ఇందులో భాగంగా.. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్ఐఎన్ఎల్ ఆస్తుల వేలానికి సిద్ధమవుతోంది.

బోర్డు సమావేశంలో వేలం అంశం!

ఇదిలా ఉంటే.. ఇటీవల జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఆస్తుల విక్రయంపై ప్రధాన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విశాఖ స్టీల్ మెటీరియల్స్ నిల్వచేయడానికి హైదరాబాద్, చెన్నైలలో స్టాక్‌యార్డుల ఏర్పాటుకోసం కొనుగోలు చేసిన భూములతో పాటు ముంబై, ఢిల్లీ సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న భవనాల్ని విక్రయించే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ.476.18 కోట్లు ఉంటుందని అధికారులు లెక్కలు కట్టారు. నిరర్థక ఆస్తుల నెపంతో ఆస్తుల మానిటైజేషన్‌కు బోర్డు సూచనప్రాయంగా ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. మరోసారి ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించేందుకు బోర్డు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

కప్పం కడతారా.. కంపెనీ మూసేస్తారా

- లారీకి రూ.వేయి.. నెలకు రూ.1.50 కోట్లు
- యూబీ బీరు కంపెనీకి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ముఠా అల్టిమేటం
- కాదన్నందుకు కంపెనీపై దాడి

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు రెడ్ కార్పెట్ పరుస్తాం అని చెబుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం పారిశ్రామికవేత్తలకు 'రెడ్ బుక్ రాజ్యాంగం'తో తడాఖా చూపిస్తోంది. కొత్త పరిశ్రమల స్థాపన సంగతి తరువాత.. ముందు దశాబ్దాలుగా ఉన్న పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాలంటే కప్పం కట్టాల్సిందేనని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పెద్దలు అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఎన్నికై నెల రోజులు కూడా కాకుండానే స్వయంగా ఎమ్మెల్యేలే రంగంలోకి దిగిపోయారు. కంపెనీలకు కళ్లు బైర్లు కమ్మేలా కప్పం రేట్లు నిర్ణయిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాలంటే నెలకు రూ.1.50 కోట్లు మామూళ్లివ్వాలని జారీ చేసిన అల్టిమేటం.. అందుకు కాదన్నందుకు ఆ కంపెనీపై కూటమి మూకలు విధ్వంసానికి పాల్పడటం ద్వారా వారి ఉద్దేశాన్ని తేటతెల్లం చేశారు.

ప్రతి లారీకీ డబ్బు: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం బంటుపల్లిలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యూబీ బీర్ కంపెనీ ఎన్నో ఏళ్లుగా ఉంది. ఇక్కడ కింగ్ ఫిషర్ బీరు ఉత్పత్తి అవుతుంది. ఆ కంపెనీ బీరు యూనిట్‌ను పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇటీవల ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి గెలుపొందిన బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఇప్పుడు మామూళ్ల వసూలుకు రంగంలోకి దిగారు. బంటుపల్లికి చెందిన ఆయన వర్గీయులు యూబీ కంపెనీ ప్రతినిధులను కలిసి రోజూ లోడింగ్, అన్‌లోడింగ్ వచ్చే లారీకి రూ.వేయి చొప్పున మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. రోజుకు సగటున 500 లారీలు వచ్చి వెళ్తాయి. ఈ లెక్కన రూ.5 లక్షలు మామూళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ లెక్కన నెలకు రూ.1.50 కోట్లు.. ఏడాదికి రూ.18 కోట్లు యూబీ కంపెనీ ఎమ్మెల్యే వర్గానికి మామూళ్ల కింద సమర్పించుకోవాలి. అంత భారీ మొత్తాన్ని ఇవ్వలేమని కంపెనీ ప్రతినిధులు చెప్పడంతో ఈ నెల 15న అర్ధరాత్రి 12.30 గంటలకు ఎమ్మెల్యే ముఠా యూబీ ఫ్యాక్టరీపై దాడి చేసింది. కార్యాలయంలో ఫర్నిచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. అడ్డువచ్చిన కంపెనీ ప్రతినిధులను బూతులు తిడుతూ దాడి చేశారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు జీఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. దాంతో తప్పనిసరై జీఆర్ పురం పోలీసులు ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయులపై ఈ నెల 16వ తేదీ రాత్రి కేసు నమోదు చేశారు. తమ వారిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఎమ్మెల్యే ఈశ్వరరావు తీవ్రంగా పరిగణించారు.

డీల్ సెట్ చేసిన మంత్రి అచ్చెన్న

ఈ వ్యవహారంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జోక్యం చేసుకున్నారు. ఆయన కంపెనీ ప్రతినిధులు, ఎమ్మెల్యే ఈశ్వరరావుతో మాట్లాడారు. కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాలంటే 'ఏం చేయాలో 'చెప్పారు. అచ్చెన్న 'మంత్రం'పని చేసింది. ఎమ్మెల్యే ఈశ్వరరావు వెనుక మంత్రి అచ్చెన్న ఉన్నారన్నది యూబీ కంపెనీ ప్రతినిధులకు అర్థమైంది. టీడీపీ, బీజేపీ కూటమి నేతలు డిమాండ్ చేసిన మామూళ్లు సమర్పించుకుంటే తప్ప ఉత్పత్తి ప్రారంభించలేమని స్పష్టంగా తెలిసిపోయింది. దాంతో యూబీ కంపెనీ ప్రతినిధులు బంటుపల్లి ముఠా డిమాండ్ చేసిన మేరకు మామూళ్లు ఇచ్చేందుకు సమ్మతించి తిరిగి వచ్చినట్లు ఆ కంపెనీ వర్గాలే చెబుతున్నాయి.



ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావుతో చర్చలు జరుపుతున్న యూబీ కంపెనీ ప్రతినిధులు

కాంగ్రెస్ పార్టీ మాదిగలను దూరం చేసుకుంది

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



లక్డీకాపూల్ (హైదరాబాద్): తెలంగాణలో బీజేపీ ఓటు బ్యాంక్ పెరగడానికి పరోక్షంగా సహకరించింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రేవంత్ వైఖరితో కాంగ్రెస్ పార్టీ మాదిగలు, బీసీలను దూరం చేసుకుందన్నారు. గురువారం ఆయన సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకపోవడం వల్లే కాంగ్రెస్ మీద వ్యతిరేకత పెరిగిందన్నారు. ఫలితంగా బీజేపీ ఓటు శాతం 21కి పెరిగిందన్నారు. తెలంగాణలో బీజేపీకి ఎమ్మార్పీఎస్ మిత్రపక్షంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్రంలో మాదిగలకు పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్ ఎంపీ స్థానాలలో ఒక్కటి కూడా ఇవ్వకపోవడం ద్రోహమని మాదిగలు గ్రహించారన్నారు. ఇప్పటికైనా మాదిగలను దూరం చేసుకోవడంవల్ల పార్టీకి జరగబోయే నష్టాన్ని గుర్తించకపోతే అందుకు రేవంత్‌రెడ్డే బాధ్యుడవుతారన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు జూలై 7న వస్తుందని ఆశిస్తున్నట్టు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అంశంపై బీసీ సంఘాలన్నిటితో కలిసి పని చేస్తామని.. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బుంజూరు విజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహిళపై అమానుష దాడి

- వివస్త్రను చేసి ఒంటిపై కారం చల్లిన ఇద్దరు
- డీజిల్ మంటతో ఒంటిపై విచక్షణారహితంగా వాతలు
- నలుగురిపై కేసు నమోదు



చికిత్స పొందుతున్న ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, నాగర్‌కర్నూల్: చెంచు మహిళను వివస్త్రను చేసి అమానుషంగా దాడి చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు దంపతులు కాట్రాజు ఈశ్వరమ్మ–ఈదన్నలకు గ్రామంలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్ ఈ భూమిని కౌలుకు తీసుకున్నాడు. వ్యవసాయ పనులతోపాటు సమీపంలోని ఇసుక ఫిల్టర్ వద్ద పనినిమిత్తం ఈశ్వరమ్మ–ఈదన్న దంపతులు వెంకటేశ్ వద్ద జీతం ఉంటున్నారు. వారం రోజుల కిందట ఈశ్వరమ్మ భర్తతో గొడవపడింది. ఆ తర్వాత మండల పరిధిలోని చుక్కాయిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నెల 18వ తేదీన ఈశ్వరమ్మ కోసం బండి వెంకటేశ్ తన సోదరుడితో కలసి బైక్‌పై చుక్కాయిపల్లికి వెళ్లాడు. ఆమెను అదే బైక్‌పై మొలచింతలపల్లికి తీసుకొచ్చేందుకు తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో ఎల్లూరు శివారులో బైక్ ఆపాడు. పనులు ఎగ్గొట్టి పారిపోతావా అని ఆగ్రహిస్తూ ఈశ్వరమ్మను బైక్ నుంచి దింపాడు. అనంతరం కర్రతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఇంటికి తీసుకొచ్చిన తర్వాత కూడా ఆమెను వివస్త్రను చేసి కారంతో కళ్లలో, సున్నిత అవయవాల(జననాంగాలు)పై దాడి చేశారు. కర్రకు ఓ వస్త్రాన్ని చుట్టి డీజిల్‌తో మంట పెట్టి ఒంటిపై విచక్షణారహితంగా వాతలు పెట్టారు. మరుసటి రోజు ఉదయం బడి పిల్లల ఎన్‌రోల్‌మెంట్ కోసం ఆదివాసీ లిటరిటీ కౌన్సిల్(ఎన్ఏఎస్‌సీ) ప్రతినిధులు ఆ గ్రామానికి వచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బుధవారం సాయంత్రం ఏఎస్పీ రామేశ్వర్‌ను కలసి వారు ఫిర్యాదు చేశారు. కొందరు తమ భూములను కూడా బలవంతంగా తీసుకోవడంతో పాటు ఇలా దాడులు చేస్తున్నారని, ఈశ్వరమ్మపై జరిగిన దాడి సభ్యసమాజం తలదించుకునేలా ఉందని చెంచుసంఘం నాయకులు వాపోయారు. ఈశ్వరమ్మపై దాడి చేసిన ఘటనకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బండి వెంకటేష్, ఆయన భార్య శివమ్మ, లింగస్వామి, లక్ష్మి దాడి చేసినట్టు తేలిందని, వీరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కాగా బాధితురాలు నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

బాధితురాలికి అండగా ఉంటాం: జూపల్లి

చెంచు మహిళపై జరిగిన అమానుష దాడి పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు విచారం వ్యక్తం చేశారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌కు ఫోన్ చేసి కేసు దర్యాప్తుపై ఆరా తీశారు. అమానుషంగా ప్రవర్తించిన వ్యక్తులపై వెంటనే విచారణ చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రమాణాలతో వైద్య విద్యను అందిస్తున్నాం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రమాణాలతో కూడిన విద్య వైద్యను అందిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్ రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల శారీరక ఎదుగుదలకు డీవార్మింగ్ టాబ్లెట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, విద్య, వైద్యానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు స్వయంగా డీవార్మింగ్ టాబ్లెట్లను మంత్రులు దామోదర, పొన్నం ప్రభాకర్ వేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 95 లక్షల ఆల్బెండజోల్ మాత్రలను అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19వ సంవత్సరాల వయసు గల పిల్లలకు అందిస్తున్నామన్నారు. గురువారం నుంచి జూన్ 27 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యం కోసం యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని, మన పూర్వీకులు ఆరోగ్యం కోసం యోగాను వారసత్వంగా అందించారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు దానం నాగేందర్, రాజ్‌భవన్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, వాకాటి కరుణ, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

సమగ్ర కులసర్వే పేరుతో బీసీలపై కుట్ర

వచ్చే నెల 15న చలో సచివాలయానికి బీసీ కులసంఘాల పిలుపు

సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులసర్వే అనేది బీసీలపై జరుగుతున్న కుట్ర అని జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం సమగ్ర కులసర్వే పేరిట కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోందని, బీసీల గొంతు కోయాలని చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే జూలై 15న బీసీ కుల సంఘాలతో చలో సచివాలయం నిర్వహించనున్నట్టు ప్రకటించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 సీట్లలో గెలుస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధీమా

- భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో అధికారంలోకి బీజేపీ
- పార్టీ కార్యకర్తలకు శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నా
- కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సన్మానం
- భాగ్యలక్ష్మి ఆలయాన్ని 'గోల్డెన్ టెంపుల్'గా మారుస్తామన్న బండి సంజయ్



భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 88 సీట్లలో గెలిచి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శ్రీభాగ్యలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 36 శాతం ఓట్లు సాధించి బీజేపీ సత్తా చాటిందని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీ అభ్యర్థుల తరఫున, విజయం సాధించిన 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీల తరఫున పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కార్యకర్తలకు శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నానన్నారు. గురువారం రాత్రి నాంపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద 'సెల్యూట్ తెలంగాణ'పేరిట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం, కృతజ్ఞతా సభను నిర్వహించారు. అంతకు ముందు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి నాంపల్లి పార్టీ కార్యాలయం వరకు నగరంలోని ప్రధాన వీధుల మీదుగా దాదాపు మూడు గంటల పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం జరిగిన సన్మాన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేయాలి

అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భగ భగమండిన ఎండల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి, అంకితభావంతో విజయం కోసం కృషి చేశారంటూ కిషన్‌రెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో కూడా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ జెండా చేతబూని, గ్రామగ్రామాన అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేస్తూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో పనిచేస్తాం: కె.లక్ష్మణ్

తొలుత బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..పలువురు నేతల త్యాగాల పునాదులపై పార్టీ నిలబడిందని చెప్పారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు.. అందరం సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా పార్టీ కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తలకు నిజమైన నివాళి అందిస్తామని అన్నారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఘనంగా సన్మానం

పార్టీ కార్యాలయంలో పండిట్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. తొలుత కె.లక్ష్మణ్‌ను కిషన్‌రెడ్డి, ఆ తర్వాత కిషన్ రెడ్డిని లక్ష్మణ్ సన్మానించారు. అనంతరం బండి సంజయ్‌ను కిషన్‌రెడ్డి సత్కరించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గొడెం నగేష్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కిషన్‌రెడ్డి, సంజయ్‌లు కలిసి ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, కాటిపల్లి వెంకట రమణారెడ్డిలను సత్కరించారు.

అమ్మవారి దయవల్లే గెలుపు: బండి

గురువారం రాత్రి చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఇతర నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ అమ్మవారి దేవాలయాన్ని 'గోల్డెన్ టెంపుల్'గా మారుస్తామని ప్రకటించారు. భాగ్యలక్ష్మీ అమ్మవారు చాలా పవర్ ఫుల్ అని, అమ్మవారి దయవల్లే ఆనాడు ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతమైందని అన్నారు. ఈ రోజు బీజేపీ తెలంగాణలో 8 ఎంపీ సీట్లు గెలిచిందని చెప్పారు. ఈ విషయంలో కార్యకర్తల కష్టం మరువలేనిదన్నారు. కార్యకర్తలతో పాటు బీజేపీపై నమ్మకం ఉంచిన తెలంగాణ ప్రజలందరికీ ఇదే నా సెల్యూట్ అని చెప్పారు. ఒకప్పటి సామాన్య కార్యకర్తలు ఇప్పుడు కేంద్ర మంత్రులుగా ఉండటం ఒక్క బీజేపీలోనే సాధ్యమని సంజయ్ అన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి:ఆర్.కృష్ణయ్య



కవాడిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరుతూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద గురువారం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేశ్, నిరుద్యోగ వేదిక నాయకులు అశోక్, అన్వర్ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ధర్నాకు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా, మండలాలు, మున్సిపాలిటీలకు అవసరమైన కొత్త పోస్టులను మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్–2, 3 లలో 5వేల పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేయాలని, 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు.





ఫ్యాషన్

యోగా చేయడానికి సౌకర్యవంతమైన ప్రదేశం మాత్రమే కాదు
అనువైన దుస్తులు ఉండటం కూడా అవసరం.
నవతరం అభిరుచికి తగినట్టు ఇటీవల యోగా వేర్ కొత్తగా రూపుదిద్దుకుంటోంది.
ముఖ్యంగా నేతన్నలు చరఖాతో దారం వడికి
మగ్గంపై నేసిన కాటన్‌తో తయారైన యోగా వేర్‌కి డిమాండ్ పెరుగుతోంది.
మేనికి హాయిగొలిపేలా సౌకర్యంగా, వదులుగా ఉండే దుస్తుల డిజైన్లే యోగా వేర్‌లో కీలకమైన అంశాలు.
యోగా డే సందర్భంగా సౌకర్యవంతమైన హంగులను
మనమూ సొంతం చేసుకుందాం..

యోగా... మరింత సౌకర్యంగా!





కాటన్ స్మోక్డ్ వెయిస్ట్ క్రాప్ టాప్ బాటమ్‌గా బ్లాక్ హారమ్ ప్యాంట్ ధరించడంతో క్రీడాకారిణి లుక్ వచ్చేస్తుంది.

•••

ఆర్గానిక్ కాటన్‌తో డిజైన్ చేసిన ప్రింటెడ్ క్రాప్ టాప్, హారమ్ ప్యాంట్ ఇది.

•••

మిడ్ లెంగ్త్ స్లీవ్స్ కాటన్ టాప్, సైడ్ పాకెట్స్ ఉన్న కాటన్ ప్యాంట్‌తో యోగా కదలికలలో సౌకర్యంగా ఉంటుంది.

•••

కాటన్ షార్ట్ కుర్తీ లేదా క్రాప్ టాప్స్‌ని ధోతీ ప్యాంట్‌తో జత చేస్తే యోగ సాధనలో సౌకర్యవంతమైన సంప్రదాయ శైలి కనిపిస్తుంది.

•••

కాటన్ బెల్టెడ్ టాప్‌కి, పెన్సిల్ కట్ ప్యాంట్ యోగావేర్‌లో స్మార్ట్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.

•••

యోగా వేర్‌లో జంప్‌సూట్ డిజైన్స్ సౌకర్యాన్ని ఇస్తాయి.

పర్యావరణ స్పృహ, వ్యక్తిగత శైలి, సౌకర్యం.. వీటిని దృష్టిలో పెట్టుకుని యోగా డ్రెస్ డిజైన్స్‌ని మెరుగుపరచవచ్చు. ● యోగా సాధనలో సౌకర్యవంతంగా, పర్యావరణ స్పృహని కలిగించే సంప్రదాయ యోగా డ్రెస్సులను ఎంచుకోవచ్చు. వీటికి ఆధునిక డిజైన్స్‌నీ కలపవచ్చు. ● లేత రంగులు. ప్లెయిన్‌గా ఉండే చేనేత వస్త్రాలు యోగా చేయడానికి సౌకర్యంతోపాటు హుందాతనాన్నీ పరిచయం చేస్తాయి. ● నడుము దగ్గర కాటన్ బెల్ట్, కాలి మడమల దగ్గర ప్రత్యేకమైన డిజైన్‌ని జోడించడం ద్వారా యోగా డ్రెస్సులను ఆకర్షణీయంగా మార్చేయవచ్చు. ● యోగాలో సౌకర్యం చాలా ముఖ్యమైనది. శ్వాసక్రియకు పర్యావరణ అనుకూలమైన దుస్తులను ఎంచుకుంటే ఫ్యాషన్‌గానే కనిపిస్తాం. శరీర కదలికలకు తగినట్టు డ్రెస్ కూడా ఉండాలి. మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా సహజ రంగులను ఉంచుకోవాలి. ● స్టైల్‌గా ఉండాలనుకుంటే హై వెయిస్టెడ్ ప్యాంట్స్, ర్యాప్‌టాప్‌ల వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి. ●హైవెయిస్ట్ లెగ్గింగ్స్, క్రాప్‌టాప్స్, స్పోర్ట్స్ బ్రాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ● హెయిర్ హెడ్ బ్యాండ్స్, సన్నని బ్రాస్‌లెట్స్, స్టడ్స్ లేదా చెవి పోగులు వంటి తేలికైన ఆభరణాలను ధరించాలి. ●పార్క్ లేదా యోగా క్లాసులకు వెళ్లేటప్పుడు వెంట ఆర్గానిక్ కాటన్ లేదా రీ సైకిల్ చేసిన బ్యాగ్‌లో యోగాకు ఉపయోగించే మ్యాట్‌ను, వాటర్ బాటిల్‌నూ వెంట తీసుకెళ్లవచ్చు. ● యోగా ప్రయోజనాన్ని ఆనంద దాయకంగా మార్చుకోవాలంటే మాత్రం మీ అభ్యాసం ముఖ్యమైనది.



బాదం! నానబెట్టండి... బాణలి పెట్టండి!!

వంటిల్లు

బాదం ఆరోగ్యానికి మంచిది.
నిజమే... రోజూ పది బాదం పప్పులు తినాలి.
అదీ నిజమే... కానీ మర్చిపోతుంటాం.
బాదం ఖీర్... బాదం మిల్క్ తాగడమూ మంచిదే.
రోజూ తియ్యగా తాగలేం. మరేం చేద్దాం?
బాదం రుచిని కొంచెం కారంగా ఎంజాయ్ చేస్తే! చాలా బాగుంటుంది.
ఒక మసాలా కర్రీ... ఓ సీఖా...మరో టిక్కా!
మన వంటింట్లో ఈ వారం ఇలా ట్రై చేద్దాం.
'బాదం ధర తెలుసా' అని అడక్కండి. మటన్ ధర కంటే తక్కువే.
పైగా మనం వీటికోసం వాడేది కిలోల్లో కాదు... గ్రాముల్లోనే.

నద్రు ఔర్ బాదం కీ సీఖా



కావలసినవి: బాదం పప్పులు– 80 గ్రాములు (పలుచగా తరగాలి); తామర తూడు – 300 గ్రాములు; పచ్చిమిర్చి – 4; అల్లం – 5 గ్రాములు; వెల్లుల్లి – 10 గ్రాములు; శనగపిండి – 30 గ్రాములు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; బంగాళదుంప– 1 (మీడియం సైజు); చీజ్ – 50 గ్రాములు (తురమాలి); యాలకుల పొడి – పావు టీ స్పూన్; జాపత్రి – పావు టీ స్పూన్ ; ఉల్లిపాయలు – 2 (తరగాలి) ; కోవా – టేబుల్ స్పూన్ ; కుంకుమ పువ్వు – ఆరు రేకలు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు

తయారీ: ● తామర తూడును శుభ్రంగా కడిగి తరిగి మరుగుతున్న నీటిలో వేసి నాలుగైదు నిమిషాల తర్వాత తీసి నీరు కారిపోయేటట్లు చిల్లుల పాత్రలో వేసి పక్కన పెట్టాలి ● బంగాళదుంపను ఉడికించి పొట్టు వలిచి, చిదిమి పక్కన పెట్టాలి ● కుంకుమ పువ్వును పావు కప్పు గోరువెచ్చటి నీటిలో నానబెట్టాలి ● అల్లం, వెల్లుల్లిని సన్నగా తరిగి పక్కన పెట్టాలి ● శనగపిండి నూనె లేని బాణలిలో పచ్చి వాసన పోయే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు బాణలిలో టేబుల్ స్పూన్ నూనె వేసి తామర తూడులను గోధుమరంగులోకి వచ్చే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో చీజ్ తురుము, ఉడికించిన బంగాళదుంప, ఉప్పు, యాలకుల పొడి, జాపత్రి పొడి, అల్లం ముక్కలు, వెల్లుల్లి ముక్కలు, శనగపిండి, కుంకుమ పువ్వు కలిపిన నీటిని వేయాలి. బంగాళదుంప, కోవా, ఉల్లిపాయ ముక్కలు వేయాలి ● తామర తూడు ముక్కలు చల్లారిన తర్వాత మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి పై దినుసులున్న పాత్రలో వేసి అన్నీ సమంగా కలిసేటట్లు ముద్దగా కలపాలి ● ఈ మిశ్రమాన్ని పెద్ద గోళీలుగా చేసుకుని అరచేతిలో వేసి పొడవుగా చేయాలి. మనకు కావల్సిన సైజులో కబాబ్‌లుగా కట్ చేసుకోవాలి ● బాదం పలుకులను ఒక ప్లేట్‌లో వేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక్కో కబాబ్‌ని బాదం పలుకులలో అద్ది పక్కన పెట్టాలి. ఇలా అంతటినీ చేసుకోవాలి ● పైన తామర తూడు వేయించిన బాణలిలోనే మరో టేబుల్ స్పూన్ నూనె వేడి చేసి ఒక్కో కబాబ్‌ని పెట్టి మీడియం కంటే తక్కువ మంట మీద ఉంచాలి. కొంతసేపటికి కబాబ్ ఒకవైపు కాలి గోధుమరంగులోకి మారుతుంది. అప్పుడు జాగ్రత్తగా తిప్పుతూ అన్నివైపులా దోరగా కాలేవరకు ఉంచాలి. ఇలాగే అన్నింటినీ కాల్చుకోవాలి. వీటికి పుదీన చట్నీ మంచి కాంబినేషన్.

చనా మసాలా ఆల్మండ్



కావలసినవి: బాదం పప్పులు– 50 గ్రాములు (నానబెట్టి పొట్టు తీయాలి); ఉల్లిపాయ –1 (తరగాలి); అల్లం – అంగుళం ముక్క (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి తరుగు – టీ స్పూన్; ఆలివ్ ఆయిల్ – టేబుల్ స్పూన్; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క ; చనా మసాలా – టేబుల్ స్పూన్ ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి వేయాలి. అవి వేగేటప్పుడు దాల్చిన చెక్క, చనా మసాలా, ఉప్పు వేసి కలుపుతూ వేయించాలి. చివరగా బాదంపప్పులు వేసి కలిపి వేడెక్కి వేగుతుండగా స్టవ్ ఆపేయాలి. ఇది రోటీలోకి రుచిగా ఉంటుంది. గ్రేవీ కావాలంటే చివరగా అర కప్పు నీటిని పోసి, చిటికెడు ఉప్పు కలపాలి. కూర ఉడకడం మొదలైన తర్వాత చిక్కదనం చూసుకుని దించేయాలి.



పనీర్ బాదమ్ టిక్కీ



కావలసినవి: పనీర్– 2 కప్పులు;బాదం పలుకులు – అర కప్పు; ఉడికించిన బంగాళదుంప – అర కప్పు ; నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; జీలకర్ర– టీ స్పూన్ ; పచ్చిమిర్చి తరుగు – 2 టీ స్పూన్‌లు ; అల్లం తరుగు – 2 టీ స్పూన్‌లు ; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; కార్న్‌ఫ్లోర్ – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్

తయారీ: ● పనీర్‌ను ఒక పాత్రలో వేసి పొడిపొడిగా చిదమాలి. ఇందులో ఉడికించిన బంగాళదుంప ముక్కలు వేసి సమంగా కలిసేటట్లు చిదమాలి ● బాణలిలో టీ స్పూన్ నూనె వేసి అందులో జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు వేసి వేగిన తర్వాత పైన పనీర్, బంగాళదుంప మిశ్రమంలో వేయాలి. అదే బాణలిలో మిగిలిన నూనెలో మిరప్పొడి, ఉప్పు వేసి వేడెక్కిన తర్వాత స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తర్వాత అందులో మొక్కజొన్న పిండి, కొత్తిమీర తరుగు వేయాలి. ఇందులో పనీర్ మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని పెద్ద గోళీలుగా చేసుకుని అరచేతిలో వేసి ఫొటోలో కనిపిస్తున్నట్లు ప్యాటీలుగా వత్తాలి. వత్తిన ప్యాటీలను బాదం పలుకులున్న ప్లేట్‌లో అద్దాలి ● అడుగు వెడల్పుగా ఉన్న బాణలిలో మిగిలిన నూనె వేడి చేసి ఒక్కో ప్యాటీని ఒకదాని పక్కన ఒకటిగా అమర్చాలి. ఒకవైపు కాలిన తర్వాత జాగ్రత్తగా తిరగేసి రెండవ వైపు కూడా కాలనివ్వాలి. లోపల చక్కగా ఉడికి పైన కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. వీటిని వేడిగా ఉండగానే కెచప్ లేదా సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

న్యూస్ మేకర్

వచ్చే నెలలో పారిస్ ఒలింపిక్స్.
అన్ని దేశాల ఆటగాళ్లే కాదు
మీడియా ఫొటోగ్రాఫర్లు కూడా
కెమెరాలతో బయలుదేరుతారు.
కాని 'ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ' (ఐ.ఓ.సి)
గుర్తింపు పొందిన వారికే
అన్ని మైదానాల్లో ప్రవేశం.
అలాంటి అరుదైన గుర్తింపును పొందిన
మొదటి భారతీయ మహిళా ఫొటోగ్రాఫర్
గీతికా తాలూక్‌దార్.
అస్సాంకు చెందిన స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్
గీతికా తాలూక్‌దార్ పరిచయం.


గీతికా తాలూక్‌దార్

పారిస్ ఒలింపిక్స్‌కు మన ఫొటోగ్రాఫర్

'స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్‌ని ఎంచుకోవడానికి స్త్రీలు పెద్దగా ముందుకు రారు. ఎందుకంటే అది మగవాళ్ల రంగం చాలా రోజులుగా. అక్కడ చాలా సవాళ్లు ఉంటాయి. నేను వాటన్నింటినీ అధిగమించి ఇవాళ గొప్ప గుర్తింపు పొందగలిగాను' అని సంతోషం వ్యక్తం చేసింది గీతికా తాలూక్‌దార్. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకూ పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ పోటీల్లో ఫొటోలు తీయడానికి ఆమెకు అక్రిడిటేషన్ లభించింది. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటి (ఐ.ఓ.సి) చాలా తక్కువ మంది ఫొటోగ్రాఫర్లకు మాత్రమే ఒలింపిక్స్‌ను కవర్ చేసే అధికారిక గుర్తింపు ఇస్తుంది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా అతి కొద్దిమంది మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్లు ఈ గుర్తింపు పొందితే మన దేశం నుంచి మొదటి, ఏకైక మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా గీతికా తాలూక్‌దార్ చరిత్ర సృష్టించింది.

ఫ్రీ లాన్సర్‌గా...

'స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్ అంటే విస్తృతంగా పర్యటించాలి. సంస్థలో ఉద్యోగిగా ఉన్నప్పుడు సంస్థలు ఒక్కోసారి అనుమతిస్తాయి, మరోసారి అనుమతించవు. అందుకని నేను ఫ్రీలాన్సర్‌గా మారాను. స్వేచ్ఛ పొందాను. నా సేవలు కావాల్సిన సంస్థలు నన్ను సంప్రదిస్తాయి' అంది గీతిక. ఫ్రీ లాన్సర్‌గా ఉంటూనే ఆమె ఇంకా చదువు కొనసాగించింది. కొలంబోలో డిప్లమా కోర్సు చేసింది. అలాగే సౌత్ కొరియా స్పోర్ట్స్ మినిస్ట్రీ వారి స్కాలర్‌షిప్ పొంది సియోల్ నేషనల్ యూనివర్సిటీ నుంచి స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. 'కొలంబోలో చదువుకునే సమయంలో సర్ రిచర్డ్ హ్యాడ్లీని ఇంటర్వ్యూ చేయడం గొప్ప అనుభవం. అక్కడ ఆయన పేద పిల్లలకు క్రికెట్ నేర్పేందుకు అకాడెమీ నిర్వహిస్తున్నారు. నేను వెళ్లిన రోజు బాల్ ఎలా విసరాలో నేర్పుతున్నారు. నేను ఇంటర్వ్యూ అడిగితే ఇచ్చారు' అని చెప్పింది గీతిక.

'టీ సిటీ' అమ్మాయి

అస్సాంలోని డూమ్‌డుమా పట్టణాన్ని అందరూ 'టీ సిటీ' అని పిలుస్తారు. ఎందుకంటే అక్కడ తేయాకు తోటలు విస్తారం. హిందూస్తాన్ లీవర్ టీ ఎస్టేట్ అక్కడే ఉంది. ఆ ఊళ్లో చిన్న ఉద్యోగి కుమార్తె అయిన గీతిక చిన్నప్పటి నుంచి కెమెరాతో ప్రేమలో పడింది. అందుకు కారణం ఆమె మేనమామ చంద్ర తాలూక్‌దార్ ఫిల్మ్‌మేకర్‌గా గుర్తింపు పొందడం. అతను కెమెరాలో నుంచి చూస్తూ రకరకాల దృశ్యాలను అందంగా బంధించడాన్ని బాల్యంలో గమనించిన గీతిక తాను కూడా అలాగే చేయాలనుకుంది. పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చేశాక మాస్ కమ్యూనికేషన్‌లో డిప్లొమా చేసింది. క్రీడలంటే ఆసక్తి ఉండటంతో స్పోర్ట్స్ జర్నలిస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా మారి 2005 నుంచి డీఎన్‌ఏ, జీజీసీ, ఇండియా టుడే, పీటీఐ వంటి సంస్థలతో పనిచేసింది.

కోవిడ్ రిస్క్ ఉన్నా...

ప్రపంచంలో ఎక్కడ భారీ క్రీడా వేడుకలు జరుగుతుంటే అక్కడ ప్రత్యక్షమవుతుంది గీతిక. ఆస్ట్రేలియా ఫీఫా విమెన్స్ వరల్డ్ కప్, ఖతార్‌లో జరిగిన ఫీఫా వరల్డ్ కప్ పోటీలను ఆమె కవర్ చేసింది. 2020 సియోల్ ఒలింపిక్స్‌కు కోవిడ్ కారణంగా చాలా మంది అక్రిడిటెడ్ ఫొటో జర్నలిస్టులు వెళ్లడానికి భయపడ్డారు. కాని అక్రిడిటేషన్ లేకున్నా గీతిక అక్కడకు వెళ్లి ప్రాణాలకు తెగించి ఫొటోలు తీసి గుర్తింపు పొందింది. తన వృత్తి పట్ల ఆమెకు ఉన్న ఈ అంకిత భావాన్నే ఒలింపిక్స్ కమిటీ గుర్తించింది. అందుకే ఈసారి అధికారికంగా ఆహ్వానం పలికింది. జూలై 23న పారిస్ బయలుదేరి వెళ్లనుంది గీతిక. 'గేమ్స్ వైడ్ ఓపెన్' అనేది ఈసారి ఒలింపిక్స్ థీమ్. మరిన్ని వర్గాలను కలుపుకుని ఈ క్రీడలు జరగాలనేది ఆశయం. తక్కువ గుర్తింపుకు నోచుకునే మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌లను ప్రత్యేకంగా ఆహ్వానించడం కూడా ఈ ఆశయంలో భాగమే. 'నాకొచ్చిన అవకాశం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మరింత కష్టపడి పని చేస్తాను. స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే వారికి క్రమశిక్షణ అవసరం. అంతర్జాతీయ క్రీడాపోటీలు టైముకు మొదలయ్యి టైమ్‌కు ముగుస్తాయి. వాటిని అందుకోవాలంటే క్రీడల్లోని ఉత్తమ క్షణాలను కెమెరాలో బంధించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణ చాలా అవసరం. అవి ఉన్నవారు ఈ రంగంలో నిస్సందేహంగా రాణిస్తారు' అంటోంది గీతిక.

నేడు వరల్డ్ మ్యూజిక్ డే

యువర్స్

రాగాల రారాజు



తొలి ఆల్బమ్‌తోనే వేలాది అభిమానులను సంపాదించుకున్నాడు ఢిల్లీకి చెందిన అర్పణ్ కుమార్ చందెల్. మల్టీపుల్ సూపర్-హిట్ ఆల్బమ్‌లతో అభిమానుల చేత 'కింగ్' అనిపించుకున్నాడు. స్వరరచనలోనే కాదు పాటల రచనలోనూ భేష్ అనిపించుకున్నాడు. చిన్న వయసులోనే పెద్ద మ్యూజిక్ కంపెనీలతో కలిసి పని చేసిన 'కింగ్' 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా' జాబితాలో చోటు సంపాదించాడు....

పాపులర్ ర్యాప్ రియాలిటీ షో 'హసల్'తో తొలి గుర్తింపు పొందాడు అర్పణ్ కుమార్ చందెల్. 'టాప్ 5'లో ఒకరిగా చోటు సంపాదించాడు. ఆ తరువాత 'హసల్ 2.వో'లో స్క్వాడ్ బాస్‌గా మరింత పేరు తెచ్చుకున్నాడు.

'వివిధ రంగాలలో విజేతలుగా నిలిచిన వ్యక్తుల గురించి తెలుసుకోవడం నాకు ఇష్టం. వారి గురించి చదివినప్పుడల్లా ఎంతో ఉత్తేజకరంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం అంటే నాకు ఇష్టం' అంటున్న అర్పణ్ ఢిల్లీలోని సాధారణ కుటుంబనేపథ్యం నుంచి వచ్చాడు.

మొదట్లో ఫుట్‌బాల్ ఆటను బాగా ఆడేవాడు. ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరు తెచ్చుకోవాలనుకున్నాడు.

అయితే 'ఆట' నుంచి 'పాట' వైపు అతని మనసు మళ్లింది. సంగీతంపై ఆసక్తి అంతకంతకూ పెరగడం మొదలైంది. మ్యూజిక్ పట్ల తన ఆసక్తి, ప్రయోగాలకు యూట్యూబ్ వేదిక అయింది. పాటలు రాయడం మొదలు పెట్టాడు. 'చిన్నప్పటి నుంచి నాకు రకరకాల సందేహాలు ఉండేవి. ఆ సందేహాలు, నాలోని ఊహలతో పాటలు రాయడం మొదలుపెట్టాను' అంటాడు అర్పణ్. 'ది కార్నివాల్' 'షాంపైన్ టాక్' 'న్యూ లైఫ్'లాంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్‌లతో సంగీత ప్రపంచంలో సందడి చేసి 'కింగ్'గా పేరు తెచ్చుకున్నాడు అర్పణ్. 'మేరీ జాన్' పాట బిల్‌బోర్డ్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది.

ప్రేమ, భావోద్వేగాలు, జ్ఞాపకాలతో కూడిన ఈ పాట ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శ్రోతలను ఆకట్టుకుంది. 'ప్రతి జెనరేషన్ కనెక్ట్ అయ్యేలా మేరీ జాన్ పాటను రూపొందించాను. ఈ పాటలోని ఒక వాక్యం....నీ నీడలా ఎప్పుడూ నీతో ఉంటాను అనేది యువతరానికి బాగా నచ్చింది' అంటాడు అర్పణ్.

చార్ట్‌బస్టర్ 'తూ ఆఖే దేఖ్‌లే' తనను సంగీతకారుడిగా మరో మెట్టు పైకి ఎక్కించింది.

'నేను చేసిన మంచి పని ఏమిటంటే నాలోని భావాలను కాగితంపై పెట్టడం. వాటికి బాణీ కట్టడం. నాకు తోచినది నేను రాస్తాను. అది శ్రోతలకు నచ్చింది. అందుకే వారు నన్ను కింగ్ అనిపిలుస్తున్నారు. తమ భావాలకు ప్రతినిధిగా చూస్తున్నారు' అంటాడు అర్పణ్.

అర్పణ్ సక్సెస్ మంత్రా ఏమిటి? ఆయన మాటల్లోనే...

'ఓపికగా ఎలా ఉండాలో, ఇతరులతో ఎలా వ్యవహరించాలో.....ఇలా ఎన్నో విషయాలను నా ప్రయాణంలో నేర్చుకున్నాను. నేర్చుకున్నది ఏదీ వృథా పోదు'

నాన్-బాలీవుడ్ హిప్-హాప్ కింగ్‌గా పేరు తెచ్చుకున్న అర్పణ్ కుమార్ చందెల్ ఇప్పుడు బాలీవుడ్ పాటలతోనూ మంచి పేరు తెచ్చుకుంటున్నాడు.

సింపుల్‌గా స్పీడ్‌గా...

'సింపుల్‌గా ఉండాలి, అందరూ కనెక్ట్ అయ్యేలా ఉండాలి' అనుకొని పాట ప్రయాణం మొదలుపెడతాను. నా పాటలు శ్రోతలను ఆకట్టుకోవడానికి ఇదొక కారణం. ఈ పాట ఎవరి గురించో అనుకోవడం కంటే, ఈ పాట నా గురించే అనుకోవడంలో విజయం ఆధారపడి ఉంటుంది. పాట అనేది గాలిలో నుంచి పుట్టదు. దాని వెనుక ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. నా పాటల నుంచి ఇతరులు స్ఫూర్తి పొందితే అంత కంటే కావల్సింది ఏముంది!

– అర్పణ్ కుమార్ చందెల్

● టెక్.. టాక్

ఇన్‌ఫినిక్స్ నోట్ 40 ప్రో ప్లస్

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080×2436 పిక్సెల్స్ కనెక్టివిటీ: 5జీ
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 4600 ఎంఏహెచ్ బరువు: 190 గ్రా.





స్క్రీన్ ఎక్స్‌పాండర్ అండ్ మాగ్నిఫైయర్

బ్రాండ్: పోట్రానిక్స్; మోడల్: పీవోఈఆర్-1899
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 10×3×3 సీఎం 50గ్రా.
కంపెటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్, స్మార్ట్‌ఫోన్

స్నాప్‌చాట్ లెన్స్ స్టూడియో



ఆగ్యుమెంటెడ్ రియాలిటీ(ఏఆర్) ఫీల్డ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ 'స్నాప్‌చాట్' లేటెస్ట్ జెనరేటివ్ ఏఐ టెక్నాలజీని లాంచ్ చేసింది. ఇప్పుడు ఏఐ డెవలపర్‌లు ఏఐ-పవర్డ్ లెన్సెస్‌ను క్రియేట్ చేయవచ్చు. స్నాప్‌చాట్ యూజర్‌లు వాటిని తమ కంటెంట్‌లో ఉపయోగించవచ్చు.

డెవలపర్ ప్రోగ్రామ్ 'లెన్స్ స్టూడియో'కు సంబంధించిన అప్‌గ్రేడెడ్ వెర్షన్ గురించి ప్రకటించింది స్నాప్‌చాట్. దీనితో ఆర్టిస్టులు, డెవలపర్‌లు స్నాప్‌చాట్, వెబ్‌సైట్, యాప్స్ కోసం ఏఆర్ ఫీచర్‌లను క్రియేట్ చేయవచ్చు. ఏఆర్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేయడానికి పట్టే సమయాన్ని వారాల నుంచి గంటలకు తగ్గిస్తుంది లెన్స్ స్టూడియో.

ఆల్-ఇన్-వన్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: సాస్ కలర్: బ్లాక్
మోడల్ నెంబర్: ఎస్‌సీఎంజీబీకె-బీకె5
బరువు: 200 గ్రా. స్పెషల్ ఫీచర్స్: పోర్టబుల్, నాన్-స్లిప్, స్ట్రెచబుల్, ఫోల్డబుల్ లెన్స్ మెటీరియల్: గ్లాస్

● ఇన్నోవేషన్

పర్యావరణ హితం



తండ్రి సైన్యంలో పనిచేస్తుండడంతో ఆకాంక్ష ప్రియదర్శిని బాల్యం దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో గడిచింది. పచ్చదనం అంటే చెప్పలేనంత ఇష్టం. రూర్కెలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ చేసిన ఆకాంక్షకు కాలుష్య సమస్య గురించి ఆందోళనగా ఉండేది. వాయు కాలుష్య ప్రభావంతో తన బంధువులు, కాలేజీ స్నేహితులలో కొందరికి శ్వాసకోశ సమస్యలు రావడం ఆమెను కలవరపరిచింది. వాయు కాలుష్యంకు సంబంధించి ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనాలనే లక్ష్యంతో క్లైమెట్ టెక్ స్టార్టప్ 'ఆరాసుర్' ప్రారంభించింది. ఒడిశాలోని భువనేశ్వర్ కేంద్రంగా ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్ 'ఆరాసుర్' ప్రయాణం మొదలైంది.

వైర్లెస్, సెన్సర్ ఆధారిత సాంకేతిక సహాయంతో ప్రభుత్వం, ప్రజలకు మధ్య ఉన్న సమాచార అంతరాన్ని తగ్గించడానికి కంపెనీ చురుగ్గా పనిచేస్తోంది. హైపర్ -లోకల్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్ అభివృద్ధి చేసింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సందేహాలకు సమాధానం చెప్పడానికి మా హార్డ్‌వేర్ పరికరాల నుంచి సేకరించిన డేటా ఉపయోగపడుతుంది. ఖర్చులు ఎలా తగ్గించుకోవాలి, రెవెన్యూ ఎలా జెనరేట్ చేయాలి....అనే విషయాలకంటే పర్యావరణ విషయాలకే ప్రాధాన్యత ఇచ్చాం' అంటుంది ఆకాంక్ష. హార్డ్‌వేర్ డిజైనింగ్, సప్లైచైన్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్, ఇన్‌స్టాలేషన్...మొదలైన వాటిలో ప్రావీణ్యం సాధించిన ఆకాంక్ష 'మల్టీటాలెంటెడ్'గా గుర్తింపు పొందింది.

● గేమింగ్

ఎవరు వారు ఎచటి వారు... తప్పదిక వార్




డెస్టిని 2 ఫ్రీ-టు-ప్లే ఫస్ట్ పర్సన్ షూటర్ వీడియో గేమ్. పౌరాణిక, సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపొందించిన గేమ్ ఇది. ఒరిజినల్ మాదిరిగానే ఈ గేమ్‌లోని మూమెంట్స్ ప్లేయర్స్ వర్సెస్ ఎన్విరాన్‌మెంట్(పివిఇ), ప్లేయర్ వర్సెస్ ప్లేయర్(పివిపి)గా విభజించబడి ఉంటాయి. 'పివిఇ'లో ఆరు-ప్లేయర్ రైడ్స్ ఉంటాయి.

ప్రతి గమ్యస్థానానికి పెట్రోలింగ్ మోడ్ అందుబాటులో ఉంది. వివిధ గ్రహాంతరవాసుల నుండి మానవ జాతిని రక్షించడానికి ప్లేయర్స్ 'గార్డియన్' పాత్రను పోషించాల్సి ఉంటుంది.

సిరీస్: డెస్టిని ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్, స్టాడియా. ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: ఫస్ట్-పర్సన్ షూటర్, ఎంఎంవోజీ మోడ్: మల్టీ ప్లేయర్

సినిమా

ఆట కాదు సుమా!


● రామ్‌చరణ్

క్రీడాకారుడి పాత్ర చేయడం అంటే ఆట కాదు సుమా అనాలి. ఎందుకంటే ఆ క్రీడ మీద ఎంతో కొంత అవగాహన సంపాదించాలి. అలాగే ఆ క్రీడకు తగ్గట్టుగా శరీరాకృతిని మార్చుకోవాలి. రామ్‌చరణ్ త్వరలో ఈ పని మీదే బిజీ కానున్నారు. బుచ్చిబాబు సన (ఆర్‌సీ 16) దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో చరణ్ కబడ్డీ ప్లేయర్‌గా కనిపించనున్నారని... కాదు రన్నర్‌గా కనిపిస్తారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఏది ఏమైనా క్రీడాకారుడి పాత్రలో కనిపించడం ఖాయం. ఇందుకోసం రామ్‌చరణ్ కండలు పెంచాలనుకుంటున్నారట. ఈ మేకోవర్ కోసం ఆస్ట్రేలియా వెళతారని సమాచారం. అక్కడ దాదాపు రెండు నెలలు శిక్షణ తీసుకుంటారని భోగట్టా. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' చిత్రంలో నటిస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసి, ఆస్ట్రేలియా ప్రయాణమవుతారని తెలిసింది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన 'ఆర్‌సీ 16' షూటింగ్‌ని సెప్టెంబర్ లేదా అక్టోబరులో ఆరంభించేలా యూనిట్ ప్లాన్ చేస్తోందని టాక్. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు.

మాస్ యాక్షన్ షురూ


● రెజీనా, సన్నీ డియోల్, సయామీ ఖేర్

బాలీవుడ్ హీరో సన్నీ డియోల్, టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఓ హిందీ సినిమాకి శ్రీకారం జరిగింది. 'ఎస్‌డీజీఎమ్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రధారులు. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ తొలి స్ట్రయిట్ హిందీ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం జరుపుకుంది. ''మ్యాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. 'క్రాక్, వీరసింహా రెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్‌లను అందించిన గోపీచంద్ మలినేని అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ కూడిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో తొలి హిందీ మూవీ ఇది. మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో సన్నీ డియోల్‌ని చూపించనున్నారు. రేపు రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: తమన్ .ఎస్, కెమెరా: రిషి పంజాబీ.


● నాగ చైతన్య

శ్రీకాకుళంలో తండేల్

శ్రీకాకుళంలో ల్యాండ్ అయింది 'తండేల్' టీమ్. నాగ చైతన్య హీరోగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. 'లవ్‌స్టోరీ' (2021) చిత్రం తర్వాత నాగచైతన్యతో ఈ సినిమా కోసం మళ్లీ జోడీ కట్టారు సాయి పల్లవి. 'ప్రేమమ్' (2016), 'సవ్యసాచి' (2018) చిత్రాల తర్వాత నాగచైతన్యతో దర్శకుడు చందు మొండేటి తెరకెక్కిస్తున్న చిత్రం ఇది. 2018లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సెమీ పీరియాడికల్ ఫిల్మ్‌లో జాలరి రాజు పాత్రలో నాగ చైతన్య, సత్య పాత్రలో సాయి పల్లవి కనిపిస్తారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ శ్రీకాకుళంలో ఆరంభం అయింది. ఈ షెడ్యూల్‌లో నాగ చైతన్య, సాయి పల్లవిపై లవ్, ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారట. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

హైదరాబాద్‌లో మట్కా


● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ మూవీ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ మూవీ తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. దేశమంతటా సంచలనం సృష్టించిన ఓ నిజ జీవిత ఘటన స్ఫూర్తితో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో వినోదంతో పాటు నిజ జీవితంలోని ఘటనలు, హ్యూమన్ ఎమోషన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. 'మట్కా'లో నాలుగు వైవిధ్యమైన పాత్రల్లో కనిపిస్తారు వరుణ్ తేజ్. నలభై రోజుల పాటు జరగనున్న ఈ ముఖ్యమైన షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేక సెట్ నిర్మించాం. ఇందులో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ప్రస్తుతం వరుణ్, నోరా, మీనాక్షీలపై సన్నివేశాలు తీస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి. రవిశంకర్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఎ. కిశోర్ కుమార్.

థ్రిల్లింగ్ కానిస్టేబుల్


● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా రూపొందుతున్న 'ది కానిస్టేబుల్' సినిమా షూటింగ్ పూర్తయింది. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ద్వారా మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. 'బలగం' జగదీష్ నిర్మాత. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''కానిస్టేబుల్ పాత్రలో నటించడం కొత్తగా ఉంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న ఈ మూవీతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తాను'' అన్నారు. ''సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. వరుణ్ సందేశ్ నట విశ్వరూపం ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. ''కానిస్టేబుల్ పాత్రలో వరుణ్ సందేశ్ ఆకట్టుకుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి'' అన్నారు 'బలగం' జగదీష్.

సస్పెన్స్... థ్రిల్


● శ్రీకాంత్, ప్రవీణ్

ప్రవీణ్ కేవీ దర్శకత్వం వహించి, హీరోగా నటించిన చిత్రం 'మహిష'. పృథ్వీ, యశిక, వైష్ణవి, కపిల్, మౌనిక, దీపు ఇతర పాత్రల్లో నటించారు. స్క్రీన్ ప్లే పిక్చర్స్‌పై రూపొందిన ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్, నిర్మాత రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేశారు. ''మహిష' కాన్సెప్ట్ కొత్తగా ఉంది. ప్రేక్షకులు ఇలాంటి చిత్రాలను ఆదరిస్తారు'' అన్నారు శ్రీకాంత్. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. బలమైన కథతో ఈ చిత్రం సాగుతుంది. శ్రీ వెంకట్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. భార్గవీ పిళ్లై, గీతా మాధురి, సాయి చరణ్ పాడిన పాటల్ని శ్రోతలు ఇష్టపడతారు'' అన్నారు ప్రవీణ్ కేవీ.


● ప్రియాంకా చోప్రా

గాయాలు తప్పవు

''వృత్తిపరమైన గాయాలను తప్పించుకోలేం. ముఖ్యంగా యాక్షన్ సినిమాలు చేస్తున్నప్పుడు గాయాలు తప్పవు'' అంటున్నారు ప్రియాంకా చోప్రా. ప్రస్తుతం ఆమె హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'లో నటిస్తున్నారు. ఫ్రాంక్ ఇ. ఫ్లవర్స్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ యాక్షన్ మూవీ షూటింగ్ ఇటీవల ఆస్ట్రేలియాలో ఆరంభమైంది. ఈ చిత్రం కోసం ప్రియాంకా చోప్రా పాల్గొనగా పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఆమె పెదవి, ముక్కు, మెడకు గాయాలు అయ్యాయి. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, 'ప్రొఫెషనల్ లైఫ్‌లో జరిగే ప్రమాదాలు' అంటూ వీడియో పోస్ట్ చేశారు ప్రియాంక. ఇక గాయాలు కాగానే షూటింగ్ ఆపేసి, ఆమెను సిడ్నీలోని ఆస్పత్రికి తీసుకెళ్లిందట యూనిట్. అక్కడ చికిత్స చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్నారట ప్రియాంకా చోప్రా.

రాయలసీమ ప్రేమకథ


● శశికా, ప్రవీణ్

ప్రవీణ్ రాజ్‌కుమార్, శశికా టిక్కో, 'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. సంజయ్ రెడ్డి బంగారపు దర్శకత్వంలో కేఓ రామరాజు నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''రాయలసీమ నేపథ్యంలో వస్తున్న యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. హీరో విశ్వక్ సేన్‌గారు విడుదల చేసిన మా మూవీ ట్రైలర్‌తో సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి మా యూనిట్‌కి విజయం అందించాలి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, కెమెరా: జి. అమర్.

రాజమౌళిగారు నాకు జీవితం ఇచ్చారు


● చిత్రా శుక్లా, దేవ్ గిల్

– దేవ్ గిల్

''నా స్వస్థలం పుణే. ముంబైలో ఉన్న నన్ను 'మగధీర' మూవీ కోసం రాజమౌళిగారు హైదరాబాద్‌కి తీసుకొచ్చి, నాకు జీవితం ఇచ్చారు. రాజమౌళి, రమా రాజమౌళిగార్ల వల్లే ఈ రోజు 'అహో విక్రమార్క'లో హీరోగా నటించి, నిర్మించగలిగాను. ఇందుకు నాకు ఆనందంగా ఉంది'' అని దేవ్ గిల్ అన్నారు. 'మగధీర' చిత్రంలో రామ్‌చరణ్‌కి ప్రతినాయకుడిగా నటించిన దేవ్ గిల్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. ఆయన హీరోగా పేట త్రికోటి దర్శకత్వం వహించిన చిత్రం 'అహో విక్రమార్క'. దేవ్ గిల్ ప్రొడక్షన్స్‌పై దేవ్ గిల్ భార్య ఆర్తి ఈ మూవీ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. దేవ్ గిల్ మాట్లాడుతూ– ''మగధీర' నుంచి తెలుగు ప్రేక్షకులు నాపై ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. నన్ను ఇంతవరకు విలన్‌గా చూశారు. 'అహో విక్రమార్క'తో హీరోగా మీ అందరికీ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను'' అన్నారు. ''మా ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొదటి చిత్రం ఇది. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది... ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఆర్తి. పేట త్రికోటి మాట్లాడుతూ– ''దేవ్ గిల్‌కి పోలీస్ కథ సరిపోతుందని భావించి, ఈ సినిమా తీశాం. తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా చిత్రీకరించాం'' అన్నారు. ''త్రికోటి, దేవ్ గిల్‌గార్లతో పని చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు హీరోయిన్ చిత్రా శుక్లా. నటులు యువరాజ్, ప్రవీణ్ మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	141	77,479
నిఫ్టీ ▲	51	23,567

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,676	▽	180
డోజోన్స్	38,993	▲	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,272	▲	67
డాక్స్	18,254	▲	186
షాంఘై	3,005	▽	12
నికాయ్	38,633	▲	62

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
72,162	▲	458
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,873	▲	456
వెండి (కిలో)		
90,038	▲	1,843

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.73	85.41
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.45	108.40
€	యూరో	భారతీయ	87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	42.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.78	57.63
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.44	64.14
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.86	23.65
¥	చైనా యువాన్	భారతీయ	10.40	12.47

చల్ వాహన రంగా..!



- రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికలు
- ఈవీ, కొత్త టెక్నాలజీలపై కసరత్తు
- అత్యధికంగా మారుతీ రూ. 1.25 లక్షల కోట్లు
- హ్యుందాయ్ రూ. 32,000 కోట్లు,

ప్యాసింజర్ వాహనాలకు (పీవీ) సంబంధించి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మార్కెట్‌గా భారత్ ఎదిగింది. స్పోర్ట్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) వాటా ఇందులో దాదాపు సగం స్థాయిలో ఉంటోంది. దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం 43 లక్షల యూనిట్లుగా ఉన్న పీవీల మార్కెట్ 2030 ఆర్థిక సంవత్సరం నాటికి అరవై లక్షలకు చేరొచ్చని, ఇందులో 20–21 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాలదే (ఈవీ) ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వాహనాల డిమాండ్‌కి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం, పర్యావరణ అనుకూల కొత్త టెక్నాలజీలను వినియోగంలోకి తేవడంపై ఆటోమొబైల్ కంపెనీలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. వచ్చే కొన్నేళ్లలో ఇందుకోసం దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి.

మారుతీ సుజుకీ ఎస్‌యూవీ కేటగిరీలో తొలి ఈవీని గతేడాదే ఆవిష్కరించనున్నట్లు తొలుత ప్రకటించినా అది ఈ ఆర్థిక సంవత్సరానికి వాయిదా పడింది. 2029–30 నాటికి మొత్తం ఆరు ఈవీలను భారత్‌లో ప్రవేశపెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 50 శాతం మార్కెట్ వాటాను తిరిగి దక్కించుకునే క్రమంలో సామర్థ్యాల పెంపు, కొత్త మోడళ్ల అభివృద్ధి మొదలైన వాటిపై 2024–25లో రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సింహభాగం వాటా హరియాణాలోని ఖార్ఖోడా ప్లాంటుపైనే వెచ్చించనుంది. 2025 నాటికి ఇందులో ఉత్పత్తి ప్రారంభం కానుండగా, సంస్థకు ఏటా 2,50,000 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం జత కానుంది. ఎంఎస్ఐఎల్ ప్రస్తుతం గురుగ్రామ్, మానెసర్, హన్సల్‌పూర్ (గుజరాత్) ప్లాంట్లలో ఏటా 23.5 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేస్తోంది. వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు, మోడళ్ల శ్రేణిని 28కి పెంచుకునేందుకు 2030–31 నాటికి రూ. 1.25 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో కంపెనీ ఉంది.

ఈవీలు, ఐసీఈలపై మారుతీ కసరత్తు..

టాటా మోటార్స్ 6 ఈవీలు...

టాటా మోటార్స్ 2030 ఆర్థిక సంవత్సరం నాటికి ఈవీలపై రూ. 16,000–18,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది. ప్రస్తుతం నాలుగు ఎలక్ట్రిక్ కార్ల మోడల్స్ విక్రయిస్తున్న కంపెనీ 2026 మార్చి నాటికి మరో ఆరు ఈవీలను ఆవిష్కరించాలని నిర్దేశించుకుంది. 2030 నాటికి పీవీ మార్కెట్లో 20 శాతం వాటాను లక్ష్యంగా పెట్టుకుంది.

ఎంఅండ్‌ఎం రూ. 12,000 కోట్లు..

ఈవీల విభాగం మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్‌పై వచ్చే మూడేళ్లలో రూ. 12,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రతిపాదనకు ఎంఅండ్‌ఎం బోర్డు ఆమోదముద్ర వేసింది. 2025 తొలి త్రైమాసికంలో కంపెనీ తమ తొలి 'బార్న్ ఈవీ' శ్రేణిని ప్రవేశపెట్టే యోచనలో ఉంది. 2027 నాటికి ఎంఅండ్‌ఎం అమ్మకాల్లో ఈవీల వాటా 20–30% ఉంటుందని అంచనా. 2030 నాటికి తొమ్మిది ఎస్‌యూవీలను, ఏడు బార్న్ ఎలక్ట్రిక్ వాహనాలను, ఏడు తేలికపాటి వాణిజ్య వాహనాలను ప్రవేశపెట్టేందుకు 2024–25 నుంచి 2026–27 మధ్య కాలంలో రూ. 27,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ గతంలో తెలిపింది. ఇందులో ఐసీఈ వాహనాల కోసం రూ. 8,500 కోట్లు వెచ్చించనుంది.

హ్యుందాయ్.. సై..

త్వరలో భారీ పబ్లిక్ ఇష్యూకి వస్తున్న కొరియన్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా కూడా వచ్చే 10 ఏళ్లలో రూ. 32,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. తమిళనాడు ప్లాంటు సామర్థ్యాల పెంపు, విడిభాగాల వ్యవస్థ, ఈవీల తయారీ, చార్జింగ్ మౌలిక సదుపాయాలు మొదలైన వాటిపై రూ. 26,000 కోట్లు, జనరల్ మోటార్స్ నుంచి కొనుగోలు చేసిన తాలేగావ్ ప్లాంటుపై రూ. 6,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది.



లిస్టులో మరిన్ని కంపెనీలు..

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కొత్త తరహా ఎనర్జీ వాహనాలను (ఎన్‌ఈవీ), ఐసీఈ వాహనాలను అభివృద్ధి చేసేందుకు రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉంది.
- కియా ఇండియా 2025లో ప్రత్యేకంగా భారత మార్కెట్ కోసం రూపొందించిన ఈవీని ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉంది.
- ఆరు వాహనాల అభివృద్ధి కోసం భారత్‌లో రూ. 5,300 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు నిస్సాన్, రెనో గతేడాది ప్రకటించాయి. వీటిలో రెండు ఈవీలు కూడా ఉండనున్నాయి.
- ఇక ద్విచక్ర వాహనాలు, ఈవీల కోసం అవసరమయ్యే పరికరాల ఉత్పత్తి కోసం విడిభాగాల తయారీ సంస్థలు వచ్చే మూడు–నాలుగేళ్లలో రూ. 25,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. ఇందులో 45–50 శాతం మొత్తాన్ని బ్యాటరీ సెల్స్ తయారీపై పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.

రూపాయి క్రాష్!

- ఆల్‌టైమ్ కనిష్టం 83.68కి పతనం
- చివరికి 83.61 వద్ద ముగింపు



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో చరిత్రాత్మక కనిష్ట స్థాయి 83.68కి పడిపోయింది. అయితే చివరకు 17 పైసలు నష్టంతో రెండు నెలల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇప్పటి వరకూ ముగింపులో ఇదే చరిత్రాత్మక కనిష్ట స్థాయి కావడం గమనార్హం. దేశీయ ఈక్విటీ మార్కెట్లు చరిత్రాత్మక గరిష్టాలను చూస్తున్నప్పటికీ పశ్చిమాసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు, దీనితో క్రూడ్ ఆయిల్ ధర పెరుగుదల వంటి అంశాలు తాజాగా రూపాయి విలువపై ప్రతికూలత చూపిస్తున్నాయి. బుధవారం పైసా నష్టంతో 83.44 వద్ద ముగిసిన రూపాయి, గురువారం ట్రేడింగ్‌లో 83.43 వద్ద ప్రారంభమైంది. 83.42కు మించి బలపడలేకపోయింది.

దిగ్గజ ఐపీవోలకు ఓకే...

- సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్
- జాబితాలో ఓలా ఎలక్ట్రిక్
- ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు కంపెనీలూ 2023 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి.

రూ. 5,500 కోట్లకు రెడీ

ఐపీవో ద్వారా ఓలా ఎలక్ట్రిక్ రూ. 5,500 కోట్లకు పైగా సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇష్యూ నిధులలో అత్యధిక శాతాన్ని సామర్థ్య విస్తరణ, సెల్ తయారీ ప్లాంట్, ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులకు వినియోగించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా మరో 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. రూ. 1,226 కోట్లు సెల్ తయారీ యూనిట్‌కు, రూ. 1,600 కోట్లు ఆర్‌అండ్‌డీకి, మరో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. ఇక బెయిన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న ఎమ్‌క్యూర్ ఫార్మా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది.

ఆఫీసర్స్ చాయిస్ @ రూ. 267-281

ఆఫీసర్స్ చాయిస్ విస్కీ తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 267–281 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,000 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతే కాకుండా మరో రూ. 500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 53 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-6-2024	
విశాఖ	505–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నిధులు 70 శాతం డౌన్



న్యూఢిల్లీ/జ్యూరిక్: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, భారతీయ సంస్థల నిధులు గతేడాది గణనీయంగా తగ్గాయి. 2022తో పోలిస్తే 2023లో 70 శాతం క్షీణించి నాలుగేళ్ల కనిష్ట స్థాయి 1.04 బిలియన్ స్విస్ ఫ్రాంకులకు (సుమారు రూ. 9,771 కోట్లు) పడిపోయాయి. ప్రధానంగా ఆయా క్లయింట్ల బాండ్లు, సెక్యూరిటీలు, ఇతరత్రా ఆర్థిక సాధనాలు క్షీణించడం ఇందుకు కారణం.

ఆరో రోజూ సెన్సెక్స్ పరుగులు

- 23,500 స్థాయి ఎగువకు నిఫ్టీ
- మళ్లీ సరికొత్త శిఖరాలపైకి సూచీలు
- విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు



ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు క్రమంగా పుంజుకోవడంతో స్టాక్ సూచీలు గురువారం తాజా గరిష్టాలకు చేరాయి. అధిక వెయిటేజీ రిలయన్స్(1%), ఐసీఐసీఐ (1%), హెచ్‌డీఎఫ్‌సీ (0.50%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 305 పాయింట్లు పెరిగి 77,643 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 141 పాయింట్లు లాభపడి 77,479 స్థిరపడింది. నిఫ్టీ 108 పాయింట్లు ఎగసి 23,624 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరికి 51 పాయింట్లు పెరిగి 23,567 వద్ద ముగిసింది. ప్రైవేటు బ్యాంకు లు, మెటల్, రియల్టీ, కమోడిటీ, ఇంధన, ఇండస్ట్రియల్ షేర్లు రాణించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1%, 0.58% లాభపడ్డాయి.

జోయాలుక్కాస్ 'ఇన్‌క్రెడిబుల్ జ్యువెలరీ సేల్ ఆఫర్'

హైదరాబాద్: జోయాలుక్కాస్ సంస్థ తన అత్యంత ఆకర్షణీయమైన 'ఇన్‌క్రెడిబుల్ జ్యువెలరీ సేల్ ఆఫర్'ను మళ్లీ ప్రకటించింది. ఇందులో భాగంగా అన్ని జ్యువెలరీల మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50% తగ్గింపు అందిస్తుంది. అదనంగా కస్టమర్లు ఉచిత జీవితకాల నిర్వహణ, ఏడాది పాటు ఉచిత బీమా, ప్రతి కొనుగోలుతో బై బ్యాక్ హామీ పొందవచ్చు. ఈ జూలై 14 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

బీఈఎల్ చైర్మన్‌గా మనోజ్ జైన్



బెంగళూరు: ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) చైర్మన్, ఎండీగా మనోజ్ జైన్ బాధ్యతలు చేపట్టారు. 2022 సెప్టెంబర్ నుంచి ఆర్‌అండ్‌డీ విభాగం డైరెక్టరుగా ఉన్న జైన్ 2023 ఆగస్టు నుంచి బెంగళూరు కాంప్లెక్స్ డైరెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మూడు దశాబ్దాల పైగా సుదీర్ఘానుభవం ఉన్న జైన్ పరిశోధన, అభివృద్ధి విభాగాల్లో పలు పురస్కారాలు కూడా అందుకున్నారు.

భారత మహిళల క్రికెట్ జట్టులో షబ్నమ్



విశాఖ స్పోర్ట్స్: దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరుగుతున్న క్రికెట్ సిరీస్‌లో పాల్గొంటున్న భారత జట్టులో అదనంగా మరో ప్లేయర్‌ను చేర్చారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల మీడియం పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్‌ను తొలిసారి భారత సీనియర్ జట్టులోకి ఎంపిక చేశారు. మూడు ఫార్మాట్లలోని (వన్డే, టెస్టు, టి20) టీమిండియాలో షబ్నమ్‌కు చోటు దక్కడం విశేషం. విశాఖపట్నంకు చెందిన షబ్నమ్ గత ఏడాది జనవరిలో జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది. ఈ ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) గుజరాత్ జెయింట్స్ తరఫున నాలుగు మ్యాచ్‌లు ఆడిన షబ్నమ్ నాలుగు వికెట్లు పడగొట్టింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టుతో జరుగుతున్న సిరీస్‌లో బెంగళూరు వేదికగా జరిగిన తొలి రెండు వన్డేల్లో భారత జట్టు గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే టీమిండియా సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఆదివారం బెంగళూరులోనే జరుగుతుంది.

భారత మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ మృతి



బనశంకరి: భారత జట్టు మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. బెంగళూరులోని కొత్తనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకశ్రీ లేఔట్ ఎస్‌ఎల్‌వీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో 4వ అంతస్తులోని తన ఫ్లాట్ నుంచి ఆయన కింద పడటంతో తీవ్ర గాయాలై మరణించారు. గురువారం ఉదయం గం. 11:15 సమయంలో ఈ సంఘటన జరిగింది. హాసన్ జిల్లా అరసికెరెకు చెందిన 52 ఏళ్ల డేవిడ్ జాన్సన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థిక సమస్యలు కూడా ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఫ్లాట్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలున్నాయి. 1996లో డేవిడ్ జాన్సన్ భారత జట్టు తరఫున 2 టెస్టులు ఆడి 3 వికెట్లు పడగొట్టాడు. న్యూఢిల్లీ వేదికగా 1996 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో అరంగేట్రం చేసిన జాన్సన్ రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీశాడు. అనంతరం అదే ఏడాది డిసెంబర్‌లో దర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో జాన్సన్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు సాధించాడు.

ఇంగ్లండ్, డెన్మార్క్ మ్యాచ్ 'డ్రా'



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గత రన్నరప్ ఇంగ్లండ్ జట్టు ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. డెన్మార్క్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌ను ఇంగ్లండ్ 1–1 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. ఇంగ్లండ్ తరఫున ఆట 18వ నిమిషంలో హ్యారీ కేన్ గోల్ చేయగా... 34వ నిమిషంలో హిజుల్‌మండ్ గోల్‌తో డెన్మార్క్ జట్టు స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. గ్రూప్ 'ఎ'లో స్కాట్లాండ్, స్విట్జర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో... గ్రూప్ 'సి'లో స్లొవేనియా, సెర్బియా మధ్య జరిగిన మ్యాచ్ కూడా 1–1తో 'డ్రా'గా ముగిశాయి.

అఫ్గాన్‌పై అలవోకగా...

'సూపర్-8'లో భారత్ విజయారంభం

- 47 పరుగులతో అఫ్గానిస్తాన్ చిత్తు
- మెరిసిన సూర్యకుమార్, హార్దిక్
- రాణించిన బుమ్రా, అర్ష్ దీప్
- రేపు బంగ్లాదేశ్‌తో తర్వాతి పోరు

టి20 ప్రపంచ కప్ 'సూపర్-8' దశలో భారత జట్టు తమ స్థాయిని ప్రదర్శించింది. అఫ్గానిస్తాన్ చక్కటి బౌలింగ్‌తో టీమిండియా ఆరంభంలో కాస్త తడబాటుకు గురైనా ఆపై సంపూర్ణ ఆధిపత్యం కొనసాగించింది. ఈ ఫార్మాట్‌లో తన నంబర్‌వన్ హోదాకు న్యాయం చేస్తూ, తనేంటూ నిరూపిస్తూ సూర్యకుమార్ యాదవ్ జట్టు భారీ స్కోరులో కీలకపాత్ర పోషించాడు. ఆ తర్వాత ఛేదనలో అఫ్గాన్ టీమ్ ఏ దశలోనూ కనీస స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయింది. టీమిండియా పదునైన బౌలింగ్‌ను ఎదుర్కోలేక వరుసగా వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను సమర్పించుకుంది. ఇక మరో ఆసియా జట్టు బంగ్లాదేశ్‌తో శనివారం భారత్ తర్వాతి సమరానికి సిద్ధమైంది.



సూర్యకుమార్



బుమ్రా

బ్రిడ్జ్‌టౌన్: వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ చేరే దిశగా భారత జట్టు కీలక విజయాన్ని అందుకుంది. సూపర్-8 గ్రూప్–1లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 47 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 53; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. రషీద్ ఖాన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (20 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్)దే అత్యధిక స్కోరు. బుమ్రా (3/7), అర్ష్‌దీప్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

కీలక భాగస్వామ్యం...

ఆరంభం నుంచే తడబడుతూ ఆడిన రోహిత్ శర్మ (13 బంతుల్లో 8; 1 ఫోర్) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఆ తర్వాత రషీద్ రెండు వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. నబీ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లతో జోరు ప్రదర్శించిన రిషభ్ పంత్ (11 బంతుల్లో 20; 4 ఫోర్లు) వికెట్ల ముందు దొరికిపోగా...రషీద్ తర్వాతి ఓవర్లో భారీ షాట్ ఆడే క్రమంలో విరాట్ కోహ్లి (24 బంతుల్లో 24; 1 సిక్స్) అవుటయ్యాడు. ఈ దశలో సూర్యకుమార్ దూకుడైన బ్యాటింగ్‌తో స్కోరు వేగంగా సాగింది. రషీద్ ఓవర్లో సూర్య ఫోర్, సిక్స్ కొట్టగా... అదే ఓవర్లో మరో ఎండ్‌లో శివమ్ దూబే (7 బంతుల్లో 10; 1 సిక్స్) పెవిలియన్ చేరాడు. ఇలాంటి సమయంలో సూర్యకు పాండ్యా జత కలిశాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో జట్టు మెరుగైన స్థితికి చేరింది. నూర్ ఓవర్లో పాండ్యా వరుసగా 4, 6 కొట్టగా... ఫజల్ ఓవర్లో సూర్య వరుసగా 6, 4 బాది 27 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే తర్వాతి బంతికే అతను అవుట్ కాగా, మరుసటి ఓవర్లో పాండ్యా ఆట ముగిసింది. జడేజా (5 బంతుల్లో 7; 1 ఫోర్) ప్రభావం చూపలేకపోగా, ఆఖరి ఓవర్లో అక్షర్ పటేల్ (6 బంతుల్లో 12; 2 ఫోర్లు) కీలక పరుగులు రాబట్టాడు. తొలి 10 ఓవర్లలో జట్టు 79 పరుగులు చేయగా, తర్వాతి 10 ఓవర్లలో 101 పరుగులు వచ్చాయి. ఈ మ్యాచ్ కోసం భారత్ ఒక మార్పు చేసింది. సిరాజ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ వచ్చాడు. మరోవైపు గురువారం మరణించిన భారత మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్‌కు నివాళిగా మన ఆటగాళ్లు నలుపు రంగు బ్యాండ్‌లు ధరించారు. అనంతరం లక్ష్య ఛేదనలో అఫ్గానిస్తాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. బుమ్రా తొలి ఓవర్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి గుర్బాజ్ (11; 1 ఫోర్, 1 సిక్స్) అవుట్ కావడంతో మొదలైన జట్టు పతనం వేగంగా సాగింది. ఎవరు కూడా భారత బౌలింగ్ ముందు పట్టుదలగా నిలవలేకపోయారు. చెప్పుకోదగ్గ బౌలింగ్ వనరులు ఉన్నా ...ఎప్పటిలాగే బ్యాటర్ల వైఫల్యం దెబ్బ తీసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రషీద్ (బి) ఫజల్ 8; కోహ్లి (సి) నబీ (బి) రషీద్ 24; పంత్ (ఎల్బీ) (బి) రషీద్ 20; సూర్యకుమార్ (సి) నబీ (బి) ఫజల్ 53; దూబే (ఎల్బీ) (బి) రషీద్ 10; పాండ్యా (సి) అజ్మతుల్లా (బి) నవీన్ 32; జడేజా (సి) గుల్బదిన్ (బి) ఫజల్ 7; అక్షర్ (రనౌట్) 12; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1–11, 2–54, 3–62, 4–90, 5–150, 6–159, 7–165, 8–181. **బౌలింగ్:** ఫజల్ హక్ 4–0–33–3, నబీ 3–0–24–0, నవీన్ ఉల్ హక్ 4–0–40–1, రషీద్ ఖాన్ 4–0–26–3, నూర్ అహ్మద్ 3–0–30–0, అజ్మతుల్లా 2–0–23–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) పంత్ (బి) బుమ్రా 11; హజ్రతుల్లా (సి) జడేజా (బి) బుమ్రా 2; ఇబ్రహీమ్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8; గుల్బదిన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 17; అజ్మతుల్లా (సి) అక్షర్ (బి) జడేజా 26; నజీబుల్లా (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 19; నబీ (సి) జడేజా (బి) కుల్దీప్ 14; రషీద్ (సి) జడేజా (బి) అర్ష్‌దీప్ 2; నూర్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 12; నవీన్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 0; ఫజల్‌హక్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 134. వికెట్ల పతనం:** 1–13, 2–23, 3–23, 4–67, 5–71, 6–102, 7–114, 8–121, 9–121, 10–134. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–36–3, బుమ్రా 4–1–7–3, అక్షర్ పటేల్ 3–1–15–1, హార్దిక్ పాండ్యా 2–0–13–0, కుల్దీప్ 4–0–32–2, జడేజా 3–0–20–1.

చెలరేగిన సాల్ట్

- 'సూపర్-8'లో ఇంగ్లండ్ బోణీ
- విండీస్‌పై 8 వికెట్లతో గెలుపు



సాల్ట్

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. టి20 ప్రపంచకప్ 'సూపర్-8' దశలో శుభారంభం చేసింది. ఆతిథ్య వెస్టిండీస్‌తో గురువారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 17.3 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 87 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. కెప్టెన్ జోస్ బట్లర్ (22 బంతుల్లో 25; 2 ఫోర్లు), మొయిన్ అలీ (10 బంతుల్లో 13; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఒకదశలో ఇంగ్లండ్ విజయానికి 42 బంతుల్లో 70 పరుగులు అవసరమయ్యాయి. విండీస్ బౌలర్ రొమారియో షెఫర్డ్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో సాల్ట్ చెలరేగిపోయి 4,6,4,6,6,4తో ఏకంగా 30 పరుగులు సాధించి ఫలితాన్ని ఇంగ్లండ్‌వైపు తిప్పాడు. మూడో వికెట్‌కు బెయిర్‌స్టో (26 బంతుల్లో 48 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి సాల్ట్ 97 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని జోడించి ఇంగ్లండ్‌ను 15 బంతులు మిగిలి ఉండగానే గెలుపు తీరాన్ని చేర్చాడు. అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 180 పరుగులు సాధించింది. జాన్సన్ చార్లెస్ (34 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (32 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (17 బంతుల్లో 36; 5 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (15 బంతుల్లో 28 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్, ఆదిల్ రషీద్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్ ఒక్కో వికెట్ తీశారు.

టి20 ప్రపంచకప్‌లో నేడు
ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక: నార్త్‌సౌండ్; ఉదయం గం. 6 నుంచి
ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: గ్రాస్‌ఐలెట్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హైదరాబాద్‌లో భారత్, బంగ్లాదేశ్ టి20 మ్యాచ్

స్వదేశంలో టీమిండియా షెడ్యూల్ విడుదల



న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత పురుషుల క్రికెట్ జట్టు స్వదేశంలో 5 టెస్టులు, 3 టి20 మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్‌లో భారత్‌లో బంగ్లాదేశ్ జట్టు పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భారత్‌తో బంగ్లాదేశ్ 2 టెస్టులు, 3 టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. అక్టోబర్ 12న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మూడో టి20 మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. న్యూజిలాండ్‌తో సిరీస్ ముగిశాక భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించి ఐదు టెస్టులు ఆడుతుంది. ఆస్ట్రేలియా నుంచి తిరిగి వచ్చాక భారత జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు టి20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడుతుంది.

భారత్ జట్టు షెడ్యూల్

బంగ్లాదేశ్‌తో
- తొలి టెస్టు: సెప్టెంబర్ 19–23 (చెన్నై)
- రెండో టెస్టు: సెప్టెంబర్ 27–అక్టోబర్ 1 (కాన్పూర్)
- తొలి టి20: అక్టోబర్ 6 (ధర్మశాల)
- రెండో టి20: అక్టోబర్ 9 (న్యూఢిల్లీ)
- మూడో టి20: అక్టోబర్ 12 (హైదరాబాద్)

న్యూజిలాండ్‌తో
- తొలి టెస్టు: అక్టోబర్ 16–20 (బెంగళూరు)
- రెండో టెస్టు: అక్టోబర్ 24–28 (పుణే)
- మూడో టెస్టు: నవంబర్ 1–5 (ముంబై)

ఇంగ్లండ్‌తో
- తొలి టి20: జనవరి 22 (చెన్నై)
- రెండో టి20: జనవరి 25 (కోల్‌కతా)
- మూడో టి20: జనవరి 28 (రాజ్‌కోట్)
- నాలుగో టి20: జనవరి 31 (పుణే)
- ఐదో టి20: ఫిబ్రవరి 2 (ముంబై)
- తొలి వన్డే: ఫిబ్రవరి 6 (నాగ్‌పూర్)
- రెండో వన్డే: ఫిబ్రవరి 9 (కటక్)
- మూడో వన్డే: ఫిబ్రవరి 12 (అహ్మదాబాద్)

క్లుప్తంగా...

సీనియర్ అడ్వొకేట్ల ఎంపిక కమిటీలో ఏఏజీ

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన శాశ్వత కమిటీలో సభ్యునిగా సీనియర్ న్యాయవాది, ఏఏజీ నరసింహశర్మ నియమితులయ్యారు. గతంలో ఈయన స్థానంలో సీనియర్ న్యాయవాది రవీందర్‌రావు బాధ్యతలు నిర్వహించారు. శాశ్వత కమిటీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి (సీజేతో పాటు ఇద్దరు సీనియర్ జడ్జిలు)తో పాటు సభ్యులుగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, నరసింహశర్మ ఉంటారు. ఈ కమిటీ అన్ని అర్హతలు పరిశీలించి న్యాయవాదులకు సీనియర్ హోదాను కల్పిస్తుంది.

15 రెవెన్యూ డివిజన్లలో సబ్ కలెక్టర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఇక్కడ ఆర్డీఓలకు బదులు ఐఏఎస్ కేడర్ అధికారులను నియమించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పలు రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్ హోదాతో కొనసాగినప్పటికీ...రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు తర్వాత అన్నింటా ఆర్డీఓలనే ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. తాజాగా ఆయా ప్రాంతాల్లో పరిపాలన సులభతరం కోసం హోదాను పెంచింది. సబ్ కలెక్టర్ హోదాకు మార్చిన రెవెన్యూ డివిజన్‌లన్నీ దాదాపు గిరిజన ప్రాంతాలే కావడం గమనార్హం. ఉట్నూర్, భద్రాచలం, కాటారం, కామారెడ్డి, బాన్సువాడ, కల్లూరు, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, అచ్చంపేట, మిర్యాలగూడ, దేవరకొండ, భైంసా, బోధన్, నారాయణఖేడ్, తాండూరు రెవెన్యూ డివిజన్లకు త్వరలో సబ్ కలెక్టర్లుగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించనుంది.

24 నుంచి జూడాల నిరవధిక సమ్మె

సాక్షి, హైదరాబాద్: తాము ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు తెలంగాణ జూనియర్ డాక్టర్లు (జూడా) సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నెల 24వ తేదీ నుంచి నిరవధికంగా సమ్మె చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. స్టైపెండ్‌ను సకాలంలో విడుదల చేయడానికి గ్రీన్ చానల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి కోసం కొత్త భవనం, వైద్యుల కోసం కొత్త హాస్టల్ భవనాలు నిర్మించాలని వారు కోరుతున్నారు. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనాన్ని అమలు చేయాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా సమస్యలు పరిష్కరించాలని అంటున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సరిపడా మౌలిక సదుపాయాలు లేవని, కాకతీయ మెడికల్ కాలేజీలో రోడ్లు సరిగా లేవని వారు చెపుతున్నారు. గతంలో సమ్మెకు పిలుపునిచ్చామని, ప్రభుత్వ పెద్దల రాజీతో ఆనాడు సమ్మెను వాయిదా వేశామని తెలిపారు. తమ డిమాండ్లనన్నింటినీ పూర్తిగా పరిష్కరించని పక్షంలో 24న సమ్మెను ప్రారంభించి నిరవధికంగా కొనసాగిస్తామని జూడాల సంఘం నేతలు ప్రకటించారు.

బోగీల్లో మంటలు

వరుస అగ్ని ప్రమాదాలతో ప్రయాణికుల్లో ఆందోళన	రైల్వేయార్డులు, పిట్‌లైన్‌లలో భద్రత కరువు	అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్/ సికింద్రాబాద్:

నగరంలోని ఏదో ఒక రైల్వేస్టేషన్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఏసీ బోగీల్లో మంటలు చెలరేగిన సమయంలో అదృష్టవశాత్తు ప్రయాణికులెవరూ లేరు.

- గతంలో నాంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పైన నిలిపి ఉన్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇలాగే మంటలు చెలరేగాయి. అప్పటికే ప్రయాణికులు దిగి వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రైన్‌లో పేలుడు స్వభావం ఉన్న పదార్థాల వల్లనే మంటలు అంటుకున్నట్టు అప్పట్లో గుర్తించారు.
- సికింద్రాబాద్ స్టేషన్‌లోనూ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ కూడా ప్రమాదానికి గురైంది. విశాఖ నుంచి నగరానికి చేరుకున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ రైల్వే యార్డుకు చేరుకున్న కొద్దిసేపటికే అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన నాలుగేళ్ల క్రితం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగిన కొద్ది సేపటికే ఈ ప్రమాదం జరగడం గమనార్హం .ఒకవేళ యార్డుకు చేరుకోకముందే అగ్ని ప్రమాదం చోటుచేసుకొని ఉంటే భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేది.

ఇలా తరచుగా ఏదో ఒక ట్రైన్‌లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని రైళ్లలో పొగలు రావడంతోనే గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు భారీ ఎత్తున మంటలు అంటుకొని ప్రయాణికులు, అధికారులు, సిబ్బందిని భయాందోళనకు గురిచేసిన సంఘటనలూ ఉన్నాయి.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమా..



రైల్వేయార్డులు, వాషింగ్‌లైన్‌లు, పిట్‌లైన్‌లలో నిలిపి ఉంచే బోగీలకు భద్రత ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. కోచ్‌లను శుభ్రం చేసేందుకు రైళ్లను పిట్‌లైన్‌లకు తరలిస్తారు. కొన్నింటిని డిపోల్లో నిలిపివేస్తారు. రైళ్లు, బోగీలు ఎక్కడ నిలిపి ఉంచినా, వాటిపైన భద్రతా సిబ్బంది నిఘా కొరవడుతోంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు ఈ బోగీలు అడ్డాలుగా మారుతున్నాయి. తాగుబోతులు, ర్యాగ్‌పిక్కర్స్, అసాంఘిక శక్తులు రాత్రి వేళల్లో బోగీల్లో తిష్టవేస్తూ మద్యం సేవిస్తున్నారు. సిగరెట్లు, గంజాయి వంటివి తాగి మండుతున్న పీకలను బోగీల్లోనే వేస్తున్నారు. దీంతో సిగరెట్ పీకలు, వెలిగించిన అగ్ని పుల్లలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

- ఏసీ బోగీల నిర్వహణలో వైఫల్యం వల్ల తరచూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏసీ బోగీల్లో ప్రయాణికులు చెత్తాచెదారం, ఆహారపదార్థాలు వదిలేస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ఎలుకలు, బొద్దింకలు వచ్చి చేరుతున్నాయి. ఎలుకలు తరచుగా విద్యుత్ వైర్లు కట్ చేయడం వల్ల షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరుగుతున్నట్టు రైల్వే భద్రతా నిపుణుడు ఒకరు చెప్పారు. ఆర్పీఎఫ్, జీఆర్‌పీ వంటి పోలీసు విభాగాలు పిట్‌లైన్‌లు, యార్డుల్లో నిరంతరం నిఘా కొనసాగించాలి. బయటి వ్యక్తులు యార్డుల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

ఏసీ కోచ్‌ల్లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి గురువారం ఉదయం 10.30 గంటలకు ఏసీ కోచ్‌లను వాషింగ్ కోసం మెట్టుగూడ వద్దనున్న క్లీనింగ్ పిట్ యార్డ్ తీసుకెళ్లారు. క్లీనింగ్ పూర్తయ్యాక 11 గంటల ప్రాంతంలో తిరిగి రైల్వే స్టేషన్‌కు తరలిస్తుండగా ఏసీ బోగీల్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి, దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఇది గమనించిన చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రైల్వే అధికారులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే సిబ్బంది స్టేషన్లో మంటలు ఆర్పే యంత్రాలతో తగలబడుతున్న బోగీలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలోనే అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేశాయి. రైలు కోచ్‌లలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. విషయం తెలియగానే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంపై సమీక్షించి, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారులను ఆదేశించారు.

ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు

మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికే 'మహిళా శక్తి' • మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికే 'మహిళా శక్తి'కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి మహిళలకు విముక్తి కల్పించేందుకే.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఐదేళ్లలో ఈ సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందిస్తామన్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రజల అవసరాలు, వనరుల లభ్యతకు తగ్గట్టుగా బిజినెస్ మోడల్ ఉండాలన్నారు. స్థానికంగా లభ్యమయ్యే వస్తువుల ఆధారంగా వ్యాపారం చేస్తే అద్భుతాలు సాధించగలమన్నారు. ఇందుకు అనుగుణంగా మహిళా సంఘాల కోసం మంచి బిజినెస్ మోడళ్లను అధికారులు గుర్తించాలని సూచించారు. మహిళా సంఘాలను డిమాండ్ ఉన్న వ్యాపారాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళల ఉన్నతితోనే తెలంగాణ ప్రగతి సాధ్యమని.. ఆధార్ కేంద్రాలు, మీసేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేలా మహిళా సంఘాలకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయుతనందించేందుకు కలెక్టర్లతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో మహిళా శక్తి రాష్ట్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక తయారీపై డీఆర్‌డీవోలు, అదనపు డీఆర్‌డీవోలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. పీఆర్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులే 'మహిళా శక్తి'కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్లు అని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో అందించిన అధికారులను అభినందించారు. ఆగస్టు 15 న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరో జత యూనిఫామ్ అందించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. పీఆర్‌ఆర్‌డీ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఐఆర్డీ సీఈవో కాత్యాయిని, స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా, ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్, శ్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నేడు మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రెండు మహిళా శక్తి క్యాంటీన్లను పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రారంభించనున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా మహిళల ఆర్థిక పురోగతికి కృషి చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా వీటికి మంత్రి తుదిరూపునిచ్చారు. బిహార్‌లో అమలు చేస్తున్న దీదీ-కి-రసోయి మోడల్‌కు అనుగుణంగా రాష్ట్రంలో మహిళా శక్తి క్యాంటీన్లను రూపొందిస్తున్నారు. సచివాలయంతో పాటు కలెక్టర్ ఆఫీస్ కేంద్రాలు, ఆసుపత్రులు, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో వీటిని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. రెండేళ్లలో జిల్లాకు ఐదు చొప్పున మొత్తం 150 క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. క్యాంటీన్లు పెట్టే మహిళాసంఘాలకు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ, వివిధ రూపాల్లో ప్రభుత్వ సహకారాన్ని అందించనున్నారు. క్యాంటీన్ల మోడళ్లను బట్టి ఒక్కో దానికి ఏటా రూ.ఏడున్నర లక్షల నుంచి రూ.12 లక్షల దాకా లాభం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ఇంజిన్‌లో మంటలు

పైలట్ అప్రమత్తతతో మలేసియా ఎయిర్‌లైన్స్ విమానానికి తప్పిన పెను ప్రమాదం

సుమారు రెండున్నర గంటలకుపైగా గాల్లో చక్కర్లు కొట్టి సురక్షితంగా ల్యాండింగ్

శంషాబాద్: మలేసియా విమానానికి పెను ప్రమాదం తప్పింది.. శంషాబాద్ విమానాశ్రయం నుంచి కౌలాలంపూర్‌కు టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. అయితే పైలట్ అప్రమత్తమై విమానాన్ని తిరిగి సురక్షితంగా ల్యాండ్ చేశారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. మలేసియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎంహెచ్-199 విమానం బుధవారం అర్ధరాత్రి 12.45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి కౌలాలంపూర్ బయలుదేరేందుకు టేకాఫ్ తీసుకుంది. టేకాఫ్ తీసుకున్న కొద్ది నిమిషాలకే కుడివైపు ఇంజిన్ ప్రాంతంలో నిప్పురవ్వలు ఎగజిమ్ముతుండటంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే శంషాబాద్ ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)కి సమాచారం అందించారు. విమానంలో ఇంధనం ఎక్కువగా ఉండటంతో వెంటనే ల్యాండింగ్ చేసేందుకు సురక్షితం కాదనే ఉద్దేశంతో ఏటీసీ అనుమతి అలస్యంగా లభించినట్లు సమాచారం. ఏటీసీ అనుమతి అనంతరం తెల్లవారుజామున 3.19 గంటలకు విమానాన్ని సురక్షితంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులోనే ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులు, అందులోని సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. విమానంలో 130 మంది ప్రయాణికులు ఉండగా పైలట్‌లు, ఇతర సిబ్బంది మరో 8 మంది ఉన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిలిచిపోయిన మలేసియన్ ఎయిర్‌లైన్స్ విమానం

జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసుల సత్తా

యూఎన్ పీస్ కీపింగ్ మిషన్ పరీక్షలో 19 మంది ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: ఐక్యరాజ్యసమితికి చెందిన యూఎన్‌పీస్ కీపింగ్ మిషన్‌కు అధికారుల ఎంపిక కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. తెలంగాణ నుంచి మొత్తం 19 మంది అధికారులు ఈ పరీక్షలో అర్హత సాధించారు. ఇందులో ఎంపిక చేసిన వారిని శాంతిభద్రతలు లోపించిన దేశాల్లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కొంతకాలంపాటు పనిచేసేందుకు డిప్యుటేషన్‌పై నియమిస్తారు. యూఎన్‌ఏకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీస్ కీపింగ్ ఆపరేషన్స్‌కు చెందిన అధికారులు న్యూయార్క్ నుంచి వచ్చి ఈనెల 6 నుంచి 15 వరకు ఢిల్లీలోని 22వ బెటాలియన్, ఐటీబీపీ కార్యాలయాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్స్, డ్రైవింగ్, ఫైరింగ్ అంశాలపై పరీక్షలు పెట్టారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 225 మంది పోలీసు అధికారులు ఇందులో పాల్గొనగా 164 మంది అర్హత సాధించారు. తెలంగాణ నుంచి అర్హత సాధించిన వారిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ దేవేందర్ సింగ్, హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ కె.ఎం.కిరణ్ కుమార్, తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ నర్సింగరావు, కమాండెంట్ అలెక్స్, నార్కోటిక్ బ్యూరో ఏసీపీ చల్లా శ్రీధర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ప్రతాప్, ఏసీపీలు జూపల్లి రమేశ్, మాజీదాలీ ఖాన్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్, విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఇతర అధికారులున్నారు.



అన్నారం బరాజ్‌ను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం (సరస్వతీ)బరాజ్‌ను పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నిపుణుడు ధనుంజయ్ నాయుడు ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల బృందం పరిశీలించింది. గురువారం ఈ బృందం బరాజ్ అప్, డౌన్ స్ట్రీమ్ తీరుతెన్నులు తెలుసుకుంది. బృందం బరాజ్‌లోని 26 నుంచి 45వ వెంట్ వరకు బోర్‌వెల్ డ్రిల్ పనులను పరిశీలించింది. శుక్రవారం ఉదయం వరకు పుణే నుంచి పరీక్షల పరికరాలు బరాజ్‌కు చేరనున్నాయి. భూగర్భంలో జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను వారంపాటు జరపనున్నారు. ఓవైపు మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌లో మరమ్మతుల వేగం పెరిగినప్పటికి, వర్షాకాలంలో నీటిని నిల్వ చేయడం కష్టంగా ఉంది. కాగా, అన్నారం నుంచి ఎగువన సుందిళ్లకు నీటిని తరలించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



అన్నారం బరాజ్‌ని పరిశీలిస్తున్న నిపుణుల బృందం

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.